సంపుటము–I
సమావేశము–XXX
నంబరు. 4

వెల : రూ. 12–00
12 మార్చి, 2018
సోమవారము
హేవళంబి నామ సం.
ఫాల్గుణ బ. 10

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
| --- | --- | --- |
| (1) | ప్రశ్నోత్తరాలు | 01–28 |
| (2) | సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు | 29–30 |
| (3) | సభా కార్యక్రమం – ప్రకటనలు | 30–30 |
| (4) | గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ – కొనసాగింపు | 31–58 |
| (5) | గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ముఖ్యమంత్రి ప్రత్యుత్తరం | 58–87 |


J. No. 137/18

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ ఎన్. ఎం.డి. ఫరూక్ |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీమతి పామిడి శమంతకమణి |
| | | శ్రీ వాకాటి నారాయణ రెడ్డి |
| | | శ్రీ బొడ్డు నాగేశ్వర రావు |
| కార్యదర్శి (ఇన్‌ఛార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ కె. రాజకుమార్ |
| | | శ్రీమతి ఆర్. వనితారాణి |
| | | డా. వై. కామేశ్వరి |
| | | శ్రీ ఇ. సంజీవరావు |
| | | శ్రీ కె. వెంకటేశ్వరరావు |
| | | శ్రీ డి. జగన్‌మోహన్‌రావు |
| | | శ్రీ బి. ప్రభాకరరావు |
| | | శ్రీమతి కె. భారతి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్

## సోమవారం, 12వ తేది, మార్చి, 2018

----

(సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది)

( గౌరవ అధ్యక్షులు అధ్యక్ష స్థానం వహించారు )

**MR.CHAIRMAN:** Now Question Hour. Question No. 10186, Minister for Irrigation.

1. ప్రశ్నోత్తరాలు

### మున్నేరు క్రింద వ్యవసాయ యోగ్యమైన భూమి

ప్రశ్న నెం.10186(25)

**శ్రీ టి.డి. జనార్థన్, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన జల వనరుల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** మున్నేరు నది క్రింద సాగు చేయదగిన భూమి విస్తీర్ణం ఎంత;

**ఆ)** మున్నేరు నదికి గండిపడిన విషయం వాస్తవమేనా;

**ఇ)** అయితే, దానిపై తీసుకున్న చర్య ఏమిటి?

**గౌరవనీయులైన జల వనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

**అ)** మున్నేరు ఆనకట్ట క్రింద 3 మండలాలు అంటే వత్సవాయి, పెనుగంచిప్రోలు మరియు నందిగామలలోని 25 గ్రామాలకు ప్రయోజనం కలిగిస్తున్న 16,427 ఎకరాలు.

**ఆ)** అవునండీ, 2012, సెప్టెంబరు నెలలో భారీ వరద నీటి ప్రవాహం కారణంగా, 100 మీటర్ల పొడవు మేరకు కుడివైపు భాగం వద్ద మున్నేరు నదికి గండి పడింది.

**ఇ)** గండిని పూడ్చడానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించడమయింది. తదనుసారంగా గండి పనులను పునరుద్ధరించడానికి రూ.182.0 లక్షలకు ప్రభుత్వం పరిపాలన ఆమోదాన్ని ఇచ్చింది. గండిని పూడ్చకముందే ప్రవాహ గట్టులను ఏర్పాటు చేయవలసి ఉంది. ఇందు కోసం తెలంగాణ రాష్ట్రంలో భూసేకరణ చేయవలసివుంది. సర్వే పనిని ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించడమయింది. ఆ పని పురోగతిలో ఉంది.

**శ్రీ టి.డి. జనార్దన్(నామినేటెడ్):** అధ్యక్షా, ఈ ప్రాజెక్టు బ్రిటిష్‌కాలం నుండి ఉన్నది. గౌరవ మంత్రిగారు చెప్పినట్లు దాదాపు 16,427 ఎకరాల ఆయకట్టు అధికారికంగా ఉంది, కానీ 25,000ఎకరాల వరకూ సాగు అవుతోంది. కాబట్టి దీనికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది. ఇక్కడ గండి పడడం వలన గత సంవత్సరం పంటలకు ఇబ్బంది ఏర్పడింది. దాదాపు ఏడాది కాలం గడచిపోయింది. ఇప్పుడు వేసవికాలం కాబట్టి పనులు చేపట్టడానికి వీలుంటుంది. కాబట్టి దీని మీద ఎవరైనా ఒక అధికారికి బాధ్యత అప్పగించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయించాలని కోరుతున్నాను. ఎస్టిమేట్స్ తయారయ్యాయి, గండి పూడ్చడానికి నిధులు మంజూరు చేశామన్నారు కానీ టెండర్లు పిలవలేదు. తక్షణమే టెండర్లు పిలిచి పని మొదలు పెట్టించాలని కోరుతున్నాను. గౌరవ మంత్రిగారు చెప్పినట్లు గండిని పూడ్చకముందే ప్రవాహగట్టులను ఏర్పాటు చేయాల్సి ఉన్నది, దానికి సర్వే టీమ్‌ను పంపారు, ఇప్పుడు సర్వే ప్రారంభం అయ్యింది, దానికి కూడా నిర్ణీత గడువులోపు సర్వే చేయించి, తెలంగాణా ప్రభుత్వంతో మాట్లాడి ప్రవాహగట్టులకు కూడా ఎస్టిమేట్స్ తయారు చేయించి ముందే మంజూరు చేయించాలని కోరుతున్నాను. ఏదిఏమైనా, రాబోయే సీజన్‌లో రైతుల పంటలకు నష్టం కలగకుండా జూన్ నుండి పంటలు పండించడం మొదలవుతుంది కాబట్టి మే నెలాఖరుకల్లా ఈ కార్యక్రమం పూర్తయ్యేలా బాధ్యతగల అధికారిని నియమించి ప్రతివారం సమీక్షిస్తే తప్ప ఈ 25,000ఎకరాల ఆయకట్టుని కాపాడుకోలేము. దానిమీద శ్రద్ధ తీసుకుని దానికి కావాల్సిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు జనార్దన్ గారు చెప్పినట్లు, స్థానిక శాసనసభ సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ గారు అలాగే మాజీ మంత్రి నెట్టెం రఘురాం గారు కూడా ఈ ప్రాజెక్టుమీద చాలా శ్రద్ధ పెట్టి ముఖ్యమంత్రిగారి దృష్టికి కూడా తీసుకువచ్చారు. సెంట్రల్ వాటర్ కమిషన్ నుండి మున్నేరు ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.66.36 కోట్లకు అప్రూవల్ వచ్చింది. అలాగే జైకా సమావేశానికి కూడా మా అధికారులు దిల్లీ వెళ్లారు. గౌరవ సభ్యులు శ్రీ జనార్దన్ గారు చెప్పినట్లు కాలువ పొడవు వెడల్పులకు సంబంధించి 49.5కిలోమీటర్లు ఉంది. ముందుగా గండి పూడ్చి, గట్టు పనులు కూడా జూన్ లోపల పనులు పూర్తి చేసినట్లయితే వత్సవాయి మండలంలో 6 గ్రామాలు, పెనుగంచిప్రోలు మండలంలో 3 గ్రామాలు, నందిగామ మండలంలో 10 గ్రామాలు మొత్తం 19 గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. త్రాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు అత్యంత ప్రాధాన్యత గల ప్రాజెక్టు ఇది. జలయజ్ఞం ధనయజ్ఞంలో పదిసంవత్సరాల కాలంలో ఈ ప్రాజెక్టును అడ్డదిడ్డంగా కట్టి దండకారణ్యం చేశారు. ఈ ప్రాజెక్టు మీద

శ్రద్ధ పెట్టి ఇవన్నీ కూడా ఒక పద్ధతిలో తీసుకువచ్చాము. తప్పకుండా ప్రత్యేకంగా అధికారులను పంపించి మరొక్కసారి ఎక్స్‌పర్ట్ కమిటీని పంపించి ముందు దశల వారీగా మే, జూన్ లోపు పూర్తి చేసి పంటలకు నీళ్లు ఇచ్చేవిధంగా, త్రాగునీరు, సాగునీరుకు ఇబ్బంది లేకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయవలసి ఉంటుంది కాబట్టి పూర్తి స్థాయిలో ఏవిధంగా పూర్తిచేయాలో అవన్నీ చేస్తామని గౌరవసభ్యులకు, రాష్ట్ర ప్రజానీకానికి మీద్వారా తెలియజేస్తున్నాను.

**శ్రీ టి.డి.జనార్ధన్:** అధ్యక్షా, రూ.63కోట్లు మంజూరు చేశామని మంత్రిగారు చెప్పారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనుల పట్ల చూపుతున్న శ్రద్ధకు అభినందిస్తున్నాను. ముఖ్యంగా దేవినేని ఉమామహేశ్వర రావు గారు ఇరిగేషన్ మంత్రి అయిన తరవాత ఇరిగేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఎందుకంటే బ్రిటీష్ కాలం నుండి ఉన్న ప్రాజెక్టులో మొత్తం 49 కిలోమీటర్ల లైనింగ్‌కు జైకా ఫండ్స్ ప్రతిపాదన చేశారంటే జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల తరపున అక్కడున్న రైతాంగం తరపున ప్రభుత్వాన్ని అభినందిస్తూ, కృతజ్ఞత తెలియజేస్తున్నాను. అంతేకాకుండా రూ.63కోట్లు కూడా మంజూరు చేసి, పనులు త్వరగా చేయించినట్లయితే డెల్టాలో గోదావరి నీళ్లు వచ్చిన తరవాత పంటలు బాగా పండినట్లే ఇక్కడ కూడా రైతాంగానికి ఉపయోగపడుతుంది. కాబట్టి టైం ప్రకారం చేయించమని మరొక్క సారి కోరుకుంటున్నాను. పూర్వం స్వర్గీయ శ్రీ వై.ఎస్ రాజశేఖర రెడ్డి గారు జలయజ్ఞం పేరుతో దానికి బ్యారేజ్ కడతామని పనులు ప్రారంభించారు. ఆ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ ఆ పనులు పూర్తి కాలేదు. పూర్తి కాకపోగా ఆశ్చర్యం ఏమంటే, గేట్లు రెడీగా ఉన్నాయి, లైనింగ్ కూడా పూర్తికాకుండా ఆ కాంట్రాక్టరుకు బిల్లు చేసి పంపించింది. ఇప్పుడు ఆ లైనింగ్ వర్కు కూడా చేయించాల్సి ఉన్నది, ఆ విషయాన్ని కూడా గమనించాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమా మహేశ్వరరావు:** అధ్యక్షా, ఇది వంద సంవత్సరాల చరిత్ర గల ప్రాజెక్టు ఇది. బ్రిటిష్ కాలంలో ప్రారంభించబడింది. 2006లో రూ.18.86కోట్లతో టెండర్లు పిలిచి, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చారు. మరలా 2010లో దానిని రూ.32.66 కోట్లకు చేర్చారు. మరలా వరద వచ్చిన తరవాత కట్టింది మొత్తం కొట్టుకుపోయే పరిస్థితి ఉన్నది. దీనిమీద కూడా పూర్తిస్థాయిలో విచారణ చేసి వెంటనే పనులు పూర్తి చేసి జూన్‌కు ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తాము.

**MR.CHAIRMAN:** Question No.10064(26), Minister for Irrigation.

## జలవనరుల శాఖలో ఆయకట్టు సంఘాలు

ప్రశ్న నెం.10064(26)

శ్రీ గుండుమల తిప్పేస్వామి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన జలవనరుల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలో చెరువుల కోసం ఆయకట్టు సంఘాలను ఎప్పటిలోగా ఏర్పాటు చేయడమవుతుంది;

ఆ) ఎన్నికల ప్రక్రియ వివరాలేమిటి?

**గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు):**

**అ)** సిఎడిఎ క్రింద ఎటువంటి ఆయకట్టు సంఘాలు నిర్వహణలో లేవు.

**ఆ)** ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ గుండుమల తిప్పేస్వామి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, గౌరవ మంత్రిగారు చాలా సులభమైన సమాధానం చెప్పారు. రాష్ట్రంలోని చెరువుల నిర్వహణకు ఏ విధానం అమలులో ఉన్నది, భవిష్యత్తులో ఆ విధానాలలో ఏమైనా మార్పులు చేర్పులు తీసుకువచ్చే అవకాశం ఉన్నదా, ఎప్పటిలోగా తీసుకువస్తారు, ఏ విధానాలు తీసుకువస్తారనే వివరాలు సభకు తెలియజేయాల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం దగ్గర దగ్గర సాగునీటి సంఘాల తరహాలోనే పనిచేస్తాయి. ఆంధ్రప్రదేశ్ ఏదైతే నీటిపారుదల వ్యవస్థలో రైతుల యాజమాన్య చట్టం 1997 ప్రకారం నీటివినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి నాయకత్వంలో ఉమ్మడి రాష్ట్రంలో నీటి సంఘాలు ఈ దేశానికే ఆదర్శవంతంగా పనిచేశాయి. నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6138 నీటి సంఘాలు పనిచేశాయి. దాదాపు 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు పనిచేశాయి. దాదాపు 53 ప్రాజెక్టు కమిటీలలో 49 ప్రాజెక్టు కమిటీలు పనిచేశాయి.

ఉ.10.10

అధ్యక్షా, నీటి సంఘాలకు ఒక ఏకాభిప్రాయంతో మొన్ననే ఎన్నికలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,138 నీటి సంఘాలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 245, ప్రాజెక్టు కమిటీలు సుమారు 53 ప్రాజెక్టు కమిటీలకు గానూ, 49 ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. వీటికి కూడా కొత్తగా వచ్చిన చట్టం ద్వారా జూన్ నెలలో ఎన్నికలు జరపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానికి సంబంధించిన హైడ్రలాజికల్ పర్టిక్యులర్స్ అన్నీ తీసుకుని బేసిన్ వైజ్‌గా, సబ్ బేసిన్ వైజ్‌గా వాటర్ యూజర్ కమిటీ లిస్టులు తయారుచేసే కార్యక్రమంలో సంబంధిత అధికారులు నిమగ్నమై ఉన్నారు. తప్పకుండా ఏపిఐడిసి కింద ఉన్న స్కీంలు కానీ, మ్యాక్స్ యాక్ట్ కింద ఉన్న సొసైటీలు గానీ, రకరకాల సొసైటీలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి తప్పకుండా జూన్‌లో ఎన్నికలు జరపాలని ప్రభుత్వం శ్రద్ధ పెట్టి ముందుకెళ్తోంది. 116 రోజుల జల సంరక్షణ ఉద్యమంలో కూడా నీటి సంఘాలను, ప్రజాప్రతినిధులను అందరినీ

భాగస్వాముల్ని చేశాము. పెద్దయెత్తున చెరువులలో కాలువలలో పూడిక తీత పనులు కూడా జరుగుతున్నాయి. వీటికి సంబంధించి గౌరవసభ్యులకు పూర్తి సమాచారం తెలియజేయడమవుతుంది. బేసిన్స్, సబ్ బేసిన్స్‌తో పాటు ఒక వర్కుషాపు కండక్ట్ చేసి జిల్లాలో ప్రజాప్రతినిధులను ఇన్వాల్వ్ చేసేవిధంగా ఆ నీటి సంఘాల పరిధిని నిర్ణయించబోతున్నామని, రైతాంగం, సంబంధిత అధికారులు, సంఘ సభ్యులందరూ కలిసి కూర్చొని నిర్ణయాలు తీసుకుంటారని మీ ద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

## షాదీఖానాలకు నిధులు

ప్రశ్న నెం.10062(21)

**శ్రీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) 2017-18 ఆర్థిక సంవత్సరంలో షాదీఖానాలకు ఎంత మొత్తం నిధులను కేటాయించారు; అందులో ఎంత మొత్తం ఖర్చు చేశారు;

ఆ) అంచనాల వివరాలతోపాటు షాదీఖానాల కోసం ఎన్ని ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్నాయి;

ఇ) పూర్తికాని షాదీఖానాలు ఎన్ని ఉన్నాయి?

**గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారి తరఫున గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభా వ్యవహారాలు శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు):**

**అ)** 2017-18 ఆర్థిక సంవత్సరంలో షాదీఖానాల నిర్మాణం కోసం రూ.15.00కోట్లను కేటాయించడమయింది. ఖర్చు చేయడానికి రూ.14.14కోట్లకు మంజూరు ఇవ్వడమయింది.

**ఆ)** అంచనాలతోపాటు ప్రభుత్వం వద్ద 36 ప్రతిపాదనలు పెండింగులో ఉన్నాయి.

**ఇ)** రాష్ట్రంలో పూర్తికాని షాదీఖానాలు 99 ఉన్నాయి.

**శ్రీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు(స్థానిక సంస్థలు - పశ్చిమ గోదావరి):** అధ్యక్షా, ఈ బడ్జెట్‌లో మైనారిటీలకు రూ.1100కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి గారికి, ఆర్థికశాఖా మంత్రి గారికి ప్రత్యేకంగా నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను ఎక్కడకు వెళ్లినా మైనారిటీలు షాదీఖానాల గురించి ఎక్కువగా అడుగుతున్నారు. అదేవిధంగా పాతవాటికి కూడా రిపేర్ల కోసం ఫండ్స్ కేటాయిస్తే బాగుంటుంది. అలాగే నేను రాయచోటి నియోజకవర్గానికి

వెళ్లినప్పుడు ఎక్కువ షాదీఖానాలకు సంబంధించే అడిగారు. అందువల్ల క్రిందటి సంవత్సరం కంటే, ఈ సంవత్సరం మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్:** అధ్యక్షా, ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు అవసరమైన షాదీఖానాలను నిర్మించడానికి చాలా ప్రాధాన్యత ఇస్తుంది. వాళ్ల అవసరాలు తీర్చడానికి, వాళ్ల ఆచార, వ్యవహారాలు, మతపరమైన విధానాలు పాటించడానికి ప్రభుత్వం చాలా చొరవ చూపిస్తుంది. ముఖ్యమంత్రిగారికి ఈ సందర్భంగా నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ సంవత్సరం అంటే 2017-18వ ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.15కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఇక్కడ రూ.14.14కోట్లు మంజూరు చేయడమైందని మంత్రిగారి సమాధానంలో ఇచ్చారు. అయితే, ఎంత ఖర్చు చేశారనేది మనకు తెలియడం లేదు. ముఖ్యమంత్రిగారు ఈ శాఖకు ఇతోధికంగా నిధులు ఇస్తున్నారు. అదేవిధంగా కింద స్థాయిలో కూడా ఖర్చు పెట్టవలసిన అవసరం ఉంది. మధ్య మార్గంలో అంటే ఆమోదించి, ఖర్చు చేసి, డబ్బులు ఇచ్చి, అవన్నీ అమలు చేయడంలో చాలా ల్యాప్సెస్ జరుగుతున్నాయి కాబట్టి, దీనిమీద ప్రభుత్వం చొరవ చూపించాల్సిన అవసరం ఉంది. ఉద్దేశం బాగుంది. దానిని అమలు చేయడంలో సమస్యలు ఉంటున్నాయనేది ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. అంతేగాకుండా, ఇంకా 99 షాదీ ఖానాలు పూర్తి కాకుండా ఉన్నాయి. కొన్ని అయిదు సంవత్సరాల నుండి, మరికొన్ని పది సంవత్సరాల నుండి పూర్తి కాకుండా ఉన్నాయి. కొత్త షాదీ ఖానాల నిర్మాణానికి నిధులు ఇచ్చు కుంటూ పోతున్నారే కానీ, అంతకు ముందు నుంచి ఉన్న షాదీఖానాల రిపేర్లు చేయడం లేదు. ప్రభుత్వం స్థలం ఇస్తుంది, డబ్బులు కూడా ఇస్తుంది కానీ, అవి పూర్తి కాకుండా పోవడం వల్ల వాటి పర్పస్ సర్వ్ కావడం లేదు. కాబట్టి ప్రభుత్వానికి నేను మనవి చేసేదేమంటే, ఎక్కడైతే షాదీఖానాలు అసంపూర్తిగా ఉన్నాయో, వాటి మీద ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని పూర్తిచేసి, వాటి పర్పస్ సర్వ్ అయ్యే విధంగా ప్రభుత్వం చొరవ చూపించాలని మీ ద్వారా ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, మైనారిటీల సంక్షేమం కోసం, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలకు షాదీఖానాల కోసం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నిధులు విస్తృతంగా శాంక్షన్ చేస్తున్న విషయం మేము వింటున్నాము. ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయాన్ని చాలా గౌరవంగా చెప్పుకుంటున్నారు. కానీ, వాటిని అమలుచేయడంలో ఉన్న సమస్య ఏమిటో అర్థం కావడం లేదు. చాలామంది ఆ డిపార్టుమెంటులో మాకు సరిగా పనులు జరగడం లేదు, కొన్ని కార్యక్రమాలు కావడం లేదంటున్నారు. దానికి కారణం ఏమిటి? అధికారులకు ఆ శాఖ మీద ఇంట్రస్ట్ లేకపోతే వేరే శాఖకు వెళ్లిపోవచ్చు. ఒక శాఖలో పనిచేస్తున్నప్పుడు బాధ్యతగా ఆ శాఖకు సంబంధించిన నిధులు ఖర్చు పెట్టాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. అధికారులు ఎందుకు ఉంటారు? ప్రభుత్వం ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. మా నిధులన్నీ కూడా కాగితాలకే పరిమితం అవుతున్నాయి, అమలు మాత్రం జరగడం లేదని మైనార్టీలు చాలా బాధపడుతున్నారు. కనుక మంత్రిగారికి తమ ద్వారా విజ్ఞప్తి

చేసేదేమంటే, మంత్రిగారు అర్జెంటుగా మైనారిటీ శాఖకు సంబంధించి, దాని మీద ఇంట్రస్టు ఉన్న అధికారులను పిలిపించి, మంత్రిగారి ఛాంబర్‌లో లేదా మీ ఛాంబర్‌లో అయినా మాట్లాడి ఎందుకు నిధులు ఖర్చు పెట్టడం లేదనేది అడగండి. ముఖ్యమంత్రిగారు ఈ శాఖకు అన్ని నిధులు ఇస్తుంటే ఖర్చు పెట్టడానికి వాళ్లకు ఉన్న ఇబ్బందేమిటి? ఉర్దూ అకాడమీకి సంబంధించిన సిబ్బందికి జీతాలు రావడం లేదు. వాళ్లు బజారున పడి తిరుగుతున్నారు. ఉర్దూ అకాడమీలో ఏ రకమైన ఫంక్షనింగ్ లేదు. మైనార్టీలు అంటే అంత నిర్లక్ష్యమా? కనుక ముఖ్యమంత్రిగారి ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలి. ఎంతో దయతో ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి ముందుకు వస్తుంటే, వాటిని అమలు చేయడంలో అధికారులకు వచ్చిన సమస్య ఏమిటి? కనుక ఇది చాలా బాధాకరం. దయచేసి మీరన్నా, గౌరవ మంత్రిగారన్నా వెంటనే ఈ హౌస్‌లో ప్రశ్నోత్తరాల సమయం ముగియగానే అధికారులను పిలిపించి మీటింగు ఏర్పాటు చేసి ఎందుకు ల్యాప్స్ జరుగుతుంది, ఉర్దూ అకాడమీలో ఎందుకు సరిగా ఫంక్షనింగ్ లేదు, ఎందుకు మైనారిటీ శాఖకు ఇచ్చే నిధులు ఖర్చుపెట్టడం లేదు, మైనారిటీ శాఖలో ఎందుకు ప్రోగ్రెస్ కనపడడం లేదనేది తెలుసుకోవాలని కోరుతున్నాను. ముఖ్యమంత్రిగారు అంత దయతో ఇస్తుంటే, దానిని అమలు చేసే బాధ్యత డిపార్టుమెంటుకి లేదా? దానికి కారణాలు అన్వేషించాల్సిన అవసరం ఉంది. కాబట్టి, వెంటనే చొరవ తీసుకోవాలని మీకు, మీ ద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ రాము సూర్యారావు(ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి):** అధ్యక్షా, ముఖ్యమంత్రి గారి ఆశయాలు బాగానే ఉన్నాయి, ముస్లింలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, షాదీఖానాలు సమర్థవంతంగా నిర్వహించాలని, సభ్యులందరూ వ్యక్తపరచిన అభిప్రాయం ప్రకారం ఆచరణలో మాత్రం ఇవి జరగడం లేదు. చాలా మంది బాధపడుతున్నారు. దయచేసి సభ్యులు మాణిక్యవరప్రసాద్ గారు చెప్పినట్లు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, దాని మీద దృష్టిసారించమని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి(ఉపాధ్యాయ నియోజకవర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** అధ్యక్షా, నిధులైతే విడుదల చేస్తున్నారు, కానీ ఆచరణ మాత్రం లేదు. ఉర్దూ అకాడమీలో ఉన్నటువంటి కంప్యూటర్ టీచర్లకు, లైబ్రేరియన్‌కు గత మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదు. మేము ఎంతో ప్రయత్నం చేస్తేనే నాలుగు రోజుల క్రితం ఇచ్చారు. నిధులు ఉన్నాయి, ఖర్చుపెట్టడం లేదు. దీనిమీద తక్షణమే చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. గతంలో అయితే ఉర్దూ పాఠశాలలకు ఉర్దూ అకాడమీ ద్వారా విద్యావాలంటీర్లుగా క్వాలిఫైడ్ టీచర్లను పెట్టుకునేవారు. గత మూడేళ్లుగా ఒక్క రూపాయి కూడా ఉర్దూ పాఠశాలలకు ఖర్చు పెట్టిన పాపాన పోవడం లేదు. వీటిపైన కూడా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ యనమల రామకృష్ణుడు:** అధ్యక్షా, బడ్జెట్ ప్రిపరేషన్ టైమ్‌లో కూడా ఈ అంశాన్ని రెవ్యూ చేయడం జరిగింది. వెల్ఫేర్‌కి సంబంధించి మిగతా శాఖలతో పోలిస్తే నిధులు కొంత తక్కువే ఖర్చు చేయడం జరుగుతోంది.

దానిలో మైనారిటీ వెల్ఫేర్ కూడా ఒకటి. గత బడ్జెట్‌లో సుమారు రూ.840కోట్లు ఇచ్చాము. అదేవిధంగా ఈ సంవత్సరం చూస్తే సుమారు రూ.1100కోట్లు పైనే, మైనారిటీ వెల్ఫేర్‌కి కేటాయించడం జరిగింది. ప్రత్యేకంగా షాదీఖానాలకు సంబంధించి ప్రభుత్వం డబ్బులు బాగానే ఇచ్చింది. రిలీజెస్ కూడా ఇచ్చారు. ఎక్స్‌పెండిచర్ అనుకున్నంతగా జరగలేదు. అందువల్ల దీనిని రెవ్యూ చేస్తూ ఉన్నాము. గౌరవ సభ్యులు సూచించినట్లుగానే, ఈ అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోపే ఒకసారి నేను డిపార్టుమెంటుతో కూర్చొని రెవ్యూ చేసి సకాలంలో మొత్తం నిధులు ఖర్చు అయ్యేవిధంగా, పెండింగ్‌లో ఉన్నటువంటి షాదీఖానాలు అన్నీ కూడా పూర్తయ్యేట్లుగా చూస్తానని గౌరవ సభ్యులకు ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. స్కాలర్‌షిప్‌లు వంటివన్నీ కూడా ఇంకా ప్రాసెస్‌లో ఉన్నాయి, ఈ డబ్బులు ల్యాప్స్ అవ్వవు కాబట్టి అందరికీ కూడా అందుతాయి కానీ, ఎక్స్‌పెండిచర్‌లో కొంత బ్యాక్‌లాగ్ ఉంది. దానికి సంబంధించి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. తప్పకుండా ఎక్స్‌పెండిచర్ ఇంకర్ అయ్యేట్లు, మైనారిటీలందరికీ బెనిఫిట్ అయ్యేట్లు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

**మిస్టర్ ఛైర్మన్:** మంత్రిగారూ, ఈ విషయంలో మీరన్నా మీటింగు పెట్టండి, లేదా నా ఛాంబర్‌లో అయినా మీటింగు పెడతాను.

**శ్రీ యనమల రామకృష్ణుడు:** నేనే మీటింగు ఏర్పాటు చేస్తాను అధ్యక్షా. మీటింగు పెట్టి చర్చిస్తాము.

## అల్పసంఖ్యాకుల సంక్షేమానికి నిధుల కేటాయింపు

ప్రశ్న నెం.10262(22)

**సర్వశ్రీ గంగుల ప్రభాకర్ రెడ్డి, వెన్నపూస గోపాల్ రెడ్డి, దేవసాని చిన్న గోవింద రెడ్డి, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) 2017-18లో మైనారిటీ సంక్షేమ శాఖకు కేటాయించిన నిధుల మొత్తం ఎంత;

ఆ) 2014-15, 2015-16 మరియు 2016-17 ఆర్థిక సంవత్సరాలలో మైనారిటీ సంక్షేమ శాఖకు కేటాయించిన మరియు విడుదల చేసిన నిధుల మొత్తం ఎంత;

ఇ) వాటిలో ఖర్చు చేసిన నిధుల మొత్తం ఎంత?

**గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారి తరపున గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు):**

అ) 2017-18 సంవత్సరానికిగాను మైనారిటీ సంక్షేమ శాఖకు రూ.84,025.54లక్షల మొత్తాన్ని కేటాయించడమయింది.

ఆ) సంవత్సరం వారీగా కేటాయించిన మరియు విడుదల చేసిన నిధుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

| సంవత్సరం | కేటాయించిన మొత్తం (రూ.లక్షలలో) | విడుదల చేసిన మొత్తం (రూ.లక్షలలో) |
|---|---|---|
| 2014-15 | 57544.92 | 38806.00 |
| 2015-16 | 46832.29 | 43952.00 |
| 2016-17 | 79561.46 | 78789.00 |

ఇ) సంవత్సరం వారీగా ఖర్చు చేసిన నిధుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

| సంవత్సరం | ఖర్చు చేసిన మొత్తం (రూ.లక్షలలో) |
|---|---|
| 2014-15 | 38465.29 |
| 2015-16 | 33531.82 |
| 2016-17 | 63585.65 |

ఉ. 10.20

**శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్:** అధ్యక్షా, ముందుగా గౌరవ ముఖ్యమంత్రిగారికి ఈ సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే, గతంలో 23 జిల్లాలతో కూడుకున్న ఆంధ్రప్రదేశ్‌కు గత ప్రభుత్వాలు 10 సంవత్సరాలలో రూ.13,930కోట్లు ఖర్చు పెడితే, ఈనాడు 13 జిల్లాలుగా కుదించబడిన నవ్యాంధ్రప్రదేశ్‌లో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 2014వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ మూడున్నర సంవత్సరాల కాలంలోనే దాదాపుగా రూ.23,912కోట్లు కేటాయించి ఖర్చు పెట్టడం జరిగింది. ఇది చాలా అభినందించ తగ్గ విషయం. అంతేగాకుండా, మొదటి సంవత్సరంలో దాదాపు రూ.370కోట్లు ఇస్తే, రెండవ సంవత్సరంలో రూ.710కోట్లు, ఈ సంవత్సరంలో రూ.840కోట్లు ఇచ్చారు. ఇప్పటికే బడ్జెట్‌లో దాదాపుగా రూ.1102కోట్లు మైనారిటీల కోసం భారీగా నిధులు కేటాయించినందుకు ద్వారా ఈ సందర్భంగా నేను గౌరవ ముఖ్యమంత్రిగారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ముఖ్యంగా పేదరికంలో మగ్గుతున్న, అవిద్యతోను, నిరుద్యోగంతోను బాధపడుతున్నటువంటి, ఆర్థికంగా పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నటువంటి మైనారిటీలకు చాలా వెసులుబాటు కలుగుతుందన్న పూర్తి నమ్మకాన్ని, విశ్వాసాన్ని తమ ద్వారా నేను వ్యక్తం చేస్తున్నాను.

అధ్యక్షా, అంతేగాకుండా, బ్యాంకుల ద్వారా ఇచ్చే 10 స్కీములలోను దాదాపుగా రూ.5,304 కోట్లు గత పది సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాములో ఖర్చు పెడితే, మూడున్నర సంవత్సరముల కాలంలోనే దాదాపు రూ.34,761కోట్లు ఈనాటి ప్రభుత్వం ఇవ్వడం జరిగింది. వీటన్నింటిని పరిశీలిస్తే, ప్రభుత్వం మైనారిటీలకు బాగా నిధులను కేటాయిస్తోంది. ఈ సంవత్సరం దాదాపు రూ.840కోట్లు ఏదైతే ఇవ్వడం జరిగిందో, దానిని ఖర్చుపెట్టడంలో కొంత జాప్యం జరిగిందనే మాట వాస్తవం. కాబట్టి, వాటికి పూర్తి చేయడానికి, వాటిని ఖర్చుపెట్టుకోవడానికి ఇంకా మనకు సమయం, అవకాశం రెండూ ఉన్నాయని గౌరవ మంత్రివర్యులు చెప్పారు. కాబట్టి, ఆ డబ్బులను కలుపుకుని తక్షణమే ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఖర్చు పెట్టవలసిన అవసరం ఉందో, ఆ రకంగా ఖర్చుపెట్టడానికి సహకరించవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారికి మనవి చేస్తున్నాను.

**శ్రీ యనమల రామకృష్ణుడు:** అధ్యక్షా, మొదటి ప్రశ్నలోనే వీటికి సంబంధించి జవాబు చెప్పడం జరిగింది. అందుచేత మైనారిటీలను ప్రత్యేకమైన దృష్టిలో ఈ ప్రభుత్వం చూస్తోంది. అన్ని వర్గాలకంటే ఎక్కువగా మైనారిటీలలోనే పేదరికం నిరక్షరాస్యత బాగా ఉన్నాయి. వారిని ఆర్థికపరంగా పైకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ ప్రభుత్వం ఎక్కువ నిధులను కేటాయించడం జరుగుతోంది. దానికి తగ్గట్లుగానే ఈ ఖర్చులు కూడా ఉండవలసిన అవసరం ఉంది కానీ, అంతమేరకు లేవు. అయినప్పటికీ ముఖ్యమంత్రిగారు కూడా ఈ అంశాలపై ప్రత్యేకమైన రెవ్యూ చేస్తున్నారు. ఈ రెవ్యూలో ఖర్చు కూడా తక్కువ ఉందనేటటువంటి భావాన్ని వారు వ్యక్తం చేశారు. అందుచేత గౌరవ సభ్యులు చెప్పినట్లుగానే వారి మనోభావాలను అర్థం చేసుకుని బడ్జెట్ అలొకేషన్ ఇస్తున్నామో, అందులో నూరు శాతం వారికి కేటాయించిన నిధులను ఖర్చు పెట్టడమే కాకుండా, అర్హులైన వారికి ఆ ఫలాలు అందేలా చూడడం ఒకటి. అలాగే, షాదీఖానాలు లాంటి ఇతరత్రా సంబంధించిన వాటికి కూడా మౌలిక సదుపాయాలను కల్పించుటకు, వాటిని మరింతగా అభివృద్ధి చేయుటకు ప్రయత్నం చేస్తామని తమ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

**MR.CHAIRMAN:** Question No.10339(23), Human Resources Development.

## <u>మదర్సాలలో ఆంగ్లం, గణితం బోధించడం</u>

ప్రశ్న నెం.10339 (23)

**సర్వశ్రీ బొడ్డు నాగేశ్వరరావు, విటపు బాలసుబ్రహ్మణ్యం, రాము సూర్యారావు, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** రాష్ట్రంలో మదర్సా మొత్తం సంఖ్య మరియు వాటిలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎంత;

**ఆ)** గణిత శాస్త్రం మరియు ఆంగ్ల పాఠ్యాంశాలను బోధించేందుకు ఏదేని ప్రతిపాదన ఉన్నదా;;

**ఇ)** అయితే, రాష్ట్రం చేసిన సహాయం వివరాలేమిటి?

**గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాసరావు):**

**అ)** మొత్తం మదర్సాల సంఖ్య : 555

నమోదైన విద్యార్థుల సంఖ్య : 56,635

**ఆ)** అవునండీ. ఆంధ్రప్రదేశ్ సర్వశిక్షా అభియాన్ సహాయం పొందుతున్నట్టి 255 మదర్సాలలో ఆంగ్లం, గణిత శాస్త్రం మరియు పర్యావరణ శాస్త్రాలను బోధించేందుకు 631 మంది విద్యా వాలంటీర్లను నియమించడమయింది.

**ఇ)** 2017-18 విద్యా సంవత్సరం కోసం విద్యా వాలంటీర్లకు గౌరవ వేతనం నిమిత్తం ఆంధ్రప్రదేశ్ సర్వశిక్షా అభియాన్ రూ.4,29,08,000/ మొత్తాన్ని విడుదల చేసింది.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు(పట్టభద్రుల నియోజకవర్గం - కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, ఈ ప్రశ్నకు సంబంధించి మదర్సాల సంఖ్య 555 ఉన్నాయని, నమోదైన విద్యార్థుల సంఖ్య 56,635 అన్నారు. అందులో 255 మదర్సాలలో ఆంగ్లం, గణితం, పర్యావరణ శాస్త్రాలలో బోధిస్తున్నామని చెప్పారు. 631 మంది విద్యా వాలంటీర్లను నియమించామని చెప్పారు. అలాగే, మిగిలిన వాటిల్లో కూడా నియమించే అవకాశం ఉందా లేదా?

2017-18 విద్యా సంవత్సరంలో విద్యా వాలంటీర్ల గౌరవ వేతనం నిమిత్తం సర్వశిక్షా అభియాన్ ద్వారా రూ.4,29,08,000 ల మొత్తాన్ని విడుదల చేశామని అన్నారు. ఈ గౌరవ వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదనేటటువంటిది మాకు ఉన్నటువంటి సమాచారం. దానిమీద గౌరవ మంత్రిగారు సవివరంగా అన్ని వివరాలు తెలియజేయాలని తమ ద్వారా కోరుతున్నాను.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం(ఉపాధ్యాయ నియోజకవర్గం - చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, రాష్ట్రంలో ఈ మదర్సాలు ఒక విలక్షణమైన, విస్తృతమైన రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ కలిగి ఉన్నాయి. ఇందులో ఉన్న పిల్లలు కనీసం 20 శాతం మంది అనాథలు ఉంటారు. నిజానికి ఈ మదరసాలు లేకపోయినట్లయితే, దాదాపుగా ఈ పిల్లలందరూ దిక్కులేని వారిగా మారేటటువంటి పరిస్థితి ఉన్నది. అలాగే, చాలా నిరుపేదలైనటువంటి పిల్లలు ఇందులో చదువుకుంటూ ఉంటారు. వాస్తవానికి వీరందరికీ మంచి చదువు చెప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది మరియు విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్‌లది. అయినా ఈ బాధ్యతను మైనారిటీ సంస్థలు తీసుకుని, వాళ్ళ భుజస్కంధాల పైన మోస్తున్నారు. ఇందులో సహజంగానే దానికి ఉన్నటువంటి ఒక ప్రత్యేకత ఆధ్యాత్మికపరమైనటువంటిది. దానిని వాళ్ళు జాగ్రత్తగా కాపాడుతున్నారు. అయితే, మనం వారికి సహకరించే సందర్భంలో వాళ్ళ భావాలను హర్ట్ చేసేటట్లుగా, ఆ వ్యవస్థకు ఉన్నటువంటి స్వభావానికి భిన్నంగా వ్యవహరించేటట్లుగా, అందులోకి మనం కనుక జొరబడేటట్లుగా ఉన్నట్లయితే ఈ పని జరుగదు. అందువల్ల దానికి తోడ్పాటునందించే విధంగా ఒక సహకార పాత్ర పోషించేటటువంటి విధంగా ఉన్నప్పుడు మాత్రమే వాళ్ళు మనలను దగ్గరకు రానిస్తారు. ఈ 555 మదరసాలలో 255 మదరసాలలోనే

మీరు 631 మంది విద్యావాలంటీర్లను పెట్టగలిగారంటే మీరు పెడతామన్నా మిగిలిన వాళ్ళు అంగీకరించలేదా? లేకపోతే మనం పెట్టలేకపోయామా అని నేననుకుంటాను. ఒక రకంగా ఆధునికమైనటువంటి విద్య కావాలనే దాహం కూడా వాళ్ళల్లో వస్తున్న సందర్భంలో ఇప్పటికే వాళ్ళు నడుపుతున్న వ్యవస్థని కాపాడుకుంటూ, దానికి అనుబంధంగా తోడ్పాటును అందించే పద్ధతిలో ఇది ఉండాలనేది మా కోరిక. ఆ రకమైన వ్యూహం ఏమైనా ప్రభుత్వం వద్ద ఉందా? మైనారిటీ సంస్థలను కూర్చోబెట్టి, మాట్లాడి, వాళ్ళతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ఈ కార్యక్రమాలను చేయడానికి మీకు ఉన్నటువంటి మెకానిజం ఏమిటి అని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, ఈ మదర్సాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సక్రమంగా జీతాలు అందడం లేదనేది వాస్తవం. అందువల్ల దయచేసి మంత్రిగారు తగిన శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను. వారికి సక్రమంగా జీతాలు అందితే, మరింత సక్రమంగా పనిచేయడానికి అవకాశం ఉంటుంది కాబట్టి, తమ ద్వారా వారికి సత్వరమే అందేలా తగిన చర్యలు తీసుకోవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాము.

**శ్రీ పి.వి.ఎస్. మాధవ్(పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** అధ్యక్షా, దేశవ్యాప్తంగా సుమారు 60,000 మదర్సాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో Minority Affairs, HRD Ministry వాళ్ళు ఒక సర్వే చేయించారు. అందులో Center for Education Research and Training and Development వాళ్ళ ఆధ్వర్యంలో రీసెర్చ్ చేసిన సందర్భంలో సుమారు 85 శాతానికి పైగా ఎక్కడా కూడా గణితం, ఆంగ్లం సైన్స్‌ను బోధించడం లేదు. అంతేగాకుండా, ఆ ప్రాంతానికి సంబంధించిన భాష కూడా అక్కడెక్కడా బోధించే అవకాశం లేదు. అయితే, దీనిని చూసి మైనారిటీ ఎఫైర్స్ మినిస్ట్రీ అన్ని మదరసాలతో కూడి మాట్లాడిన సందర్భంలో వాళ్ళు వినూత్నంగా Teacher, Tiffin, Toilet అని టిటిటి ఒక స్కీమును తీసుకురావడం జరిగింది. ఆ టిటిటి స్కీములో భాగంగానే మదర్సాలలో ఎక్కడా మరుగుదొడ్ల సదుపాయాలు లేవు. అక్కడ మరుగుదొడ్ల సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. అలాగే, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వ్యవస్థ కూడా ఏ ఒక్క మదర్సాలో లేదు, వాటిని కూడా మదర్సాలలో ఏర్పాటు చేయాలని తమ ద్వారా కోరుతున్నాను.

ఉ.10.30

అధ్యక్షా, అలాగే దానికి అనుబంధంగా, ప్లే గ్రౌండ్ ఫెసిలిటీ కూడా పెట్టాలని, విదార్థులకు మతపరమైన అభ్యాసనతో పాటు, ఆ ప్రాంతానికి సంబంధించిన భాష కూడా నేర్పించవలసిన అవసరం ఉంది. వారికి ఆ పరిమితిని తప్పనిసరి కాకుండా చేయవలసి ఉంది. అటువంటి ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఏదైనా ఉందా అని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

**శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్:** అధ్యక్షా, ఈ మదర్సాల అంశం ఏదైతే ఉందో అది చాలా సున్నితమైనది. ఇది మతపరమైన అంశంతో కూడుకున్నది. ఈనాడు దేశంలో ఉన్న మైనార్టీ వర్గాలకు మసీదులు అంటే ఎంత గౌరవం

ఉందో మదర్సాలకు కూడా అంతే గౌరవం ఉంది. ఎందుకంటే ఇక్కడ ఖురాన్‌ను కంఠస్థం చేయించి ఆధ్మాత్మిక చింతనను పూర్తిగా నేర్పించే పరిస్థితి ఉంటుంది. ఈ విషయం తమరికి కూడా తెలుసు. కాబట్టి మదర్సాలలో వాలంటీర్ల ద్వారా స్కూల్ విద్య నేర్పించే ఉద్దేశంతో ప్రభుత్వం కలుగజేసుకుని అక్కడ జరుగుతున్న కార్యకలాపాల ముఖ్య ఉద్దేశాలను దెబ్బ తీసే పరిస్థితి రాకుండా ఉండాలనేది ఈనాడు మదర్సాలు నిర్వహిస్తున్న వారి ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వం కూడా సర్వశిక్షా అభియాన్ ద్వారా మదర్సా బోర్డు పెట్టాలనే ఆలోచన చేస్తుంది. ఇది కూడా మదర్సా నిర్వహించే వారిలో ఇబ్బందికరమైన పరిస్థితి వస్తుంది. ఎందుకంటే, మదర్సా బోర్డులో నమోదు చేసుకుంటే ఆ అకౌంట్ నిర్వహించుకోవడానికి వాటి తనిఖీకు ప్రభుత్వ అధికారులు వెళ్లడం వల్ల ఏదైతే ఫంక్షన్ ఉందో ఆ ఫంక్షన్‌ను దారి తప్పించే పరిస్థితి వస్తుంది. కాబట్టి ఈనాడు విద్యావాలంటీర్లను ఏర్పాటు చేసే విషయంలో గాని అదే విధంగా మదర్సా బోర్డును ఏర్పాటు చేసే విషయంలో గాని ఎవరైతే స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరుకుంటారో వారికే ఈ బోర్డులో గానీ, విద్యావాలంటరీలను నియమించే ఆలోచన చేయాలి. ఇది ఏదైనా తప్పనిసరి చేసి ఇది తప్పదు, ప్రభుత్వ అండర్‌లో ఉండాలి అంటే కుదరని పరిస్థితి. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకూ 555 మదరసాలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకూ వాటికి ఏమీ ఇవ్వడం లేదు. ఇక్కడ మధ్యాహ్న భోజనంతో పాటు, ఉదయం టిఫిన్, సాయంత్రం భోజనంతో పాటు పూర్తిగా పౌష్టికాహారాన్ని అందిస్తారు. బట్టలు ఇస్తారు. అలాగే ఉండడానికి అవకాశం కల్పిస్తారు. ఒక్కొక్క మదర్సా సుమారు 2,3 ఎకరాలలో ఉంది. గురుకుల పాఠశాలలు అని ప్రభుత్వం ఏదైతే నడుపుతుందో దానికి భిన్నంగా కాకుండా ఆధ్యాత్మిక చింతన పూర్తి విద్యను అభ్యసించే పరిస్థితి ఇక్కడ ఉంది. ఉదయం 5గంటల నుండి రాత్రి 9గంటల వరకూ క్లాసులు జరుగుతాయి. కానీ ప్రభుత్వ విధానంలో పాఠశాల విద్యకు, మదర్సా విద్యకు చాలా తేడా ఉంది. కాబట్టి దీనిలో ప్రభుత్వం బలవంతంగా చొచ్చుకుపోయే పరిస్థితి కాకుండా ఎవరైతే కావాలని కోరుకుంటారో వారికే ప్రభుత్వ పరంగా సహకారం అందించే పరిస్థితి ఉండాలి. మదర్సా బోర్డులో గానీ, విద్యావాలంటీర్ల విషయంలో గానీ, వాళ్ల ఆలోచనలకు వారి అభిప్రాయాలకు వ్యతిరేకంగా పోకుండా ప్రభుత్వం ఒక కమిటీను ఏర్పాటు చేసి ఆ కమిటీ ఇచ్చే నివేదికను బట్టి ప్రభుత్వం దీనిలో జోక్యం చేసుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం. అలా కాకుండా మా అంతట మేమే వెళ్లతామని చెబితే ప్రభుత్వానికి వ్యతిరేక పరిస్థితులు, ఇబ్బందికర పరిస్థితులు వస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని మదర్సా బోర్డు ఏర్పాటు చేసే విషయంలో గాని, విద్యా వాలంటరీ విషయంలో గాని ఎవరైతే ఆసక్తి కనబరుస్తారో వారికే ఇచ్చే విధంగా కమిటీను ఏర్పాటు చేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**మిస్టర్ చైర్మన్:** షరీఫ్‌గారు ఈ మదర్సా బోర్డులు ఉత్తరప్రదేశ్, బిహార్, కేరళలలో చాలా విజయవంతంగా నడుస్తున్నాయి. ఇది సున్నితమైన, మతపరమైన అంశం కాబట్టి మంత్రిగారితో స్టడీ టూర్ చేయండి. ఎందుకంటే ఉత్తరప్రదేశ్, బిహార్, కేరళలలో ఏ విధంగా విజయవంతం అయ్యింది, మనకు ఎందుకు కావడం లేదనేది ఆలోచించి చూడండి. ఇంతకు ముందు సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రోగామ్‌ను పరిచయం చేయండి. Poor feeding కాబట్టి ప్రభుత్వానికి ఆ అవసరం ఉంటుంది. దానిని ఆలోచించి

మీరు సలహాలు ఇస్తే బాగుంటుంది. మంత్రిగారూ, ఉత్తరప్రదేశ్, బిహార్, కేరళలలో ఏవిధంగా విజయవంతం అయ్యిందో స్టడీ టూర్ వేయండి. ఎందుకంటే Poor feeding ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం భోజనం వారు సొంతంగా పెట్టుకుంటారు. బట్టలు వారే కుట్టించుకుంటారు. ప్రభుత్వం జోక్యం చేసుకుంటే ఈ సౌకర్యాలు అన్నీ ఇవ్వవచ్చని ఇంతకు ముందు గౌరవ సభ్యులు చెప్పారు. మతపరమైన సున్నిత అంశం కాబట్టి దానికి అడ్డంలేకుండా చూసుకోవాలని, నేనూ మైనారిటీని కాబట్టి నేను కూడా కలుగజేసుకుంటున్నాను. స్టడీ టూర్ వేస్తే ఆయా రాష్ట్రాల్లో ఏవిధంగా విజయవంతం అయ్యిందో చూడవచ్చు. అసెంబ్లీ మరియు కౌన్సిల్ సభ్యులతో, మైనార్టీలను కూడా కొంత మందిని తీసుకుని స్టడీ టూర్‌ను ఏర్పాటు చేస్తే విజయవంతం అవుతుందని నా అభిప్రాయం.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, తమరి సూచన కూడా బాగుంది. అలాగే మదర్సాలను అవసరమైన చోట ఇంకా పెంచే విషయాన్ని, కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించవలసినదిగా కోరుతున్నాను. అలాగే 225 ఉర్దూ యుపి స్కూల్స్ ను హైస్కూల్స్‌గా చేసి నవీకరించారు. వాటికి విద్యా వాలంటరీలను నియమించుకోవాలని ప్రభుత్వం కూడా ఆదేశాలు ఇచ్చింది. విద్యా సంవత్సరం పూర్తవుతున్నప్పటికి చాలా జిల్లాలలో విద్యా వాలంటీర్లను పూర్తి స్థాయిలో నియమించలేదు. కొత్త డిఎస్సీ రిక్రూట్‌మెంట్ జరుగుతుంది కాబట్టి విద్యావాలంటీర్లలను కాకుండా కొత్తగా అప్‌గ్రేడ్ అయిన ఉర్దూ పాఠశాలలకు రెగ్యులర్ ప్రాతిపదికపై కొత్త డిఎస్‌సి ద్వారా పూర్తి స్థాయిలో టీచర్లను నియమించాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ గంటా శ్రీనివాసరావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ బొడ్డు నాగేశ్వరరావు గారు, శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు, శ్రీ రాము సూర్యారావు గారు, శ్రీ పి.వి.ఎన్.మాధవ్ గారు, శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్ గారు, శ్రీ కత్తి నరసింహారెడ్డి గారు అలాగే తమరు కూడా కొన్ని విలువైన సూచనలు చేశారు. అయితే దీనికి సంబంధించి ఇప్పటికే మదర్సా బోర్డు పెట్టాలనే ఉద్దేశంతో Former NCTE Chairman, Mohd Akhtar Siddiqui ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో ఒక కమిటీను ఏర్పాటు చేశాం. ఆ కమిటీ ఉత్తరప్రదేశ్, బిహార్, వెస్ట్‌బెంగాల్ అలాగే మధ్యప్రదేశ్‌లో కూడా టూర్ చేసి స్టడీ చేసి రికమండేషన్స్ ఇచ్చారు. అది ప్రస్తుతం మైనారిటీ వెల్ఫేర్ డిపార్టుమెంటులో ఉంది. దీనిని ఫైనలైజ్ చేసే ముందు, మరలా ఎమ్ఎల్ఏలు, ఎమ్ఎల్‌సీలతో కలిపి టూర్ ఏర్పాటు చేద్దామంటే మాకు ఏమీ అభ్యంతరం లేదు. కొంత మంది సభ్యులు కూడా వెళ్లి ఏమైనా సిఫార్సు చేస్తామంటే టూర్ ఏర్పాటు చేస్తాం. అయితే ఇంతకు ముందు మీరు చెప్పినట్లు ఏదైతే 555 మదర్సాలు ఉన్నాయో వాటిలో కేవలం 255 మదర్సాలకు మాత్రమే ప్రభుత్వం గుర్తింపు ఉన్నాయి. ఇవి మాత్రమే సర్వశిక్షా అభియాన్ క్రింద ఉన్నాయి. పెద్దలు చెప్పినట్లుగా కొంత మందికి ఇష్టం లేకపోవడం, కొంత మంది ఎడ్యుకేషన్ ఇవ్వడానికి కూడా సిద్ధంగా లేకపోవడం తదితర కారణాల వలన ప్రభుత్వానికి తగిన సమాచారం కూడా లేదు. గౌరవ సభ్యులు శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్ గారు చెప్పినట్లుగా కొన్ని కొన్ని మదర్సాలను చక్కటి వాతావరణంలో మంచి మంచి భవనాలు నిర్మించి బ్రహ్మాండంగా రన్ చేస్తున్నారు. అయితే దీనిలో ఉన్న సమస్య ఏమిటంటే ఇప్పటి వరకూ మనకు బోర్డు లేకపోవడం వలన అందులో చదువుకుంటున్న పిల్లలకు ఒక గుర్తింపు గానీ, ఒక సర్టిఫికేట్ గానీ

ఇప్పటి వరకూ ఇవ్వలేకపోతున్నాము. ఫర్‌దర్‌గా వారికి ఉపాధి కావాలన్నా, వారు బయటకు వెళ్లినప్పుడు ఏమి చదువుకున్నారు అంటే చెప్పే పరిస్థితి కూడా లేదు. కాబట్టి బోర్డు పెట్టాలని ఒక నిర్ణయం తీసుకున్నాము. దానికి సంబంధించి నేను ఇంతకు ముందు చెప్పిన ఎన్‌సిటిఇ ఎక్స్ చైర్మన్ వారి ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కలిపి ఒక కమిటీ ఏర్పాటు చేశాం. దానికి వారు రిపోర్టు కూడా ఇచ్చారు. ఆ రిపోర్టును ఫైనలైజ్ చేసి బోర్డును ప్రారంభిద్దామని అనుకుంటున్నాము. దానితోపాటు విద్యా వాలంటీర్స్‌కు వేతనాలు 2017వ సంవత్సరం వరకూ రూ.5000 చెల్లిస్తుంటే, వారికి రూ.7000కి పెంచి వేతనాలు చెల్లిస్తున్నాము. దానితోపాటు ప్రభుత్వం ముఖ్యంగా ఎడ్యుకేషన్‌కు ఎంతో ప్రయారిటీ ఇస్తుంది. అలాగే మత సంప్రదాయాలను, మనోభావాలను గౌరవించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. కాబట్టి ప్రభుత్వానికి వారి మీద పెత్తనం చెలాయించాలనే ఉద్దేశం ఎక్కడా లేదు. వారికి హ్యాండ్ హోల్డ్ చేస్తూ వాళ్లని strengthen చేయడం కోసం ప్రభుత్వం ఏమి చేయాలో అదే చేస్తుంది తప్ప దీనిలో ఎక్కడా కూడా వారి కార్యకలాపాలలో జోక్యం చేసుకునే సిస్టమ్ లేదు. ఇంకా మీరు ఫర్‌ధర్‌గా ఏమైనా సూచనలు, సలహాలు ఇస్తే తప్పకుండా అవన్నీ కమిటీ రిపోర్టులో చేర్చి నిర్ణయం తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

**MR.CHAIRMAN:** Question No.10255(24), Minister for Irrigation.

<u>నీటిపారుదల ప్రాజెక్టులు</u>

ప్రశ్న నెం.10255(24)

**సర్వశ్రీ వెన్నపూస గోపాల్ రెడ్డి, ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్, డా. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన జల వనరుల నిర్వహణ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) గడచిన 4 సంవత్సరాలలో రాష్ట్రంలో పూర్తి చేసిన సాగునీటి ప్రాజెక్టుల వివరాలు ఏమిటి;

ఆ) వాస్తవ అంచనాలతో కూడిన ప్రాజెక్టుల వారీ ఖర్చు వివరాలేమిటి?

**గౌరవనీయులైన జల వనరుల శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు):**

అ) గడచిన 4 సంవత్సరాలలో పూర్తి చేసిన సాగునీటి ప్రాజెక్టుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. పట్టిసీమ ఎత్తిపోతల సాగునీటి పథకం.
2. శారదా నదిపై ఆనకట్ట.
3. అనంతపల్లి బ్రిడ్జి నుండి నందమూరు అక్విడక్ట్ వరకు ఎర్రకాలువను ఆధునీకరించడం.

4. కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల పథకం.

5. గండికోట సి.బి.ఆర్. లిఫ్టులు.

6. సిద్ధాపురం ఎత్తిపోతల సాగునీటి పథకం.

7. గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (శ్రీ నరసింహరాయ సాగర్).

8. పులికనుమ ఎత్తిపోతల సాగునీటి పథకం.

9. కృష్ణానదిపై పెదపాలెం ఎత్తిపోతల సాగునీటి పథకం.

10. వి.ఎల్.ఎం.సి పై చినసాన ఎత్తిపోతల సాగునీటి పథకం.

**ఈ)** అంచనాలతో కూడిన ప్రాజెక్టు వారీ ఖర్చుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

| వరుస సంఖ్య | ప్రాజెక్టు పేరు | అంచనా మొత్తం (రూ.కోట్లలో) | ఖర్చు (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 1 | పట్టిసీమ ఎత్తిపోతల సాగునీటి పథకం | 1667.15 | 1651.36 |
| 2 | శారదా నదిపై ఆనకట్ట | 17.10 | 16.10 |
| 3 | అనంతపల్లి బ్రిడ్జి నుండి నందమూరు అక్విడక్ట్ వరకు ఎర్రకాలువ ఆధునీకరణ | 143.15 | 116.00 |
| 4 | కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల పథకం | 62.91 | 53.22 |
| 5 | గండికోట సి.బి.ఆర్. లిఫ్టులు | 2059.00 | 1168.06 |
| 6 | సిద్ధాపురం ఎత్తిపోతల సాగునీటి పథకం | 116.52 | 74.98 |
| 7 | గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (శ్రీ నరసింహరాయ సాగర్) | 886.24 | 481.48 |
| 8 | పులికనుమ ఎత్తిపోతల సాగునీటి పథకం | 263.09 | 236.06 |
| 9 | కృష్ణానదిపై పెదపాలెం ఎత్తిపోతల సాగునీటి పథకం | 25.55 | 14.55 |
| 10 | వి.ఎల్.ఎం.సి.పై చినసాన ఎత్తిపోతల సాగునీటి పథకం | 23.70 | 15.17 |

పై విధంగా ఖర్చు అయ్యిందని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

ఉ.10.40

**శ్రీ పి. రామ సుబ్బారెడ్డి:** అధ్యక్షా, మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నా, దీంట్లో SRBC (శ్రీశైలం రైట్ బ్రాంచ్‌కెనాల్) లో మైలవరం వరకు కూడా ఉంది. ఈ పనులు పూర్తయ్యాయి. SRBC లో 36,37,38 కొన్ని ప్యాకేజీ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వాటికి ఎంత ఖర్చు చేశారు? మిగిలిపోయిన ప్యాకేజీలు క్యాన్సిల్ అయ్యాయా? అయ్యి ఉంటే మళ్లీ ఎప్పుడు టెండర్‌కు పిలిచి దానిని పూర్తి చేస్తారు. ఈ SRBC క్రింద కర్నూలు జిల్లా, కడప జిల్లాలో జమ్మలమడుగు నియోజకవర్గంలో పెద్దముడియం, మైలవరం మండలాల్లో కూడా ఆయకట్టు ఉంది. ఇది చాలా ముఖ్యమైన ప్రాజెక్టు. గతంలో జమ్మలమడుగు, ముద్దనూరుకు ముఖ్యమంత్రిగారు వచ్చినప్పుడు దీనిని త్వరగా పూర్తి చేస్తామని తెలియచేశారు. వీటిలో మిగిలిపోయినటువంటి ప్యాకేజీలు ఏవైతే ఉన్నాయో, ఒకవేళ క్యాన్సిల్ కానటువంటి ప్యాకేజీలను క్యాన్సిల్ చేసి టెండర్లు పిలిచి త్వరగా పూర్తి చేయాలని, మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు పి. రామ సుబ్బారెడ్డి గారు చెప్పినట్లుగా పెద్దమడుగు, మైలవరం, జమ్మలమడుగు ప్రాంతాలలో ఉన్న SRBC లో 36,37,38 ప్యాకేజీలకు సంబంధించి ఈ సీజన్ జూన్ నాటికి మొ త్తం పనులు పూర్తి చేస్తాము. ఇటు పోతిరెడ్డిపాడు దగ్గర నుంచి SRBC, తెలుగు గంగ ద్వారా కర్నూలు జిల్లాకు ఈ సంవత్సరం దగ్గర దగ్గర 70 నుండి 80 టీ.ఎం.సీల నీళ్లు ఇవ్వడం జరిగింది. అదే విధంగా కడప జిల్లాకు కూడా దాదాపు 40 నుండి 50 టీ.ఎం.సీల నీళ్లు ఇవ్వడం జరిగింది. ఏవైతే పెండింగ్ పనులు, ప్యాకేజీ పనులు ఉన్నాయో, అవన్నీ జూన్ నాటికి పూర్తి చేయడం జరుగుతుందని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ పి. రామ సుబ్బారెడ్డి:** అధ్యక్షా, త్వరగా టెండర్లు పిలిచి పూర్తి చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:** అధ్యక్షా, ఖచ్చితంగా పూర్తి చేసి నీళ్లు ఇస్తామని తెలియజేస్తున్నాను.

**MR. CHAIRMAN:** Question no.10054(27), Minister for Labour, Employment, Training and Factories,

## <u>చంద్రన్న బీమా పథకంలో అవకతవకలు</u>

ప్రశ్న నెం.10054(27)

**శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) చంద్రన్న బీమా పథకంలో మరణించిన కార్మికుల కుటుంబానికి చెల్లించిన బీమా విషయంలో ఏవైనా అవకతవకలు జరిగాయా;

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన కార్మిక, ఉపాధి, శి క్షణ, మరియు ఫ్యాక్టరీల శాఖ మంత్రి (శ్రీ పితాని సత్యనారాయణ):**

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి:** అధ్యక్షా, చంద్రన్న బీమా పథకం చాలా మంచి పథకం. అయితే దీనిని 18 సంవత్సరాల వయస్సు వరకే పరిమితం చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో, దాదాపు 67 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంతకు ముందు జనతా ఇన్సూరెన్స్ స్కీమ్ కింద చనిపోయిన పిల్లలకు ఈ స్కీమ్ ద్వారా వారి కుటుంబ సభ్యులను ఆదుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ స్కీమ్ లేదు. కాబట్టి చంద్రన్న బీమా వయోపరిధిని 18 సంవత్సరాలకే పరిమితం కాకుండా పాఠశాల వయస్సు పిల్లలకు కూడా దీనిని వర్తింప చేయాలని, దీని గురించి పరిశీలన చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు(ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** అధ్యక్షా, ఈ చంద్రన్న బీమా పథకం ఎంతో చక్కగా నడుస్తోంది. పేదలపాలిట ఆశాదీపంగా కాపాడుతుంది. ఇటువంటి చంద్రన్న బీమా పథకంలో మనం పరిశీలించవలసింది ఏమిటంటే ఏ ఏరియా నుంచి ఎక్కువగా కవర్ అవుతున్నారు, ఏ ఏరియా నుంచి కవర్ కాకుండా ఉంటున్నారనేది స్టడీ చేయాలి. ఎందుకంటే నాకు తెలిసి ఏజెన్సీ ఏరియాలైన పాడేరు, సీతంపేటలలో ఎక్కువ మంది సభ్యులు చంద్రన్న బీమా పథకంలో చేరలేదు. దీనిపై వారికి అవగాహన లేదు. సరైనటువంటి ప్రచారం కూడా అక్కడ జరగడం లేదు. ఈ పథకం ఎక్కడైతే కవర్ కాలేదో, దానిని అధ్యయనం చేసి అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని నేను మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు(నామినేటెడ్):** అధ్యక్షా, ఇప్పుడు బతికి ఉన్న వారి పేర్లను పెట్టడం సంప్రదాయం కాదు. మొదటి నుండి అటువంటి పేర్లు లేవు, గతంలోనూ లేవు. చంద్రన్న బీమా కంటే ముఖ్యమంత్రి బీమా పథకం అంటే బాగుంటుంది. చాలా కార్యక్రమాలకు చంద్రన్న అనే పేరు పెడుతున్నారు. ఆయన అభిమానిగా, సహచరుడిగా నేను చెబుతున్నాను, ఆ పేర్లు అంత మంచిది కాదని సూచిస్తున్నాను. అవసరమైతే పథకం పేరుని మార్చి ముఖ్యమంత్రి బీమా పథకం అని పెట్టండి.

**శ్రీ పితాని సత్యనారాయణ:** అధ్యక్షా, చంద్రన్న బీమా పథకాన్ని అసంఘటిత కార్మికుల శ్రేయస్సు కోసం ప్రారంభించిన పథకం. విద్యార్థులకు వేరే స్కీమ్స్ ఉన్నాయి. విద్యార్థులకు సంబంధించిన స్కీమ్స్‌తోటి దీనిని లింక్

చేయడానికి వీలులేదు. అనేక రంగాల్లో కార్మికులు ఉన్నారు. వారు ఏ శాఖకు చెందిన వారైనా, ప్రత్యేకంగా ఆఖరికి కుక్, ఆటో డ్రైవర్, కూలీ చేసుకునే కార్మికుడు, రోజు రాళ్లు ఎత్తుకునే వారూ వీరంతా అసంఘటిత కార్మికుల గొడుగు క్రిందకు రావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గారు ఆలోచన చేశారు. ఎవరైతే ఇతర బీమా పథకాలలో కవర్ కానటువంటి వారు ఉన్నారో, వారందరినీ ఈ పథకం క్రిందకు తీసుకురావాలనే ఉద్దేశంతోటి పీపుల్స్ సర్వే ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో దాదాపు 2,50,00,000 మంది అసంఘటిత కార్మికులు ఉన్నారని, వారందరికి అనుగుణంగా బీమా పథకాన్ని అమలు జరుపుతున్నాము. మరీ ప్రధానంగా బీమా పథకంలో నమోదు చేయించుకున్న వారికి ఏదైనా ప్రమాదం జరిగితే 10 నుండి 11 రోజుల లోపల ఈ బీమా పథకం క్లైమ్స్ కూడా చెల్లిస్తున్నాము. ఏ బీమా పథకంలో కూడా ఈ విధంగా 10 రోజులలో చెల్లించిన దాఖలాలు లేవు. మన ముఖ్యమంత్రి గారు తలపెట్టిన ఈ పథకం ఒక మానసపుత్రికగా తీసుకుని సమాచారం వచ్చిన 24 గంటలలో రూ.5వేల ఇచ్చే కార్యక్రమం కానీ, సమాచారం వచ్చిన తరువాత ఎఫ్ఐఆర్, డెత్ రిపోర్ట్సని అప్‌లోడ్ చేయడానికి రెండు రోజులు తీసుకునే కార్యక్రమం, పోస్టుమార్టమ్ రిపోర్టు అదనంగా నాలుగు రోజుల్లో ఇచ్చే కార్యకమాన్ని కానీ, ఫోరెన్సిక్ లాబోరేటరీ నుండి వచ్చినప్పుడు ఆరవ రోజు చేసినట్లయితే పది రోజుల్లో దీనిని క్లెయిమ్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయ తీసుకుంది. దానికి అనుగుణంగా ఈ రోజు పని చేస్తున్నాము. ఏదైనా ముఖ్యమంత్రి గారు చేపట్టి పేదల మన్ననలు పొందుతున్న కార్యక్రమం ఇది. గాదె శ్రీనివాసుల నాయుడు గారు చెప్పినట్లు ఎస్టీ ఏరియాలో ప్రచారం కావడం లేదనేది వాస్తవం కాదు. కారణం ఏమిటంటే, ఈ బీమా పథకం కోసం రూ.15లు మేము సెర్ప్ ద్వారా కలెక్టు చేస్తున్నాము. సెర్ప్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలే కాకుండా అంతకు ముందు ఉన్న డేటాను గానీ, దీనికి సంబంధించిన డేటాను గానీ, ప్రజా సాధికార సర్వేకి అనుగుణంగా డేటాను తీసుకొని ఎప్పటికప్పుడు ఏ ఏరియా కూడా మిగులకుండా ఈ పథకాన్ని అమలుచేస్తున్నాము. ఉదాహరణకు చూసినట్లయితే, ఈ సంవత్సరంలో నేను చేసిన కార్యక్రమంలో సెర్ప్ ద్వారా వసూలు చేసిన రూ.15లను డేటా ఎంట్రీకి కానీ, సమాచార శాఖకు సంబంధించిన సిబ్బందికి మాత్రమే ఖర్చు చేస్తున్నాము. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వ్యక్తి మీద రూ.240 ఖర్చు చేస్తుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా రూ.240 ఖర్చు చేస్తుంది. ఇవి కాకుండా ఏదైతే ఎక్స్ట్రా బీమా కేంద్ర ప్రభుత్వంతోటి కుదరలేదో రూ.80 చేస్తే మొత్తం రూ.560 ప్రతి వ్యక్తి మీద ఈ చంద్రన్న బీమా ఖర్చు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేస్తుంది. తద్వారా ఈ కార్యక్రమం చేస్తుండడం వల్ల చాలా వరకు అనాథలుగా ఉండి కర్మకాండలు చేయాలనుకునే వ్యక్తులకు వెంటనే రూ.5వేలు ఇచ్చి, ఆ రోజు దినచర్య చేస్తున్నాం. 18 నుంచి 50 సంవత్సల లోపు వారు సాధారణ మరణం పొందితే మిగిలిన రూ.1,95,000 లు కూడా పది రోజుల లోపల చెల్లిస్తున్నాము. ఈ పద్ధతి ఏ బీమా పథకానికీ లేదు. ఒకవేళ ఇటువంటివి LIC మరియు ఓరియంటల్ బీమా కంపెనీ పథకాలు వచ్చినప్పటికీ వారికి మేము ఇచ్చిన గైడ్‌లైన్స్‌లో అప్‌లోడింగ్‌లో మా అధికారులు చేస్తున్నారు. డిపార్ట్‌మెంటల్‌గా పోలీస్, ఆరోగ్యం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీ రాజ్ ఈ రకంగా అన్ని డిపార్టుమెంట్లు కలిపి మొత్తం 6 నుండి 7 రోజులలో అప్‌లోడ్ చేస్తే 10 రోజుల లోపల ఈ బీమా అందజేస్తున్నాము. మరొక విషయం ఏమిటంటే చంద్రన్న బీమా అనేది కేంద్ర ప్రభుత్వంతో

సంబంధం లేకుండా ప్రారంభించిన పథకం. గౌరవ సభ్యులు ఏదైతే అడిగారో, ఆ రోజుకి ఇటువంటి బీమా పథకం కేంద్ర ప్రభుత్వంలో లేకపోతే మన రాష్ట్రంలో మొట్టమొదటిగా కార్మిక శాఖ నుంచి ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా పెట్టిన పథకం ఇది. ఈ పథకం ఎప్పుడైతే విజయవంతం అయ్యిందో, కేంద్రంలో కొన్ని పథకాలు వచ్చాయి వాటిని అనుసంధానం చేయాలని కొన్ని ఆర్థిక ఇబ్బందులున్నా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను తీసుకొని ఆ కార్యక్రమాలను అమలుచేస్తున్నాము. ఇవ్వాళ 200 PMJJBY (Pradhan Mamatri Jeevan Jyoti Bima Yojana) చంద్రన్న బీమా పథకాన్ని పెడుతున్నాము. ఆ స్కీమ్‌ని అనుసంధానం చేసుకొని పెడుతున్నామే తప్ప మేమేదో ముఖ్యమంత్రి పేరు పెట్టుకున్నామన్న బాధ సభ్యులకు ఉండనక్కర లేదు. అందుచేత గౌరవ సభ్యులు దీనిని వక్రీకరించడం గానీ, ద్వందార్థాలు తీసుకురావడం గానీ ప్రయోగించ వద్దని గౌరవ సభ్యులను సభా పూర్వకంగా కోరుతున్నాను. ఇంకా ఏమైనా క్లారిఫికేషన్స్ ఉంటే ఖచ్చితంగా మీ సలహాలు తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇంకా మోడరేషన్స్ మీరు ఇస్తామన్నారు. అనేక పథకాలు కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్నాయి.

మన రాష్ట్రంలో ప్రత్యేక హోదాకు సంబంధించిన సమస్యలు కూడా ఉన్నాయి. (బిజెపి సభ్యులను ఉద్దేశించి) ఆ సమస్యల పరిష్కారానికి మీరు కూడా సహకరించండి, అటువంటి కార్యక్రమాలకు మేము కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ సహకరిస్తున్నాం. ఇప్పుడు కొన్ని ఇబ్బందులు వచ్చాయి. అంకెలలో మీకు(బిజెపి ప్రభుత్వానికి) మాకు వ్యత్యాసం ఉంది. అయినా అప్పుడే బయటపడే పరిస్థితి రాకూడదని గౌరవ సభ్యులను కోరుకుంటున్నాను.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, PMJJBY, చంద్రన్న బీమా పథకానికి ఈ మధ్య కాలంలో బాగా ప్రచారం జరుగుతుంటే దానిని ఏమీ కనపడకుండా చంద్రన్న బీమా పథకం అని కనిపించే విధంగా ప్రయత్నం చేస్తున్నారు. చంద్రన్న బీమా పథకం పేరుతో విజయవాడలో మొత్తం అన్ని హోర్డింగ్స్ కనబడుతున్నాయి. PMJJBY కనిపించడం లేదు, చంద్రన్న బీమా యోజన తప్ప మరేదీ కనిపించడం లేదు.

**శ్రీ పితాని సత్యనారాయణ:** అధ్యక్షా, ఆ విషయం నా నోటీసుకి కూడా వచ్చింది. సాంకేతిక పరంగా కొన్ని తప్పులు జరిగినందున ఖచ్చితంగా దానిని సరిచేసే బాధ్యతని తీసుకుంటాం. ఎక్కడైతే తప్పు జరిగిందో అక్కడ PMJJBY ని పెట్టవలసిన బాధ్యత ఉంది. PMJJBY ను చిన్నగా పెట్టారు. నేను టెక్నికల్‌గా చూశాను. నాకు పబ్లిక్ నుండి ఫీడ్‌బాక్ వచ్చింది. ఖచ్చితంగా దానిని సరిచేస్తాము.

MR. CAIRMAN Question No.10285(28), Minister for Transport, BC Welfare and Empowerment, Handlooms and Textiles

## రోడ్డు పన్ను బకాయిలు

ప్రశ్న నెం.10285(28)

**డా. యం.వి.వి.ఎస్. మూర్తి, వట్టికూటి వీర వెంకన్న చౌదరి, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలోని వాహనాలలో 1/3 వంతు రోడ్డు పన్నును చెల్లించలేదన్న మరియు దాదాపు రూ.180కోట్లు బకాయిలు ఉన్నాయనే విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, బకాయిలు వసూలు చేయడం కోసం తీసుకొన్న చర్యలు ఏమిటి?

**గౌరవనీయులైన రవాణా, బీసీ సంక్షేమం–సాధికారత, చేనేత, జౌళి శాఖ మంత్రి (శ్రీ కె. అచ్చెన్నాయుడు):**

అ) లేదండీ.

రవాణా వాహనములు ప్రతి త్రైమాసికానికి పన్నులు చెల్లిస్తాయి. త్రైమాసికం ఆఖరు నాటికి అంటే 31-12-2017 వరకు రూ.39.23కోట్ల మొత్తం త్రైమాసిక పన్ను వసూలు చేయవలసివుంది. వాస్తవ పన్ను వసూళ్లు రూ.125.99కోట్లు ఇంకా రూ13.24కోట్లు వసూలు కావలసి ఉంది. గత త్రైమాసికపు పన్ను బకాయిలు రూ.106.17కోట్లుగా ఉన్నాయి.

ఆ)

1. పన్ను చెల్లించని యజమానులందరికీ నోటీసులు జారీ చేయడమయింది. మరియు పరిశీలించడమవుతున్నది.

2. పన్ను చెల్లించని రవాణా వాహనాలపై క్రమం తప్పకుండా సమర్ధవంతమైన తనిఖీ నిర్వహించడమవుతున్నది. అట్టి అమలు తనఖీ వివరాలు ఈ క్రింద ఇవ్వడమైనది.

| వరుస సంఖ్య | వివరాలు | 2016-17 | 2017-18(ఫిబ్రవరి వరకు) |
|---|---|---|---|
| 1. | నమోదైన కేసుల సంఖ్య | 38405 | 39530 |
| 2. | వసూలు చేసిన పన్నులు | రూ.8.62కోట్లు | రూ.9.41కోట్లు |
| 3. | వసూలు చేసిన అపరాధ రుసుము | రూ.8.28కోట్లు | రూ.8.70కోట్లు |
| 4. | వసూలు చేసిన మొత్తం | రూ.16.90 కోట్లు | రూ.18.11కోట్లు |

**శ్రీ వి. వి.వి. చౌదరి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, కొన్ని పత్రికల్లో రాష్ట్రంలో పన్ను చెల్లించని వాహనాలు సుమారు 4.63 లక్షల వాహనాలు ఉన్నాయని వచ్చింది. వాటిలో ఎక్కువగా ఆటోలు, మోటారు క్యాబ్స్, ట్రాక్టరు ట్రైలర్స్, స్టేజ్ ట్రేలర్లు, మ్యాక్సీక్యాబ్‌లు ఉన్నట్లుగా అవగతం అవుతుంది. దీనిమీద విస్తృతంగా తనిఖీలు నిర్వహించి పన్ను బకాయిలను వసూలు చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తున్నాం. రూ.121కోట్ల బకాయి క్రింద వసూలు, సుమారు రూ.60 కోట్ల వాటికి అప్రూవల్ రుసుం కూడా వసూలు కావలసివుంది. ఎప్పుడు అయితే రైడింగ్ జరిపి సీజ్ చేసి వాహనాలు పార్కింగ్ కూడా ఈనాడు పెద్ద సమస్య అవుతుంది. సీజ్ చేసిన వాహనాలన్నింటినీ కూడా పార్కింగ్ చేయడానికి కొంత అవకాశాలు కల్పించటం కోసం ప్రైవేట్ ల్యాండ్స్‌ను లీజుకు తీసుకోవడం కూడా జరుగుతుంది. ఈ ప్రైవేటు లాండ్స్‌ని లీజుకు తీసుకోవడంతో ఇదొక అదనపు భారంగా మారి మళ్లీ ప్రభుత్వానికి తరలించే పరిస్థితి ఉన్నప్పుడు దీనికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటో వివరిస్తే బాగుంటుందని నేను మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు(నామినేటెడ్):** అధ్యక్షా, వాహనాలకు పన్ను కట్టనప్పుడు గానీ, ఆర్‌సీ, ఎఫ్‌సీలు లేనప్పడు గానీ తనిఖీచేసే అధికారం ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఉంది కాబట్టి వారు చేస్తున్నారు. దీనితో పాటు పోలీస్ డిపార్ట్‌మెంట్ కూడా వాహనాలను ఎక్కడ అంటే అక్కడ ఆపడం వల్ల కొన్ని సమస్యలు వస్తున్నాయి. నాకు తెలిసినంతమరకు పోలీసుశాఖ ఎక్కడైనా వాహనాలను ఆపితే వారు దాన్ని నోట్ చేసి ఒక కంప్లైట్ రాసి పంపించాలి తప్ప వాహనాలను స్వాధీనం చేసుకునే అధికారం వారికి లేదు. దీనిపైన క్లారిటీ ఇవ్వాలని నేను మీద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ కె. అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, రాష్ట్రంలో సుమారుగా ఒక కోటి 6లక్షల వాహనాలు ఉన్నాయి. అందులో త్రైమాసిక పన్ను కడుతున్న వాహనాలు దాదాపు 9,21,719 ఉన్నాయి. క్వార్టర్లీ అంటే ట్యాక్స్ మూడు మాసాలకు ఒక సారి పన్ను కడుతున్నారు. అయితే అవి కట్టవలసిన పన్ను రూ. 139.023 కోట్లు ఇంతవరకు దాదాపు 6,76,936 వాహనాలే త్రైమాసిక పన్ను చెల్లిస్తున్నాయి. దాని విలువ రూ. 125.99 కోట్లు. అయితే, మిగిలిన వాహనాలకు త్రైమాసిక పన్ను కట్టడం లేదు. వాటిల్లో ఎక్కువగా ఆటోరిక్షాలు, ట్రాక్టర్లు ఉన్నాయి. సుమారుగా 1,24,729 ఆటోలు, 85,873 ట్రాక్టర్లు ఉన్నాయి. వీరు త్రైమాసిక పన్ను చాలా తక్కువగా కడుతుంటారు. అయితే మూడు నెలలకు ఒకసారి కట్టాలంటే కొంచెం ఇబ్బంది పడుతున్నందున గ్యాప్ వచ్చింది. ఏవైతే ట్రాక్టర్లు, ఆటోలు ఉన్నాయో, వీటికి కూడా త్రైమాసిక పన్ను ఎత్తివేసి సింగిల్ టైం లైఫ్‌ట్యాక్స్ కట్టడానికి ఏర్పాట్లు చేయాలని ఆలోచిస్తున్నాను. ఆ విషయం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇలా లేకపోవడం వల్ల మాటిమాటికీ మూడు నెలలకు ఒకసారి ట్యాక్స్ కట్టడం వాళ్లకు ఇబ్బందిగా ఉంటున్నది. మిగతా వాహనాలలాగే ట్రాక్టర్లు, ఆటోలు ఒకేసారి లైఫ్‌ట్యాక్స్ కట్టుకుంటే వాళ్లకి ఈ సమస్య ఉండదు. ప్రభుత్వానికి ఈ వాహనాలకు ట్యాక్స్ కలెక్షన్‌లో ఇబ్బంది లేకుండా ఉంటుంది.

పోలీసు శాఖ ఈ ట్యాక్స్ గురించి గానీ, ఇంకోదాని గురించి గానీ వారు తనిఖీయేయరు. రాష్ట్రంలో రోడ్డు యాక్సిడెంట్లు చాలా ఎక్కువ అవుతున్నాయి. ఎంత కఠిన చర్యలు తీసుకొన్నా, పోలీసులు గానీ, ట్రాన్స్‌పోర్ట్ గానీ చర్యలు తీసుకున్నా రోడ్ల మీద రోజుకి కొన్ని వందల మంది చనిపోవడం మనం ఈరోజు చూస్తున్నాము. రూల్ ప్రకారం ఆటోలో ఆరుగురే ఎక్కాలి కానీ ఇరవై మందిని ఎక్కించుకోవడం లేదా రాంగ్ రూట్‌లో వెళ్లడం జరుగుతుంది. వ్యానులు, ట్రాక్టర్ మీద మనుషులు ప్రయాణించకుండా తనిఖీ చేసి నిరోధించడానికి పోలీసులు తనిఖీస్తున్నారే కానీ, ఏదో హెరాస్ చేయాలని కాదు. ఆ ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. తప్పనిసరిగా పోలీసు శాఖకు కూడా సూచనలు ఇచ్చాం. హెరాస్‌మెంట్ లేకుండా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉ. 11.00

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు:** అధ్యక్షా, ఏపియస్‌ఆర్‌టిసి జూన్ 2016నుండి ఈ కార్యక్రమం అమలుచేయడం ద్వారా విద్యార్థులకు ముఖ్యంగా పెద్దలందరికీ సదుపాయంగా ఉన్నది. అయితే, ఇంకా మెరుగైన సేవలందించడం కోసం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోనే కౌంటర్లు పెట్టడమనేది కాకుండా ప్రధాన పట్టణాలలో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలి. ఆర్‌టిసిలో గరుడ, వెన్నెల బస్ సర్వీసులను రద్దు చేస్తున్నారు. ఎందువల్ల అని అడిగితే ఆక్యుపేషన్ లేదని అంటున్నారు. శ్రీకాకుళం నుండి విజయవాడ వరకూ వెన్నెల బస్ సర్వీస్ ఉండేది. ఆక్యుపేషన్ లేనందువల్ల దానిని రద్దు చేశామని అధికారులు కారణం చెబుతున్నారు. అటువంటి బస్సుల్లో కిందకూడా చాలా ఖాళీ ఉంటుంది. పార్శిల్ సర్వీసెస్‌ను కూడా బుక్ చేసుకున్నట్లయితే ఆక్యుపేషన్ మరియు పార్శిల్ సర్వీసు రెండూ కూడా **simultaneous**గా జరగడానికి అవకాశం ఉంటుంది. ఎస్.ఆర్.ఎం.టి, నవత వంటి ట్రాన్స్‌పోర్టు సర్వీసులు ప్రత్యేకంగా పార్శిల్ సర్వీసులు ఉంటాయి, అదే విధంగా చివరి దశకు చేరుకున్న బస్సులను వేలం వేయకుండా ఉన్నవాటిని అలాగే నిరుపయోగంగా ఉంచకుండా కొంత మార్పు చేసి పార్శిల్ సర్వీసెస్‌కు ఉపయోగపడేలా చేస్తే ఆర్‌టిసికి లాభాలు వచ్చేందుకు అవకాశముంటుంది. కాబట్టి ఆ రకమైన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** ఏపియస్‌ఆర్‌టిసి కష్టాలు, నష్టాలలో ఉన్నప్పుడు కార్గో హ్యాండ్లింగ్ ద్వారా ఒక వెలుగు రేఖ కనిపించింది. ఎప్పుడైతే ఏఎన్‌ఎల్ పార్శిల్‌ను ఏపియస్‌ఆర్‌టిసి తీసుకుందో మొదటి సంవత్సరంలోనే సుమారు రూ.16 కోట్ల ఆదాయం వచ్చింది. గతంలో ఏఎన్‌ఎల్ సర్వీసు వారికి ఏపియస్‌ఆర్‌టిసి రూ.9 కోట్లకు ఇచ్చింది. ఇప్పుడు ప్రభుత్వమే 2016నుండి ప్రారంభించింది. మొదటి సంవత్సరంలోనే రూ.16 కోట్ల ఆదాయం వచ్చింది. కాబట్టి దీనిపై దృష్టిపెట్టి బస్సులను హైర్ చేసుకుని, కింది భాగంలో కొరియర్, బ్యాగేజి సర్వీసులకు అవకాశం కల్పించాలి. ముఖ్యంగా కెఎస్‌ఆర్‌టిసి ఈ విషయంలో ఎక్కువ లాభాలు గడిస్తున్నది. ప్రైవేటు వారితో పోల్చి చూసినప్పుడు 40 శాతం తక్కువ ఉన్నది. ప్రైవేటు వారు ఎక్కువ వసూలు చేస్తున్నారు. పార్శిల్ సేవల ద్వారా ఎక్కువ లాభాలు గడించవచ్చు.

కనుక దీనిపై దృష్టి పెడితే బాగుంటుందని నేను మనవిచేస్తున్నాను. మంత్రిగారు చెప్పినటువంటి లాజిస్టిక్ సర్వీసెస్ అమలైతే బాగుంటుంది. నిజంగా డోర్ డెలివరీ సిస్టమ్‌ని అందరూ కోరుకుంటారు. అది గనక అమలైతే మిగతావారు చేయలేని పనిని మనం చేసినట్లవుతుంది. అటువంటి చర్యలు తీసుకుంటే ఏపియస్ఆర్‌టిసి మంచి లాభాలలో ఉంటుందని తెలియచేస్తున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, మూతపడిన కొవ్వూరు డిపోను మంత్రిగారు ఓపెన్ చేయించారు. అయితే అక్కడ నుండి అమరావతికి బస్ సర్వీసును ఏర్పాటు చేస్తే జిల్లా అంతటికీ ఉపయోగంగా ఉంటుంది. జిల్లా కేంద్ర స్థానానికి బస్‌ను ఏర్పాటు చేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

**మిస్టర్ చైర్మన్:** అది సెపరేట్ క్వశ్చన్. దీనికి సంబంధించింది కాదు.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి(పట్టభద్రుల నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, ఈ మధ్య కాలంలో మిగతా అన్ని సర్వీసుల కంటే కార్గో సర్వీసెస్ మంచి సర్వీసును అందచేయడమే కాకుండా అగ్రస్థానంలో ఉన్నది. ఈ ప్రయోగం విజయవంతమైనందుకు సంతోషం. ఆర్‌టీసీకి లాభాలను పెంచుకోవడానికి మరిన్ని అవకాశాలు ఉన్నాయి. కాకపోతే డోర్ డెలివరీ ఏర్పాటు కోసం కొంతమంది సిబ్బంది అవసరమవుతుంది. అటువంటి ఏర్పాట్లు చేసుకుంటే ఈ స్కీము మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. లాభాల బాటలో ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో పరిస్థితులను కూడా అధ్యయనం చేసి మరింత సమర్థవంతంగా ఈ సేవలను విస్తృతపరచాలని కోరుకుంటున్నాను.

**శ్రీ కె. అచ్చెన్నాయుడు :** అధ్యక్షా, పార్శిల్ సర్వీసులను 1988లో ప్రవేశపెట్టడం జరిగింది. మొదట ఏ.ఎస్.ఎల్ పార్శిల్ సర్వీసెస్ వారికి ఇవ్వడం వల్ల పార్శిల్ సర్వీసులను వాళ్ళు చేసేవారు. ఈ మధ్యనే ఆర్‌టిసి యాజమాన్యం దీనిపై అధ్యయనం చేసి మనమే చేస్తే ఎలా ఉంటుందని ఆలోచించి 2015-16లో వారి అగ్రిమెంట్ పీరియడ్ అయిపోయింది కాబట్టి మనమే చేద్దామని మొదలుపెట్టడం జరిగింది. ఏఎస్ఎల్ వారు రూ.9 కోట్లు మనకు కట్టేవారు. ఆ గ్యాప్ పీరియడ్‌లోనే మనకు సుమారు రూ.16 కోట్లు అదనంగా వచ్చింది. అయితే, ఇందుకు ఎక్కువ సిబ్బంది కూడా కావాలి. అందుకే ముందుగా ఔట్ సోర్సింగ్‌లో సిబ్బందిని తీసుకుని గ్రామ గ్రామానికి ఏజెంట్ల ద్వారా సేవలను మొదలుపెట్టాము. ఇప్పుడు సభ్యులు డోర్ డెలివరీ చేస్తే బాగుంటుందని అన్నారు. తప్పకుండా దానిని కూడా పరిశీలిస్తాము. వీలైనంత త్వరలో దానిని కూడా చేయడానికి అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నాము. ఆర్‌టిసి అంటే ఎప్పుడూ నష్టాలలో ఉన్నటువంటి సంస్థ అని ముద్ర పడింది. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ లాభాలలోకి తీసుకురావాలి. లాభాలంటే బస్ ఛార్జీలు పెంచడమో, ప్రజల మీద భారం మోపడమో కాకుండా ఉన్నటువంటి ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని సంస్థను లాభాలలోకి తీసుకురావడానికి అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నాము. అందులో భాగంగానే పార్శిల్ సర్వీసులను సొంతంగా చేయడం వల్ల కొంత ఆదాయం వస్తున్నది.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లు అన్నీ కూడా ఈనాడు విశాలమైన స్థలాల్లో ఉన్నాయి. పిపిపి పద్ధతిలో ఎవరైనా ముందుకు వస్తే షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్ కట్టుకోవడానికి అవకాశం ఇచ్చి తద్వారా కొంత ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాము. సంతోషకరమైన విషయమేమంటే, గత సంవత్సరం ఆర్‌టిసికి రూ.700 కోట్లు నష్టం వస్తే దానిని రూ.350 కోట్లకు తగ్గించాము. వచ్చే సంవత్సరం కూడా break even చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాము. నాకు తెలిసి ఇంతవరకూ ప్రభుత్వం ఆర్‌టీసీకి ఎటువంటి సహాయం అందించలేదు. నేను వచ్చిన తరువాత ముఖ్యమంత్రిగారితో చెప్పి గత సంవత్సరం రూ.450 కోట్లు ఇచ్చాము. ఈ సంవత్సరం కూడా రూ.500 కోట్లు బడ్జెట్‌లో పెట్టి అందులో సభ్యులు చెప్పిన విషయాలు దృష్టిలో పెట్టుకుని చేస్తాము. గ్రామాలలో పల్లె వెలుగులు తీసేశారు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని సభ్యులు చెబుతున్నారని ఎక్స్‌క్లూజివ్‌గా బడ్జెట్‌లో రూ.200 కోట్లు పల్లె వెలుగు బస్సులు కొనడానికి పెట్టాము. బడ్జెట్ ఆమోదించగానే పల్లె వెలుగు బస్సులు కొని ఏ యే డిపోలలో ఎంత అవసరముందో చూసి ఆయా డిపోలకు పల్లె వెలుగు బస్సులను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలలో ఆర్‌టీసీ బస్సు సేవలను అందించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాము. రానున్న రోజులలో ఏపియస్‌ఆర్‌టిసిని దేశంలోనే ఒక మోడల్‌గా తయారు చేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని మీ ద్వారా సభ్యులకు తెలియచేస్తున్నాను. పార్శిల్ సర్వీసులను గ్రామాల వారీగా డోర్ డెలివరీ చేసేందుకు కృషి చేస్తున్నాము. దీనికి కొంత విజిబులిటీని తీసుకురావాలి. అది కూడా తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తామని మనవిచేస్తున్నాను.

**మిస్టర్ ఛైర్మన్ :** స్పెషల్ మెన్షన్లు ఉన్నాయి.

**డా. ఎ.ఎస్. రామకృష్ణ :** అధ్యక్షా, ఒక ప్రశ్న ఉన్నది. దయచేసి అడగనివ్వండి.

MR. CAIRMAN Question No.10154(30), Minister for Social Welfare & Empowerment and Tribal Welfare & Empowerment

## <u>నైవాసికక ఒప్పంద ఉపాధ్యాయులకు జీతాలు</u>

ప్రశ్న నెం.10154(30)

**డా. ఎ.యస్. రామకృష్ణ, ఎం.ఎల్.సి.**

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం మరియు సాధికారత, గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

ఇ) వేసవి సెలవుల కాలంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ నైవాసిక విద్యా సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేందుకు ఏదైనా ప్రతిపాదన ఉందా;

ఈ) అయితే, సదరు సదుపాయాన్ని ఎప్పటిలోగా కల్పించడం జరుగుతుంది?

**గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం మరియు సాధికారత, గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రి (శ్రీ నక్కా ఆనంద్‌బాబు):**

అ) మహాశయా, 2/2003 సొసైటీ స్టాండింగ్ ఉత్తరువు ప్రకారం, ఎపిఎస్ డబ్ల్యుర్ఇఐఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల ఒప్పంద కాలవ్యవధి విద్యా సంవత్సరం మొట్టమొదటి రోజున మొదలై మరియు విద్యాసంవత్సరం చివరి రోజున ముగుస్తుంది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**డా. ఎ.యస్. రామకృష్ణ(ఉపాధ్యాయ నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, సాంఘిక సంక్షేమ ఉపాధ్యాయుల పట్ల చాలా నిరాదరణ జరుగుతోంది. వారికి సంబంధించిన ప్రశ్నల పట్ల కూడా నిరాదరణ జరుగుతోంది. నా ప్రశ్నలను తమరు కూడా అనుమతించడం లేదు.

సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 870 మంది కాంట్రాక్టు టీచర్లు ఉన్నారు. వారికి సమ్మర్ శాలరీస్ ఇవ్వడం లేదు. మంత్రిగారు చెప్పినట్లు ఎకడమిక్ ఇయర్ నుండి ఏప్రిల్ వరకూ వాళ్లకు జీతాలు ఇస్తున్నారు. ఆ తరువాత దాదాపు నెలన్నర పాటు కాంట్రాక్టు టీచర్లకు, లెక్చరర్లకు జీతాలు ఇవ్వడం లేదు. వాళ్లు మేమేం పాపం చేశాము, మా పట్ల ఎందుకు నిరాదరణ చూపుతున్నారు అనుకుంటున్నారు. మేము పనిచేయడం లేదా, ఎందుకు మా పట్ల చిన్నచూపు చూస్తున్నారని వారు బాధపడుతున్నారు. చాలా కాలం నుండి వారు పనిచేస్తున్నారు. సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చింది. కాంట్రాక్టు టీచర్లు లేకపోతే సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు పనిచేయలేవు. కాబట్టి, నేను విజ్ఞప్తి చేసేదేమంటే, కెజిబివి పాఠశాలల్లో సమ్మర్ శాలరీస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. సమ్మర్ శాలరీస్ ఇవ్వాలంటే ఎంతవుతుంది అధ్యక్షా? రెండు, మూడు రోజులు బ్రేక్ తీసుకుని వారికి కూడా సమ్మర్ శాలరీస్ ఇవ్వాలని కోరుతున్నాను. ఈమధ్యనే ఎమ్ఎల్‌సి కమిటీ మెంబర్లం కూర్చుని ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో పనిచేసేవారికి టైం స్కేల్ ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అనుకున్నాము. ఎంతకాలం ఈ కాంట్రాక్టు టీచర్లు, లెక్చరర్లు అసంతృప్తితో పనిచేయాలి? అక్కడ పేద విద్యార్థులు చదువుకుంటారు. అక్కడ పాఠాలు చెప్పేవారు ఎక్కువ మంది కాంట్రాక్టు లెక్చరర్లు. వారు రెట్టింపు ఉత్సాహంతో, ప్రేరణతో, చిత్తశుద్ధితో పనిచేయాలంటే వారికి ఆర్థికపరమైన వెసులుబాటు అవసరమని నేను భావిస్తున్నాను. అందువల్ల వారికి ఒక రోజు లేదా రెండురోజులు గ్యాప్ ఇచ్చి జీతాలు ఇవ్వాలని కోరుతున్నాను. అవసరమైతే వొకేషనల్ కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, బ్రిడ్జ్‌కోర్సులు పెట్టి వారి సేవలను ఉపయోగించుకోవాలని కోరుతున్నాను. సమ్మర్‌లో కూడా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. మాకు జీతాలు ఇవ్వాలని అడుగుతున్నారు. 2007వరకూ రిజల్ట్స్ ఆధారంగా సమ్మర్ శాలరీస్ ఇవ్వడం జరిగింది. ఆ చరిత్ర ఉన్నది. దానిని పునరుద్ధరించవలసిందిగా మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను.

ఉ. 11.10

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** అధ్యక్షా, గురుకుల పాఠశాలలకు సంబంధించిన సమస్యలమీద మాట్లాడడానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రిగారు చెప్పారు కాబట్టి మిగిలిన అన్ని అంశాలజోలికి నేను ఇప్పుడు పోదలచుకోలేదు. కానీ మిగిలిన ఉద్యోగులతో పోలిస్తే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని ఒప్పంద ఉద్యోగులు చాలా ఎక్కువగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిని మీరు ప్రత్యేకంగా చూడాలి. ఎందుకంటే గతంలో ఉమ్మడి రాష్ట్రంలో గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖల్లో పనిచేసే ఒప్పంద ఉపాధ్యాయుల్ని క్రమబద్ధీకరించేవారు. చిన్న సాంకేతిక కారణం వల్ల, కొంత బ్యూరోక్రటిక్ ఆలస్యం వల్ల సాంఘిక సంక్షేమశాఖలో క్రమబద్ధీకరించడం ఆగిపోయింది. ఆ తరువాత ఒప్పంద ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించకూడదని ప్రభుత్వం చేసిన నిబంధన వల్ల సాంఘిక సంక్షేమశాఖలో పనిచేసే ఒప్పంద ఉద్యోగులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. మిగతావారికి, వీరికీ మధ్య గ్యాప్ వచ్చింది.

అన్ని గురుకుల పాఠశాలల్లోని పార్ట్‌టైం ఉపాధ్యాయుల వేతనాలను పెంచారు కానీ సాంఘిక సంక్షేమ పాఠశాలల్లోని వారికి మాత్రం వేతనాలు పెంచారు. వాస్తవానికి సాంఘిక సంక్షేమ వ్యవస్థ చాలా పెద్దది. కానీ సాంఘిక సంక్షేమ వ్యవస్థలో ఎందుకనో ఒప్పంద, పార్టుటైం ఉద్యోగుల విషయంలో చాలా నిరాదరణ కనిపిస్తున్న మాట వాస్తవం. దీనిని కొంచెం ప్రత్యేకంగా చూడాల్సిన అవసరముంది. ఎందుకు సాంఘిక సంక్షేమ వ్యవస్థలోనే ప్రతి ఒక్కటీ ఆలస్యమవుతోంది. ఏదైనా పని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో అయిదు నిమిషాల్లో అయితే, ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో రెండు రోజుల్లో అవుతుంది కానీ సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో మాత్రం ఏళ్ళ తరబడి ఎందుకు కావడంలేదనే విషయాన్ని కొంచెం మంత్రిగారు ప్రత్యేకంగా చూడాలని కోరుతున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో భవనాలైతే అద్భుతంగా ఉంటాయి కానీ అక్కడి ఉపాధ్యాయుల కష్టాలు ఇన్నీ, అన్నీ కావు. ఉపాధ్యాయులలో ఒప్పంద, శాశ్వత, పార్టుటైం, గెస్టు, అవుట్‌సోర్సింగ్ వంటి పేర్లు మన దగ్గర తప్ప ప్రపంచంలోకానీ, దేశంలోకానీ ఏ రాష్ట్రంలో లేవు. అన్ని డిపార్టుమెంట్లలో ఆన్‌రోల్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ చేశారు. సాంఘిక సంక్షేమశాఖలో చేయలేదు. కెజిబివిల్లో వేసవికాలంలో ఒప్పంద ఉపాధ్యాయులకు వేతనాలు ఇస్తున్నా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మాత్రం ఇవ్వడంలేదు. గతంలో రెండుసార్లు వారి సర్వీసులను క్రమబద్ధీకరించారు కానీ ఈసారి చేయలేదు. కాబట్టి మా సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తే కనుక అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని, కనుక చొరవ తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు** : అధ్యక్షా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఇటీవల అనేక రకాలైన కార్యక్రమాల్లో పాల్గొంటూ, అద్భుతాలు సృష్టిస్తూ, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదై రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చారు. వారందరూ ఆ రకంగా ప్రతిభ కనబరచడానికి ప్రధాన కారణం ఈ అధ్యాపకులే.

ఉమ్మడి రాష్ట్రంలో 2007 వరకూ అయిదు సంవత్సరాల సర్వీసు ఉన్న వారిని క్రమబద్ధీకరించారు. 2009 తరువాత పది సంవత్సరాలైనా వారు అలాగే కొనసాగుతున్నారు కానీ క్రమబద్ధీకరించే ప్రక్రియ చేపట్టలేదు. దయచేసి స్టాండింగ్ బోర్డు కమిటీలో చర్చించి, శాసనపరిషత్తు సభ్యులతో ఒక సమావేశాన్ని నిర్వహించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని ఒప్పంద ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించి, విద్యార్థులు ఇంకా మంచి ఉన్నత స్థానానికి వెళ్ళడానికి వినూత్నమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరముంది. ఎందుకంటే వినూత్నమైన మార్పులు తీసుకువచ్చినందునే ఆర్.టి.సి ఇవాళ లాభాలబాటలో పయనించడానికి అవకాశం కలిగింది. అలాగే సాంఘిక సంక్షేమశాఖలో కూడా పాత విధానానికి స్వస్తి చెప్పి కొత్త విధానానికి నాంది పలికి మార్పులు తీసుకువచ్చే విధంగా నూతనంగా ఆలోచించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు చేస్తున్న కృషికి మనందరమూ కూడా ఆ రకంగా ముందుకెళ్ళి అభివృద్ధి చేయాలని కోరుతూ అధ్యాపకుల పట్ల ఒక సానుకూల దృక్పథంతో ఆలోచించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ నక్కా ఆనందబాబు:** అధ్యక్షా, గౌరవసభ్యులు రామకృష్ణగారు, విటపు బాలసుబ్రహ్మణ్యం గారు, కత్తి నరసింహారెడ్డిగారు, శ్రీనివాసులు నాయుడుగారు ఇలా అందరూ కూడా ఉపాధ్యాయ ఎం.ఎల్.సిలుగా అనేక సూచనలు, సలహాలు చేశారు. ఈ ఒప్పంద ఉద్యోగుల వ్యవస్థ అనేది ఒక్క సాంఘిక సంక్షేమ శాఖలోనే కాదు. గిరిజన సంక్షేమం, వెనుకబడిన సంక్షేమం, ఎ.పి.ఆర్.ఇ.ఐ.ఎస్ అన్ని సొసైటీల్లో కూడా ఇదే వ్యవస్థ నడుస్తోంది. తప్పనిసరిగా మిగిలిన సొసైటీల్లో ఏ విధమైన విధానాలు అమలవుతున్నాయో చూసి సాంఘిక సంక్షేమశాఖలో కూడా ఆ విధానం తీసుకురావడానికి కచ్చితంగా చర్యలు తీసుకుంటాము.

గౌరవ సభ్యులు సమ్మర్ కోచింగ్ క్యాంపుల గురించి చెప్పారు. దానికి సంబంధించి ఇప్పటికే పనిచేస్తున్నటువంటి ఒప్పంద ఉపాధ్యాయుల్ని మేము విల్లింగ్ అడిగితే వందమంది ఉపాధ్యాయులు మాత్రమే సమ్మర్ కోచింగ్ ఇవ్వడానికి విల్లింగ్ ఇచ్చారు. అదేవిధంగా పూర్తిస్థాయిలో ఈ మార్పులు తీసుకువచ్చి ఈ వ్యవస్థని ముఖ్యంగా సాంఘికసంక్షేమశాఖ రెసిడెన్షియల్ సొసైటీని బలోపేతం చేయడానికి అందరి సూచనలు, సలహాలతో ముందుకెళ్తాం. కార్పొరేట్ విద్యకు దీటుగా మన గురుకుల పాఠశాలలను నడపాలనేదే ప్రభుత్వ ఆశయం, చంద్రబాబునాయుడుగారి ఆలోచన. తప్పనిసరిగా ఆ విధానంలో ముందుకు వెళ్ళడంకోసం అందరి సూచనలు, సలహాలు తీసుకుని త్వరలోనే ఉపాధ్యాయ ఎం.ఎల్.సిలతో ఒక సమావేశాన్ని నిర్వహిస్తామని తమద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**మిస్టర్ చైర్మన్:** ఈ సమావేశాలు పూర్తి అయ్యేలోపలే సమావేశం నిర్వహించండి.

**శ్రీ నక్కా ఆనందబాబు:** అలాగే సార్.

## 2. సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు:** అధ్యక్షా, సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి నేను ఒక సమస్యను ప్రత్యేక ప్రస్తావన ద్వారా తీసుకురాదలచుకున్నాను. రాష్ట్రంలో వెనుకబడిన కులాలు పెద్దయెత్తున ఉన్నాయి. వారిలో రజకులు అత్యంత వెనుకబడిన పరిస్థితి ఉన్నది. రాష్ట్రంలోని పదమూడు జిల్లాలలోని ఎనిమిది జిల్లాల్లో వారిపై సామాజిక దాడులు జరుగుతున్నట్లు, అలాగే గ్రామం నుంచి బహిష్కరిస్తున్నట్లు కూడా దినపత్రికల్లో చూస్తున్నాం. అలా జరిగిన మాట కూడా వాస్తవం. ఈ సందర్భంగా వారు నిరాహార దీక్షలు కూడా చేస్తున్నారు. వారికి కూడా ఒక సామాజిక రక్షణ చట్టాన్ని తీసుకురమ్మని, బడ్జెట్‌లో నిధులు పెంచి సబ్సిడీ లోన్లు ఇవ్వాలని, అలాగే ప్రభుత్వ సంస్థల్లో ఉన్నటువంటి దోభీ పోస్టులను రజకులతో నింపమని కోరుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కారం చేయమని మీద్వారా, సభద్వారా ప్రభుత్వం దృష్టికి ప్రత్యేక ప్రస్తావన ద్వారా తీసుకువస్తున్నాను.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి:** అధ్యక్షా, తీవ్ర కరవును ఎదుర్కొంటూ వెనుకబడిన ప్రాంతాలకు రక్షణ, నీటిపారుదల ప్రాజెక్టులను 2017లో పూర్తి చేద్దామనుకున్న ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నేటి ప్రధాన ప్రాజెక్టులైన హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు కనిపించడంలేదు. హంద్రీ–నీవా పూర్తిచేయడానికి రూ.2500 కోట్లు అవసరం కాగా, రూ.524.31 కోట్లు మాత్రం కేటాయించారు. దయచేసి ఈ బడ్జెట్‌లో దానిని రివైజ్ చేసి హంద్రీ–నీవాను పూర్తిచేయుటకు సహకరించాలని మీద్వారా కోరుతున్నాను. అలాగే గాలేరు–నగరికి కూడా రూ.845.15 కోట్లను రివైజ్ చేయాలని కోరుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టుకు ఈ సంవత్సరం రూ.1500 కోట్లు బడ్జెట్ కేటాయిస్తామన్నారు, కానీ రూ.334 కోట్లు కేటాయించారు. ఆ జిల్లాలో తీవ్రమైన ఆందోళన కూడా జరుగుతోంది. కాబట్టి వెంటనే రివైజ్ చేయాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా, మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, రాష్ట్రంలో 2218 ప్రైవేటు కార్పొరేట్ జూనియర్ కళాశాలలున్నాయి. ఈరోజు ఈనాడు దినపత్రికలో 'కార్పొరేట్ కరాళ నృత్యం' అనే శీర్షికతో ఒక వార్త ప్రచురించారు. కార్పొరేట్ జూనియర్ కళాశాల ఫీజులను విపరీతంగా పెంచుతున్నారు. అలాగే విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటుంటే ఒక టాస్క్‌ఫోర్స్‌ను నియమించారు. జి.ఓ నెంబర్.1 ప్రకారంగా కళాశాలలు వసూలు చేస్తున్న ఫీజులలో 50% అందులో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాలకు, 40% మౌలిక వసతులకు ఉపయోగించాలి. మిగిలిన 10% మాత్రమే పాఠశాల యాజమాన్యం తీసుకోవాలి. కానీ అంతులేకుండా పోతోంది. కాబట్టి ఫీజుల పెంపుదలకు సంబంధించి కూడా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి నియంత్రించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా, మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు:** అధ్యక్షా, విజయనగరం జిల్లా, విజయనగరం మండలంలోని అయ్యన్నపేట గ్రామంలో మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల 120 మంది విద్యార్థులతో నడుస్తోంది. అయితే ఆ పాఠశాల భవనం ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితుల్లోకి వచ్చింది. అధికారులు తక్షణమే స్పందించి, ఆ పాఠశాలను వేరే ప్రదేశానికి షిఫ్ట్ చేసి, ఆ పాఠశాల భవనాన్ని పునఃనిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా, మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

## 3.సభా కార్యక్రమం – ప్రకటనలు

CHAIRMAN: Now, I have to make the announcements.

1. I am to announce to the House that the representatives of UNICEF will conduct a Sensitization Programme to the Members of the Assembly and Council on “Status of Children in the Era of Sustainable Development Goals in Andhra Pradesh” in the Committee Hall of Assembly Buildings at 3:00 P.M on Tuesday the 20th March, 2018. All the Members are, therefore, requested to participate in the Programme.
2. I am to Announce to the House that the UNICEF is organising a learning trip/ study tour to the Members of Assembly and Council, to the States of Hariyana and Himachal Pradesh from 9th to 12th April, 2018 to study the various schemes on “Child and Maternal Health” in those states. The Members those who are interested to participate in the learning trip/study tour are requested to fill the option form available with the Secretary (I/C).
3. I am to Announce to the House that the Sports and Cultural Programme is being conducted on 25th and 26th March, 2018 for the Members of the Assembly and Council. The Members those who are interested to participate in the Sports and Cultural Programmes, are requested to fill the option form available with the Secretary (I/C).

Now, Tea break for 15 minutes.

(The House then adjourned at 11.19 a.m.)

ఉ. 11.40

(తేనీటి విరామానంతరం సభ ఉదయం గం.11.40 ని. లకు పునఃప్రారంభమయింది)

(గౌరవ ఉపాధ్యక్షులు అధ్యక్ష స్థానం వహించారు.)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్** : కంతేటి సత్యనారాయణ రాజు గారు, గవర్నర్ స్పీచ్ మీద మాట్లాడవలసింది.

## 4.గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ – కొనసాగింపు

**శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు:** అధ్యక్షా, గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఇవాళ గ్రోత్ రేటు చూసినట్లైతే దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో కనిపిస్తోంది. అలాగే పారిశ్రామికవేత్తల సమ్మిట్‌లో లక్షలాది ఉద్యోగాలు, కోట్లాది రూపాయల యం.ఓ.యు. లు కుదుర్చుకోవడం జరిగింది. రాష్ట్రం ఇంత బలంగా ఉంటే మీరేంటయ్యా బాబూ దిల్లీ వచ్చి అదడుగుతారు, ఇదడుగుతారు అని వ్యంగ్యాస్త్రాలు కూడా కొంతమంది వేస్తున్నారు. ఇంత గ్రోత్ రావడానికి కారణం ఫిష్‌కల్చర్, అగ్రికల్చర్. ఈ ఫిష్‌కల్చర్ ద్వారా రూ. 43, వేల కోట్లు సేల్స్ జరిగాయి. అయితే, దాని వెనకాల రైతుకు కష్టం ఎంత ఉన్నదో ఎవరూ అర్థం చేసుకోవడంలేదు. ఎందుచేతనంటే, రొయ్యల పెంపకంలో నూటికి 25 శాతమే సఫలమవుతుంది, మిగతా 75 శాతం నష్టపోవడం జరుగుతుంది. రొయ్యల పెంపకం ద్వారా మనకు ఎంత ఆదాయం వస్తుందో అంతే మొత్తం ఆదాయం రైతులు కోల్పోవడం కూడా జరుగుతుంది.

అగ్రికల్చర్ విషయంలో కూడా ఇవాళ పశ్చిమ గోదావరి జిల్లాలో రైతులు నీళ్లకోసం చాలా ఇబ్బంది పడుతున్నారు. రెండవ పంటకు నీళ్లు అందుతాయా లేదా అని రైతులు ఎంతో ఆందోళన చెందుతున్నారు. అక్కడ సి.ఆర్.యం.జి నీళ్లుగానీ, గోదావరి ప్రవాహంగానీ తగ్గి పోవడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనిని వెంటనే పరిష్కరించకపోతే మన రైతులు కోపోద్రిక్తులై ఏం చేస్తారో చెప్పలేని పరిస్థితి మనకు వస్తుంది. అగ్రికల్చరల్ గ్రోత్ ఇంత చూపిస్తున్నా ఇది ప్రపంచ దేశాలలో సగటున కూడా లేదు. వారితో పోల్చి చూస్తే రెండు మూడు రెట్లు మనం తక్కువగా ఉన్నాం. మనకు సారవంతమైన భూములు, వనరులు అన్నీ ఉన్నా కూడా మన ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. కారణం ఏమిటంటే, సరైన వ్యవసాయ విధానాన్ని మనం అనుసరించకపోవడమే. ఫీల్డ్ ఆఫీసర్స్‌ను తెప్పించి లేదా నిపుణులకు చూపించి ఏరకంగా చేస్తే బాగుంటుందో అని మన రైతన్నలకు చూపించాలి. పంటలు చాలా తక్కువగా పండుతున్నాయి. ఎప్పుడూ 40 బస్తాలు 45 బస్తాలే పండుతున్నాయి. సాళువా ఆదాయం దాళవకి, దాళవా ఆదాయం సాళువకి తప్ప ఎప్పుడూ ఒక్క రూపాయి కూడా మిగుల్చుకొని రైతులు బాగుపడ్డ సందర్భం లేదు. కొల్లేరు ప్రాంతంలో మీరు చూసినట్లైతే అధ్యక్షా, పది వేల ఎకరాలు దుర్మార్గంగా కొట్టేశారు. అవి అన్నీ కూడా పట్టా పొలాలు. నేను ఈ విషయంలో అనేక సందర్భాల్లో మాట్లాడాను. అక్కడ వైల్డ్ లైఫ్ సాంక్చురీ ఏర్పాటు చేసినట్లైతే ఆయిల్ ఇంజన్ ఆడించడానికి కూడా ఉండదు. కనీసం దానిమీద సోలార్ అయినా అనుమతించడని ముఖ్యమంత్రి గారికి, సంబంధిత మంత్రి గారికి రిప్రజంటేషన్ ఇస్తే దానిని పక్కన పెట్టారు. 1999లో అనాలోచితంగా వైల్డ్ లైఫ్ సాంక్చురీ ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు రెండుసార్లు తీర్మానం చేసినా కూడా కేంద్ర ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉంది. దాని గురించి పెద్దగా పట్టించుకోవడంలేదు. దానివలన ఎంత మంది నష్టపోయారంటే–ఎంతోమంది ఆకలితో చచ్చారు. అక్కడ రైతులు వ్యవసాయం చేద్దామంటే, ఇంజను ఆడిద్దామంటే ఫారెస్టు వాళ్లు వచ్చి అరెస్టు చేస్తారు, నామ్‌కే వాస్తే కేసులు పెడతారు, డబ్బులు గుంజుకుంటారు. ఈ లంచం ఎలా ఉందంటే ప్రతి దానికి రేటు నిర్ణయించి, చేపల చెరువు తవ్వితే రూ.13,000/– ఇవ్వాలి, ఒక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకుంటే రూ.50,000/– ఎలక్ట్రిసిటీ

డిపార్టుమెంటుకివ్వాలి, రూ.1.00 లక్ష ట్రాన్స్‌ఫార్మర్‌కు అవుతుందని చెప్పి నానా రకాలుగా రైతులు ఇక్కట్లు పడుతుంటే వాళ్ల గురించి ఆలోచించడంలేదు. ఎలా? మరి దీని గురించి ఏంచేయాలి? ప్రభుత్వం ఏం చేయకపోతే రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కూడా వస్తోంది. ఇప్పుడే మా జిల్లా మంత్రి గారిని కూడా అడిగాను. ఏదో రేపటి నుంచి నీళ్లొచ్చేస్తాయని చెప్పారు, వస్తే సంతోషమే. నీళ్లు వచ్చి పంటలు కాపాడుకుంటే మంచి జరుగుతుంది. ఎందుకంటే–అక్కడ మిగిలేది దాళువ పంటే. దానికి కూడా నీళ్లు రాకపోతే ఎంతో ఇబ్బంది ఉంటుంది. ఇప్పుడు తెలుగుదేశం గవర్నమెంటు వచ్చే నాటికి 17.6 శాతం మైనస్ పవర్ షార్టేజి ఉంది. దానిని కవర్ చేస్తూ విద్యుత్‌ను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సంగతి చాలా మందికి తెలియదు కానీ వీళ్లకి గొప్ప మైలేజి వచ్చింది. ఎందుకంటే గతంలో కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియదు, కరెంటు రాకడ ప్రాణం పోకడ కూడా తెలియని పరిస్థితులు కూడా మన రాష్ట్రంలో చూశాం. కానీ ఇప్పుడు గొప్ప మైలేజి రావడానికి కారణం కేంద్ర ప్రభుత్వం అన్న సంగతి చాలా మందికి తెలియదు. అందువలన ఉపయోగమేమిటి? కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి తప్ప, ఏం చేయలేదో దానిమీద ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. అది చాలా అన్యాయం. ఇప్పుడు బి.జె.పి. రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు గారు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఏమి ఇచ్చిందో ఒక బుక్‌లెట్ ద్వారా ప్రజెంట్ చేశారు. ఆయన నీతి, నిజాయితీకి మారు పేరు. నిబద్ధత గల వ్యక్తి. ఆయనిచ్చిన దాంట్లో అవాస్తవాలేమీ ఉండవు. మమ్మల్ని కూడా ముఖ్యమంత్రి గారు దిల్లీ వెళ్లమని చెప్పారు. మేమంతా వెళ్లాం. వెంకయ్య నాయుడు గారే పిలిచి ఆయన ఆఫీసులో కూడా కొంత మందితో మాట్లాడాం, జైట్లీ గారితో మాట్లాడాం, సురేష్ ప్రభు గారితో మాట్లాడాం, అందరితో మాట్లాడాం. అందరూ రాష్ట్రానికి సహాయం చేయడానికి సుముఖంగానే ఉన్నారు. కానీ ఎక్కడో లెక్కల్లో కొంత తేడా ఉంది కాబట్టి కొంత సార్టవుట్ చేసుకోవాలి తప్ప ప్రభుత్వం మద్దతు విరమించుకొని మంత్రులు రాజీనామాలు చేస్తే, అది చాలా అన్యాయం. ఇద్దరూ నష్టపోతారు. ఎందుచేతనంటే, ఎప్పుడు టి.డి.పి. అధికారంలోకి వచ్చినా కూడా బి.జె.పి. సపోర్టు వల్లే వచ్చింది. ఆ సపోర్టు విత్‌డ్రా చేసుకుంటే, రేప్పొద్దున రాజకీయ పరిశీలకులు ఏమంటారంటే–ఎన్డీఏలో ఉన్నారు తప్ప ఎక్కువ రోజులు ఉండరనే అనుమానం వస్తోంది. కానీ ఒకటి గెలిచే పార్టీ, ఒకటి ఓడిపోయే పార్టీ. కానీ బి.జె.పి. పార్టీ మాత్రం గెలిపించడానికో ఓడించడానికో తప్పని సరిగా ఉపయోగపడుతుంది. ఇప్పుడు ప్రత్యేక హోదా కావాలంటున్నారు. ప్యాకేజీ విషయానికి వస్తే బ్రహ్మాండమైన ప్యాకేజీ ఇచ్చారని ఆరోజున ఊరేగింపులు జరిపారు. వెంకయ్యనాయుడు గారు కూడా ఇంత పెద్ద ఊరేగింపును నేను కనీ వినీ చూడనట్లుగా చేశారని ఎంతో ఆనంద పడ్డారు. ఏమన్నా లోపాలు ఉంటే సరిచేసుకోవాలి తప్ప విడాకులు తీసుకునే పరిస్థితి వరకూ రాకూడదు. ఇది ఇద్దరికీ కూడా మంచిది కాదు. హరిబాబుగారు ఏదైతే చెప్పారో అవన్నీ కూడా వాస్తవాలు. ఇంకా చేయవలసినవి కూడా ఉన్నాయి. మేమందరం కూడా చెప్పాం. వారు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కొంచెం లెక్కల్లో తేడా ఉందని చెప్పారు తప్ప, ప్రతి ఒక్కరు కూడా ఇవాళ పోలవరం ప్రాజెక్టు పూర్తికావాలని నూటికి నూరు పాళ్లు కోరుకుంటున్నారు. నిన్న మీటింగులో కూడా అందరూ పోలవరం కావాలి, పోలవరం కావాలి అన్నారు. నేను ముఖ్యమంత్రి గారికి చెప్పాను. ఆరోజు జిల్లా మంత్రిగా అంజయ్య గారు, నేను శంకుస్థాపన చేశాం, దానిమీద మనందరికీ ఇంట్రెస్టు ఉంది. పోలవరం ప్రాజెక్టు

కడితే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకి, వైజాగ్ వరకు నీళ్లు అందుతాయి. పోలవరం తయారైతే కృష్ణా, గుంటూరు జిల్లాలు కూడా బాగుపడతాయి. తప్పనిసరిగా అన్ని విషయాలలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహాయపడుతుంది. రాష్ట్ర అభివృద్ధికి అందరూ కట్టుబడి ఉండాలని నేను ఈ సందర్భంగా కోరుకుంటున్నాను. తగాదాలు వద్దు, పరిష్కారం చేసుకోమని కోరుతున్నాను.

ఉ.11.50

**మిస్టర్ డిప్యూటి చైర్మన్:** సోము వీర్రాజు గారూ, 15నిమిషాలు మాట్లాడండి.

**శ్రీ సోము వీర్రాజు:** మీ ఇష్టం, మీ దయ అధ్యక్షా, అధికార పార్టీవారు ఆరోపణలు చేస్తూ మూడు గంటలు మాట్లాడుతున్నారు, మాకు 15 నిమిషాలు లేదా 10 నిమిషాలు ఇస్తున్నారు.

**మిస్టర్ డిప్యూటి చైర్మన్:** మాధవ్ గారు 20 నిమిషాలు మాట్లాడారు, సత్యనారాయణ రాజుగారు 7 నిమిషాలు మాట్లాడారు.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, ఆనాడు బిల్లులో పెట్టింది, ఈ రాష్ట్రానికి ఏం అవసరమని ప్రస్తావించింది, ఈ రాష్ట్రంలో ఉద్యమం జరుగుతున్నదని భారతీయ జనతా పార్టీ నాయకుడైన ఈనాటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారు చెప్పారు. రెవెన్యూ లోటు గురించి బిల్లులో లేదు. వెంకయ్యనాయుడు గారు మాట్లాడినదాని మూలంగా రెవెన్యూ లోటు భర్తీకి నిధులు వచ్చాయి. ప్రత్యేక హోదా పది సంవత్సరాలు అడిగితే కాంగ్రెస్ వాళ్లు ఐదు సంవత్సరాలే అంగీకరించారు. కాని భాజాపా సభలో గట్టిగా అడిగితే ఈ బిల్లుకు 2022 వరకూ సమయం ఇచ్చారు. రెవెన్యూ లోటు గురించి మాట్లాడినా, పోలవరం ముంపు మండలాల గురించి మాట్లాడినా, ప్రత్యేక హోదా గురించి, ఈ రాష్ట్రం గురించి ఏది మాట్లాడినా భారతీయ జనతాపార్టీయే మాట్లాడింది. ప్రజల గురించి ఆలోచించిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే. రాష్ట్ర విభజన సమయానికి ముందు ఆంధ్ర రాష్ట్రంలో మాకు ఒక్క శాసనసభ్యుడు కూడా లేడు. రాష్ట్ర విభజనకు నేను సుముఖంగా ఉన్నానని ముఖ్యమంత్రిగారు ఒక లేఖ ఇచ్చారు. ఒక్క సిపిఎం పార్టీ తప్ప రాష్ట్ర విభజనను అందరూ కోరుకున్నారు. ముఖ్యమంత్రిగారు కూడా 2008లోనే రాష్ట్ర విభజన చేయమని లెటర్ ఇచ్చారు. నేను అడిగిన, చెప్పిన విషయాన్ని ఏదైనా సరే....

(ఆ సందర్భంలో శ్రీ వై.వి.బి రాజేంద్రప్రసాద్, శ్రీ అంగర రామ్మోహన్ గార్లు తమ స్థానాల్లో లేచి నిలబడ్డారు)

**శ్రీ వై.వి.బి రాజేంద్రప్రసాద్(స్థానిక సంస్థలు – కృష్ణా):** (మైకు లేకుండా) అధ్యక్షా, సమ న్యాయం చేయమని అడిగాము.

**శ్రీ సోము వీర్రాజు:** రాజేంద్రప్రసాద్ గారూ.., మాట్లాడడానికి మీకు సమయం ఇస్తారు, ఇచ్చినప్పుడు మాట్లాడండి. మీరు సమన్యాయమే చేయమని అడిగారు. మరే విషయాన్ని కూడా మాట్లాడలేదని చెబుతున్నాను.

మా వెంకయ్యనాయుడు గారు మాట్లాడిన ముంపు మండలాల గురించి మీరు మాట్లాడారా? ప్రత్యేక హోదా గురించి, రెవెన్యూలోటు గురించి మాట్లాడారా? ఏ విషయాన్ని గురించి ప్రస్తావించారో చెప్పండి. తెలుగుదేశానికి సమన్యాయం చేయమని కోరారు. మేము ఇక్కడొక మాట, అక్కడొక మాట మాట్లాడలేదు. తెలంగాణా వెళ్లి మా మూలంగానే తెలంగాణా వచ్చిందని గాని, ఆంధ్రప్రదేశ్ వచ్చి సమైక్య ఉద్యమం చేయమని గాని, మేము డబుల్ స్టాండ్‌లు ఎక్కడా మెయిన్‌టైన్ చేయలేదు. ఇక్కడున్న మిత్రులందరూ కూడా విభజించమని లేఖలు ఇచ్చి, సమైక్యవాదం గురించి ఉద్యమం చేశారు. కాని విడిపోతే ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలనే వాస్తవాలే మాట్లాడాము. అక్కడ మాకు ఒక్క శాసనసభ సభ్యుడు కూడా లేని పరిస్థితి ఉంటే తెలుగుదేశం పార్టీకి 90 మంది శాసనసభ సభ్యులున్నారు. 90మంది శాసనసభ సభ్యులు ఉంటే ఇవన్నీ అడిగింది మాత్రం భారతీయ జనతాపార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు వెంకయ్యనాయుడు గారు మాత్రమే. ఈరోజు పోలవరం ముందుకు వెళుతోంది అంటే కారణం వెంకయ్యనాయుడు గారు. కాంగ్రెస్‌వారు ఈరోజు సభలో లేరు. పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలను తెలంగాణా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించడానికి పెట్టి పార్లమెంట్‌లో బిల్ పాస్ చేయిస్తే మేము రాజ్యసభలో ముంపు మండలాలను నూతన ఆంధ్రప్రదేశ్‌లో ఉండేటట్లు ఇన్‌క్లూడ్ చేయించి తర్వాత ఆర్డినెన్స్ జారీ చేయించాము. మా మిత్రపక్షాలకు 2019వ సంవత్సరంతో సమయమైపోతోంది. 40 సంవత్సరాల అనుభవం ఉన్న ముఖ్యమంత్రి వారి పాదయాత్ర సమయంలో 1200 వాగ్దానాలు చేశారు. ఆ వివరాలు నాదగ్గర ఉన్నాయి. మా ఉభయ పక్షాలకు 2019వ సంవత్సరంతో సమయం ముగుస్తుంది. కాని మాకు 2022 వరకూ సమయం ఉంది. ఈ ప్రత్యేక హోదాను 2015వ సంవత్సరం నుండే మొదలు పెట్టారు. కానీ మన ప్రియతమ సుజనా చౌదరి గారు 'కేంద్రం అన్నీ ఇచ్చింది – ఇంతకంటే మేము ఏమీ అడగలేము' అన్నారు. ఈ అంశము ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చింది అధ్యక్షా. (ఆంధ్రజ్యోతి దినపత్రిక సభలో చూపిస్తూ) ముఖ్యమంత్రిగారు హోదాతో ఒరిగేది ఏమీ లేదు అన్న అంశము (ఆంధ్రభూమి దినపత్రిక సభలో చూపిస్తూ) ఆంధ్రభూమి దినపత్రికలో వచ్చింది. ప్రత్యేకహోదాతో వచ్చేది రూ.3,000 కోట్లు మాత్రమే అని, రాకపోతే నష్టమేమీ లేదని టిడిఎల్‌పి మీటింగ్‌లో ముఖ్యమంత్రిగారు అన్నారు.

(అంతరాయం)

**శ్రీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్:**(మైక్ లేకుండా) అధ్యక్షా, వాస్తవాలు మాట్లాడమనండి, ఆరోపణలు చేయకండని చెప్పండి.

(అంతరాయం)

**శ్రీ సోము వీర్రాజు:** దయచేసి నాకు సమయం ఇచ్చారు, మీరు దయచేసి ప్రశాంతంగా వినండి. ఇవి ఆరోపణలు కావు, వాస్తవాలు. వినండి.

(అంతరాయం)

**డా. పి. నారాయణ:** అధ్యక్షా, ప్రత్యేక హోదాతో సమానంగా అవన్నీ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తే ముఖ్యమంత్రిగారు పేరు ఏదైనా ఫరవాలేదు, మాకు అవన్నీ కావాలని ఒప్పుకున్నారు. ఆ విషయమే చెప్పారు. అయితే గౌరవ సభ్యులు చెప్పే అంశాలు సక్రమంగా చెబితే బాగుంటుంది.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, నేను సక్రమంగానే చెబుతున్నాను. మీరు అన్నదే చెబుతున్నాను. నేను ఏదీ కూడా విభేదించి చెప్పడం లేదు. మనమే ఎక్కువ సాధించాము, ఏ రాష్ట్రానికైనా ఇంతకంటే ఎక్కువ నిధులు వచ్చాయా, ఆధారాలుంటే చూపండని ముఖ్యమంత్రిగారు అన్న మాటలు పత్రికలలో వచ్చాయి. నేను మిత్రపక్షంలో ఉన్న మూలంగా నా బాధ్యతగా ఈ అంశాలను ప్రస్తావిస్తున్నాను. మిమ్మల్ని ఎవరినీ విమర్శించాల్సిన అవసరం లేదు. ఈరోజుకు కూడా మనం ఎన్డీఏలోనే కలిసే ఉన్నాము. ఏదైనా ఉంటే సర్దుకోమని మా పెద్దలు చెప్పారు.

అయితే ముఖ్యమంత్రిగారు 28 సార్లు దిల్లీ వెళ్లారు. 1932వ సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు, 1951వ సంవత్సరంలో మా పార్టీని ప్రారంభించాము, కమ్యూనిస్టుల 150 రోజుల చరిత్రను ప్రస్తావించినట్లయితే ఇళ్ల స్థలాల కోసం రెండు లక్షల సార్లు ఉద్యమాలు చేసి ఉంటారు. 1942వ సంవత్సరం నుండి పోలవరం సమస్య ఉన్నది, దానికోసం ఎంతమంది పాదయాత్రలు చేశారండీ? ఎన్ని రాజకీయ పార్టీలు పాదయాత్రలు చేశాయి? మా వట్టి వీరభద్రరావు ఢిల్లీ వరకు పాదయాత్ర చేశారు. అలాగే నారాయణ స్వామిగారు, పి.వి. చలపతిరావు గారు, కమ్యూనిస్టులు వీరందరూ పోలవరం గురించి ఉద్యమాలు చేశారు. 28 సార్లు కాదు, కొన్ని లక్షల రోజులు ప్రజా జీవితంలో ఉద్యమాలు చేసి ప్రజల కోసం మనం చేయవలసిన బాధ్యతను రాజకీయ పార్టీలు తీసుకున్నాయి. మనం అందుకే ఉన్నాము. కాని ఎవరూ చెప్పుకోవడానికి అవకాశం లేని పరిస్థితులున్నాయి. లంకా దినకర్‌గారు తెలుగుదేశం పార్టీ అఫిషియల్ స్పోక్స్ పర్సన్, వారు సి.ఎ. చేశారు. ఇప్పుడు కుటుంబరావుగారి తరవాత వాస్తవానికి గణితాన్ని చెప్పిన పెద్దలు. నేను అన్నీ చెప్పను అధ్యక్షా, కొన్నే చెబుతాను, ప్యాకేజీతోనే ప్రగతి అని, మా హరిబాబుగారు అంటే తప్పు పట్టారు అధ్యక్షా. వారేమన్నారంటే విభజన చట్టంలో లేకున్నా, హామీ లేకున్నా, రాష్ట్రప్రభుత్వ కృషితో కేంద్రప్రభుత్వం నుండి సాధించుకున్న కొన్ని మౌలిక సదుపాయాలు కృష్ణపట్నం నుండి చెన్నై బెంగళూర్ కారిడార్ అనుసంధానం కోసం రూ.7,000 కోట్లు, హెలికాప్టర్ ఇంటిగ్రేషన్ ప్రాజెక్ట్ బెడ్ కోసం రూ.6,000 కోట్లు అనంతపురం లేపాక్షి, ఈవిధంగా రూ.50,000 కోట్ల ప్రాజెక్టులు సాధించామని దినకర్‌గారు రాశారు.

మ.12.00

అధ్యక్షా, ప్రత్యేకహోదా ఎందుకు రాదో అనే వివరణ కూడా ఇందులోనే ఇచ్చారు. అవన్నీ చదివితే సభ్యులకే బాధ కలుగుతుంది. చదవడం కోసం నేను ప్రయత్నం చేయను. ఈ పత్రాన్ని సభ్యులు చదివితే చాలు, వారు ఏం చెప్పారో వీరికి అర్థం అవుతుంది.

**శ్రీ అంగర రామమోహన్(స్థానిక సంస్థలు – పశ్చిమ గోదావరి):** అవన్నీ మాకు కూడా తెలుసు.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, నేను ఇంకా ఎక్కువ సమయం తీసుకోను. నాకు ఆ అవసరం కూడా లేదు. వారినే (అధికార పార్టీవారిని) ఆత్మపరిశీలన చేసుకోమనండి. ఎక్కువ ఎందుకు చదవాలి నేను? నా మిత్రులు ఇవన్నీ మేమే సాధించామని చెబితే, నా మిత్రుడు శ్రీ పి.వి.ఎన్.మాధవ్ చాలా విషయాలు చదవబోతే అధికార పార్టీ వారు వారిని ఇబ్బంది పెట్టారు. కానీ నేను వారు రాసినవే చెబుతున్నాను. 22వ తేదీ వరకు ఈ దేశ ప్రధానమంత్రి, ఒక బీసీ ప్రధానమంత్రి మేము ఎవరం మాట్లాడినా, సభలో అర్థం చేసుకుంటే, ముఖ్యమంత్రిగారిని మాపార్టీ శాసనసభ్యులు ఎంతో అద్భుతంగా పొగిడితే, మేమందరం ముఖ్యమంత్రిగారి గురించి గౌరవంగా మాట్లాడితే, ఒక ***** కులానికి, గాండ్ల కులానికి చెందిన, గానుగ నుండి నూనె తీసుకునే కులం నుండి వచ్చిన ఒక దేశ ప్రధానమంత్రిని విశాఖపట్టణంలో మిత్రపక్షం శాసనసభ్యులు ఆయన చిత్రాలు వంగించి గుద్దేటువంటి పరిస్థితిని తీసుకువస్తారా? అధ్యక్షా, మీరే ఆలోచించండి. మేమెప్పుడైనా ముఖ్యమంత్రిగారి గురించి వ్యతిరేకంగా మాట్లాడామా అధ్యక్షా.

(సభ్యులు సర్వశ్రీ గౌనివారి శ్రీనివాసులు, అంగర రామమోహన్ , డొక్కా మాణిక్య వరప్రసాద్ గార్ల నుండి అంతరాయం.)

(సభ్యులు శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మరియు డా.ఏ.ఎస్. రామకృష్ణ గారు వారి వారి స్థానాలలో లేచి నిలబడ్డారు.)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మీకు అవకాశం ఇస్తాము, కూర్చోండి.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, మీరు ఎంత సమయం మాట్లాడమంటే, అంతవరకు మాట్లాడి, ఎప్పుడు బెల్లు కొడితే అప్పుడు ఆపేస్తాను. నాకేమీ అభ్యంతరం లేదు. మీకు ఇష్టం లేకపోతే నేను ఈ సభలో మాట్లాడను.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ, మీరు మాట్లాడండి.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, ఒక పేద వ్యక్తి, ప్రధానమంత్రి అయిన శ్రీ నరేంద్రమోదీ గారిని ఈ రాష్ట్ర ప్రభుత్వం శంకుస్థాపన చేయడం కోసం రాష్ట్రానికి పిలిచారు.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు:** అధ్యక్షా, ఇక్కడ ఒక ...

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** శ్రీనివాసులు గారు మీకు టైం ఇస్తాను, అప్పుడు మాట్లాడండి.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు:** అధ్యక్షా, ఇక్కడ ఒక్క విషయం. సోము వీర్రాజుగారు ***** కులం అన్నారు. ఒక కులాన్ని ***** కులం అన్నారు.

(అంతరాయం)

*****Unparliamentary word expunged from records as ordered by the Chair, vide C.No.85/Council-Reporting/2018, Dt.19-07-2018.

(సభ్యులు సర్వశ్రీ అంగర రామమోహన్, గౌనివారి శ్రీనివాసులు, డొక్కా మాణిక్య వరప్రసాద్, బి.ఎన్.రాజసింహులు, వై.వి.బి. రాజేంద్రప్రసాద్ వారి వారి స్థానాలలో లేచి నిలబడ్డారు.)

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు:** అధ్యక్షా, బీసీలను కించపరుస్తున్నారండి ఆయన. ఆ వాక్యాన్ని రికార్డు నుండి తొలగించాలి.

**శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, వీర్రాజు గారు వెనుకబడిన కులాలను కించపరుస్తున్నారు.

**శ్రీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు:** వారు బీసీలను కించపరుస్తున్నారు అధ్యక్షా.

(సర్వశ్రీ అంగర రామమోహన్, గౌనివారి శ్రీనివాసులు, డొక్కా మాణిక్య వరప్రసాద్, బి.ఎన్.రాజసింహులు, వై.వి.బి. రాజేంద్రప్రసాద్, కంతేటి సత్యనారాయణరాజు తమతమ స్థానాలలో నిలబడి రికార్డు నుండి తొలగించాలి, లేకపోతే ఒప్పుకోం అని అన్నారు.)

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, అలాగైతే రికార్డు నుండి తొలగించండి.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ, ***** అని ఒక అన్‌పార్లమెంటరీ వర్డ్ మీరు మాట్లాడారు. ఆ పదాన్ని విత్‌డ్రా చేసుకోండి.

(అంతరాయం)

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, విత్‌డ్రా చేసుకోవడానికి, నాకేమీ అభ్యంతరం లేదు. నేను విత్‌డ్రా చేసుకుంటున్నాను.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** కూర్చోండి.

**శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, మేము ప్రధానమంత్రి గారిని గౌరవిస్తున్నాము. ఆయనేమో ***** కులం అంటున్నారు. మేము ప్రధానమంత్రిగారికి గౌరవం ఇస్తున్నాము. ఆ పదాన్ని విత్‌డ్రా చేసుకోమని చెప్పండి.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారు, ఆ పదాన్ని విత్‌డ్రా చేసుకున్నారు కాబట్టి, మేము రికార్డు నుండి తొలగిస్తున్నాము. మీరు ఒక నిమిషం కూర్చోండి వీర్రాజు గారు. మాణిక్య వరప్రసాద్ గారూ, మీరు మాట్లాడండి.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు ఆయన పార్టీని, ఆయన విధానాలను డిఫెండ్ చేసుకోవడం కోసం ఆవేశంగా మాట్లాడుతున్నారు. ఎమోషనలైజ్ అవుతున్నారు. ఆ ఎమోషన్‌లో

*****Unparliamentary word expunged from records as ordered by the Chair, vide C.No.85/Council-Reporting/2018, Dt.19-07-2018.

ఆయన లాంగ్వేజ్ కొంచెం డిఫరెంట్‌గా వస్తోంది. కాబట్టి ఆయన ఇందాక మాట్లాడిన మాటలను విత్‌డ్రా చేసుకోవాలి. ప్రధానమంత్రి గురించి గొప్పగా చెప్పొచ్చు. ప్రజాస్వామ్యంలో ఎంత తక్కువ వాడైనా, ఏ హోదాకైనా ఎన్నిక అవ్వచ్చు. ఈరోజు మాకున్న రాజ్యసభ సభ్యుల్లో కనకమేడల రవీంద్ర కుమార్ అనే ఒక అడ్వకేట్ ఎంపిక కాబడ్డారు. ఆయనకు ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేదు. ఓన్లీ లీగల్ ప్రొఫెషన్. ఎలాంటి ఫైనాన్షియల్ బ్యాక్ గ్రౌండ్ లేదు. ప్యూర్లీ ప్రొఫెషనల్ అడ్వకేటు. పార్టీలో కమిట్‌మెంట్‌తో పనిచేశాడని రాజ్యసభ సీటు ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో అలాంటివి జరుగుతూ ఉంటాయి. ప్రజలు ఎలక్ట్ అవుతూ ఉంటారు. వివిధ హోదాలకు వెళ్తుంటారు. కులాన్ని ప్రస్తావించినపుడు కులం చెప్పొచ్చు. Constitution is allowed that caste. కానీ, దానికి ***** అనే పదాన్ని యాడ్ చేయడం, నేను వారిని ఏమీ అనడం లేదు. బహుశా వారు ఎమోషన్‌లో అలా మాట్లాడి ఉండవచ్చు. దయచేసి వారిని ఎమోషనలైజ్ అవ్వద్దని చెప్పండి. వారి పార్టీని వారు కూల్‌గా డిఫెండ్ చేసుకోనివ్వండి. మేము దానికి సమాధానం చెబుతాము. మా దగ్గర అన్ని విషయాలు ఉన్నాయి. ప్రశాంతంగా మాట్లాడమని వారికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఆ లాంగ్వేజ్ కూడా వారు విత్‌డ్రా చేసుకోవాలి.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** చెప్పాము, వారు విత్‌డ్రా చేసుకున్నారు. రికార్డు నుండి కూడా తీసేయమన్నాం.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, మణి శంకర్ అయ్యర్ అనే ఒక కాంగ్రెస్ పక్షనేత మొన్న గుజరాత్ ఎన్నికల సందర్భంగా ప్రస్తావించినటువంటి మాట బూమరాంగ్ అయ్యింది. అధ్యక్షుల వారు, పెద్దలు చెప్పారు కాబట్టి, నేను ఆ మాటని వినియోగించను. మనం ఆలోచించాలి. ప్రధానమంత్రిగారిని ఈ రాష్ట్రానికి సాదరంగా ఆహ్వానించాము. మన ముఖ్యమంత్రిగారు భారతదేశంలో ఉన్న అన్ని నదుల నుంచి కూడా పవిత్ర జలాలను రప్పించారు. అలానే మట్టిని కూడా తెప్పించారు. ప్రధానమంత్రి గారు కూడా వారితో కనెక్ట్ అయ్యి, నర్మదా నది నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. వారు ఇంకా విమానం దిగకుండానే రెండు లక్షల కోట్ల రూపాయలు ఇస్తామని వారు ప్రకటించినట్లు ఛానల్స్‌లో స్క్రోలింగ్ వచ్చింది. వారు ఎవరికీ చెప్పలేదు. ఈ రాష్ట్రానికి వారు ఏమీ హామీ ఇవ్వలేదు. కానీ, రెండు లక్షల కోట్లు ఇస్తామన్నారని ఈ ఛానల్స్ ప్రకటించాయి. ముఖ్యమంత్రిగారు పవిత్ర జలాలను వారి చేతిలో పెడితే, ఆ పవిత్ర జలాలకు ముఖ్యమంత్రిగారు స్పందించి ఆనంద భాష్పాలను రాల్చారని, పైన వేదిక మీద వారు చెప్పడం జరిగింది. వారిలా తిరగగానే వెంటనే చెంబు ఇచ్చారు, నీళ్లిచ్చారు. ఇవాల్టికి కూడా మా మిత్రపక్షం యొక్క అఫీషియల్ ఫేస్‌బుక్‌లో చెంబు, నీళ్లు అని పెడుతున్నారు. నా హృదయానికి బాధ కలగడం వల్ల నేను చెబుతున్నాను. అంటే మా ప్రధానమంత్రి ఇచ్చేది చెంబు నీళ్లా?

**శ్రీ అంగర రామమోహన్:** (మైక్ లేకుండా) మరి ఏమనాలో చెప్పండి

*****Unparliamentary word expunged from records as ordered by the Chair, vide C.No.85/Council-Reporting/2018, Dt.19-07-2018.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, ఇవన్నీ నేనెందుకు చెబుతున్నానంటే, పవిత్ర జలాలను చెంబు, నీళ్లతోనే ఎందుకు పోలుస్తున్నారనేదే నా ప్రశ్న. అర్థం చేసుకోండి. ఆ రోజు నుంచి ఈరోజు వరకు చెంబు, నీళ్లు గానే మిగిలి పోయింది. 22వ తేదీ దాకా సమయం ఉంటే ఈ రాష్ట్రంలో 17వ తేదీ నుండే ప్రత్యేక హోదా ఉద్యమం వచ్చింది. 40 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న రైల్వేజోన్‌కి సంబంధించి 22వ తేదీ దాకా సమయం ఉంటే 14వ తేదీ నుంచే ఉద్యమం మొదలైంది. 1942వ సంవత్సరంలో పోలవరం సెటిల్ అవుతుంటే, దాని గురించే చర్చ జరుగుతోంది. అంటే ఇవి ఎందుకు జరుగుతున్నాయనేది అధ్యక్షులవారు ఆలోచించాలి. ఏదైనా సమయం ఉన్నప్పటికి కూడా దానిని ఉద్యమ రూపంలోకి తీసుకువచ్చే పరిస్థితి ఈ రాష్ట్రంలో జరుగుతుంది. మేమే ఎక్కువ సాధించామని, ప్రత్యేక హోదా ఎందుకు రాదని అంటున్నారు. ప్రత్యేక హోదా గురించి 8 సందర్భాలలో మన ముఖ్యమంత్రిగారు ఏమి మాట్లాడారనేది వారి యొక్క వాయిస్‌తో ఈ మధ్య సోషల్ మీడియాలో వచ్చింది. ఇవన్నీ సాక్ష్యాలు కావా అధ్యక్షా. ఎందుకు మనం ఈ రాష్ట్ర ప్రజల్ని ఇందులో ఇన్వాల్వ్ చేయాలి. మేము ఇప్పటికి కూడా చెప్పేదేమంటే, మా వెంకయ్యనాయుడు గారు అడిగినటువంటి ప్రత్యేకహోదా గురించి ఆ వేళ పార్లమెంటులో మనం ఎవరూ మాట్లాడలేదు. వారు చెప్పిన విషయాలకు 2009వ సంవత్సరంతో టైమ్ అయిపోతే, 1200 వాగ్దానాలు చేస్తే, మన ఎన్నికల మేనిఫెస్టోలో మనం ఇవ్వడానికి 2019 తో టైమ్ అయిపోతే 2022 దాకా టైం ఉన్నటువంటి ప్రత్యేక హోదాకి గానీ, మరో అంశానికి గానీ, 2015 నుంచే ఈ రాష్ట్రంలో ఉద్యమాలు ఎందుకు జరుగుతున్నాయి.

అధ్యక్షా, కియా ఫ్యాక్టరీ గురించి మాట్లాడారు. ప్రధానమంత్రి బైలేటరల్ ప్రాజెక్టులో 6 ఒప్పందాలు చేశారు. (పేపర్‌ను సభ్యులకు, చైర్మన్‌కు చూపిస్తూ మాట్లాడారు.) ఇది దక్షిణ కొరియాతో, ఇది కియా. దీనిలో దక్షిణా కొరియా ప్రధానమంత్రి ఫొటో ఉంది. ఆరు బైలేటరల్ ప్రాజెక్టుల అగ్రిమెంట్‌లో ఈ రాష్ట్రానికి మద్రాసు నుంచి బెంగళూరు వెళ్లే కారిడార్‌ని కేంద్రం చేస్తే, ఆ కారిడార్‌లో అనంతపురం ఉంటే ఈ కియా ఫ్యాక్టరీ అక్కడికి వచ్చింది.

మ. 12.10

అధ్యక్షా, నేను ఇది గొప్ప కోసం చెప్పడం లేదు. ఇవి దేశంలో జరిగేటటువంటి ప్రగతి. మా పెద్దలు చెప్పారు. ఎన్నో లక్షల కోట్ల రూపాయలు ఈనాడు మన రాష్ట్రానికి పెట్టుబడుల క్రిందకు పలు కంపెనీలు వస్తున్నాయి. జీడీపి గ్రోత్ రేటు కేంద్రం కంటే మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంది. అసలు కేంద్రం గొప్పదా? రాష్ట్రం గొప్పదా? రెవెన్యూ లోటు కూడా తగ్గిపోయిందని, మిగిలిపోయిందని మన బడ్జెట్‌లో కూడా చూపించాము. ఇలాంటి సందర్భంలో ఈ దేశంలో నా ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఈ రాష్ట్రం ఇతర రాష్ట్రాలతో పోలిక కానే కాదు, ప్రపంచ దేశాలతో పోటీపడే రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఇక్కడ అంత మేధావులు, విజ్ఞానవంతులు, అంత సంపద, అన్ని వనరులు ఉన్నటువంటి మన రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలను సమీకరించుకుని మేధోసంపత్తిని ఈ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప చేసి, de-centralisation of the development చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి

చేయవలసినటువంటి బాధ్యత గౌరవ ఛైర్మన్‌తో బాటు ఇక్కడ ఉన్నటువంటి పెద్దలందరి మీద మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పైన కూడా ఉందనే విషయాన్ని తమ ద్వారా అందరికీ తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అదేవిధంగా ఈనాడు మన రాష్ట్రానికి ఇన్ని ప్రాజెక్టులు రావడానికి కేంద్రం ఎఫ్‌డిఐలో నిర్ణయమే. దీనిని మా కమ్యూనిస్టు మిత్రులు వ్యతిరేకిస్తారు. కానీ, ఈ రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందాలి. ఎఫ్‌డిఐలను వంద శాతం తీసుకువచ్చారు. గలగలమంటూ ఈనాడు మన రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. జీఎస్‌టీని తీసుకురావడమే కాకుండా, దేశం అంతా ఒకే పన్ను విధానాన్ని తీసుకువచ్చారు. మన రాష్ట్రానికి ప్రాజెక్టులు వస్తున్నాయి. మన భారతదేశంలో అనేక రకాలైన red tapism ఉండేది. ఈనాడు ఆ red tapism తగ్గిపోయింది. పరిశ్రమలకు సంబంధించి దాదాపుగా 430 వరకు అడ్డంకుల ఉండేవి. అవి అన్నీ తొలగించడం మూలంగా ఈనాడు అనేక రకాలుగా ఈ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి భారతదేశంలో తీసుకున్నటువంటి కొన్ని నిర్ణయాత్మకమైన కారణాల మూలంగా అంతా అభివృద్ధి చెందడం ఈ రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టం. దేశంలో అనేకమైన ఇతర రాష్ట్రాలలో కూడా పరిశ్రమలు వస్తున్నాయి. మన రాష్ట్రానికి కూడా వస్తున్నాయి. జీడీపి గ్రోత్ రేట్ పెరిగింది. 24x7 విద్యుత్తును కేవలం మూడు రాష్ట్రాలకే ఇచ్చారు. అందులో మన ఆంధ్ర రాష్ట్రం కూడా ఒకటి. గత సమావేశాలలో 24x7 మూలంగా రూ.5,000కోట్లు వచ్చాయని అధికారికంగా మాకు ఇచ్చిన నివేదికలలో ఉంది.

అధ్యక్షా, ఈరాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఉన్నాయి. సోలార్ పార్కులు వెనుకబడిన జిల్లాలలో ఉన్నాయి. ఎందుకో కొన్ని సందర్భాలలో... (బెల్ మోగింది). ఒక్క నిముషమే మాట్లాడి సెలవు తీసుకుంటాను, మీ ఇష్టం, నేను ఎక్కువ సమయం తీసుకోను అధ్యక్షా.

**మిస్టర్ ఛైర్మన్:** ఇప్పటికే 22 నిముషాలు అయింది.

**శ్రీ సోము వీర్రాజు:** ఇంకొక రెండు నిముషాల సమయం ఇస్తే నేను చెప్పదలచుకున్న విషయాలు చెప్పి ముగిస్తాను.

**మిస్టర్ ఛైర్మన్:** ఇంకొక మూడు నిముషాల సమయం తీసుకోండి.

**శ్రీ సోము వీర్రాజు:** ఓ.కే. థాంక్యూ సార్. అధ్యక్షా, రాయలసీమ జిల్లాలు వెనుక బడిన జిల్లాలు. మన రాష్ట్రంలో జరిగేటటువంటి ప్రగతిని చూస్తే, విశాఖపట్టణం టౌన్‌ని మనం పరిశీలించినట్లయితే – ఏదైతే ఫ్లీట్ జరిగిందో దానికి రూ.400కోట్లు ఇచ్చారు. ఇక్కడ దాదాపు రహదారులు, డ్రైనేజీల కోసం వెయ్యికోట్ల రూపాయల వరకు కేటాయించారు. ఈరోజున రెండు నగరాలలో కూడా 30:40 నిష్పత్తిలో ఆ పనులన్నీ జరుగుతున్నాయి. విశాఖపట్టణానికి హుద్–హుద్ తుపాను వచ్చింది. దాని తరువాత ఈనాడు విశాఖపట్టణంలో ఆ ప్రాంతాల దగ్గరకు వెళ్ళి నిలబడండి ఏ విధంగా అభివృద్ధి చెందిందో ఒకసారి చూడండి. రాష్ట్రం విడిపోయిన తరువాత ఈ రాష్ట్రం ఎంత త్వరగా అభివృద్ధి

చెందుతుందో చెప్పినటువంటి ఏకైక పార్టీ మా భారతీయ జనతా పార్టీనే. కలిసి ఉంటే హైదరాబాదులా ఎప్పటికీ ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదని, కలిసి ఉంటే ఆంధ్రప్రదేశ్ అడవి అవుతుందని, విడిపోతే అమెరికా అవుతుందని అన్నారు. అటువంటి పరిస్థితులు ఈ రాష్ట్రానికి వస్తున్నాయి. ఇలాంటి సందర్భంలోను మరియు ఉద్యమాలు జరుగుతున్న సందర్భంలో కొంతమంది పెద్దలు దక్షిణ భారతదేశాన్ని విడగొట్టేస్తాము, రాజ్యాంగం మీద ప్రమాణస్వీకారం చేసినటువంటి మురళీమోహన్‌గారి లాంటి పెద్దలు దక్షిణ భారతదేశాన్ని విడగొట్టేస్తామని అన్నారు. అలాగే, మరొక మేధావులు రాష్ట్రం అంతా పర్యటనలు చేస్తున్నారు. సభ్యులు ఇక్కడ కాదు కాబట్టి నేను పేరు చెప్పను. ఆయన అయితే ఈ రాష్ట్రాన్ని ఒక దేశంగా మారుస్తామని, ప్రకటిస్తారు.

అధ్యక్షా, ఒక పేదవాడు త్రాగడానికి నీళ్ళు లేనివాడు, అభివృద్ధికి దూరంగా ఉన్నవాళ్ళు ఒక కోర్టును అడిగితే ప్రాంతీయ వాదాన్ని బీజేపి రెచ్చగొడుతోందని మురళీమోహన్ గారు దక్షిణ భారతదేశాన్ని విడగొట్టేస్తామంటే అది మరి ఏ విధంగా ఉంది? గవర్నర్‌గారు చేసిన ప్రసంగాన్ని మొత్తం చదివితే ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాన్ని కూడా అద్భుతంగా వినియోగించుకుందని ఆయన సాక్షీభూతంగా వారు ఇందులో ప్రస్తావించారు. ఇందులో ప్రతి అంశం ఉంది. అందులో ఎన్ఆర్ఈజీఎస్ కూడా ఉంది. నాకు మరికొంత సమయం ఇస్తే నేను బుందేల్‌ఖండ్ గురించి కూడా మాట్లాడతాను. శ్రీ దినకర్ గారు బుందేల్ ఖండ్ గురించి గొప్పగా వ్యాసం వ్రాశారు. అసలు ఈ బుందేల్‌ఖండ్ రాష్ట్రానికి ఎంత వచ్చిందో కూడా వ్రాశారు. బుందేల్‌ఖండ్ గురించి మాట్లాడుతున్నారు. ఆ రాష్ట్రం గురించి కూడా రూ.250కోట్లు, ఒడిశాకు రూ.300కోట్లు వచ్చాయని దినరక్‌గారే వ్రాశారు. బుందేల్ ఖండ్ రాష్ట్ర ప్రగతిని గురించి కూడా వారు ఈ పత్రికలో వివరించారు. ఇది ఆంధ్రజ్యోతిలో వచ్చింది.

(సభలో పేపర్ క్లిప్పింగ్‌ను చూపించారు.)

ఇలా పేదవారికి ఈ రాష్ట్రంలో డీసెంట్రలైజేషన్ ఆఫ్ ది పవర్ కావాలి. మొన్న పెద్దలు శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ గారు మాట్లాడుతూ 25 ఆసుపత్రులను ఇక్కడ కడుతున్నామని అంటున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో రిమ్స్ అనే ఆసుపత్రి కొండల మధ్యన ఉంది. అక్కడ ఉన్నటువంటి టీచింగ్ ప్రొఫెసర్లు ఈక్వల్ టు ఎయిమ్స్ ఆసుపత్రి అంటున్నారు. ఇక్కడ ఎయిమ్స్ ఆసుపత్రి కడుతూ, బ్రిటీష్ వాళ్ళ ఆసుపత్రి కడుతూ, ఇక్కడే 25 ఆసుపత్రులను కడితే దానికి బడ్జెట్ రూ.50కోట్లు ఇస్తే ఉత్తరాంధ్ర జిల్లా ప్రజలు అమరావతి రావలసిన అవసరం లేదు. ఇందులో ఉన్నటువంటి కొన్ని ఆసుపత్రులను అక్కడ పెట్టండి. అలాగే రాయలసీమ జిల్లాలలో కూడా కొన్ని ఆసుపత్రులను పెట్టండి.

అధ్యక్షా, ఈనాడు ఒంగోలు జిల్లాను అటూ, ఇటూ కాకుండా వదిలేసే పరిస్థితికి వచ్చింది. ఈ ఒంగోలుకు సంబంధించి అవసరమైతే మనమందరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కలిసి దానిని కూడా అభివృద్ధి చేసుకోవాలి. అన్ని రాష్ట్రాలు, జిల్లాలకు సంబంధించి శ్రీ దినకర్ వ్రాసిన ప్రసంగాన్ని చదివితే సమగ్రంగా అన్ని జిల్లాలలో కూడా ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ఉంది. రాయలసీమ, ఉత్తరాంధ్ర, మధ్య ప్రాంతాలలో కూడా అన్ని ప్రాజెక్టులు

కూడా ఉన్నాయని వాళ్ళు వ్రాసిన ఆర్టికల్స్ ఉన్నాయి. ఇది నేను చెప్పింది కాదు, వాళ్ళు స్వయంగా వ్రాసిన ఆర్టికల్ ఇది. ఇప్పటికీ మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. లెటర్ ఇచ్చినా మేము అడగలేదు. మేము ఏమీ విడిపోతామని చెప్పి ఇవన్నీ మేమే అడిగామనేటటువంటి విషయాన్ని కూడా తమ ద్వారా స్పష్టం చేస్తున్నాను. ఒకసారి పార్లమెంటులో జరిగిన అంశాలను ఓపెన్ చేయండి. అక్కడ శ్రీ ఎం. వెంకయ్యనాయుడుగారు మాట్లాడుతున్న సందర్భంలో ఒక్క మిత్రపక్షం సభ్యులు కూడా ఈ ఆంధ్రరాష్ట్రం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వీటి గురించి అడిగి, తెచ్చి, ఇచ్చి మమ్మల్ని ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నం చేయడం మాత్రం భావ్యం కాదు. ఒక పార్టీని మట్టుబెట్టాలంటే ఎన్నికలలో మాట్లాడదాము. ఆ అభివృద్ధిని దాచడానికి ప్రయత్నం చేయవద్దని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ధన్యవాదాలు.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, ఒక్క నిముషం మాట్లాడతాను, నాకు అవకాశం ఇవ్వండి. ఎందుకంటే ఆయన నా పేరు ప్రస్తావించారు. ఆయన చెప్పినదానికి నేను క్లారిటీ ఇస్తాను, అంతకంటే ఎక్కువ సమయం తీసుకోను.

**మిస్టర్ చైర్మన్:** ఇప్పటికే 27 నిముషాలు మాట్లాడారు.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, నేను స్పీచ్ ఇవ్వను. కేవలం ఒక్క మాటే మాట్లాడతాను.

**శ్రీ సోము వీర్రాజు (మైకు లేదు):** మీరు ప్రతిదానికి అడ్డం వస్తే ఎలా? మేము కూడా మీరు మాట్లాడేటప్పుడు అలాగే అడ్డం వస్తే బావుంటుందా...

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** మీరు చెప్పిన దానికే నేను వివరణ ఇస్తాను సార్. మీరు నా పేరు ప్రస్తావించారు, దానికి నేను వివరణ ఇస్తాను.

**శ్రీ సోము వీర్రాజు:** (మైకు లేదు) అధ్యక్షా, ప్రతిదీ విమర్శగా తీసుకుంటే కష్టమవుతుంది.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** నేను విమర్శగా తీసుకోవడం లేదు, మీరు అన్న మాటలకు నేను క్లారిటీ ఇస్తున్నాను.

**మిస్టర్ చైర్మన్:** శ్రీ సోము వీర్రాజుగారూ, కూర్చోండి.

**శ్రీ సోము వీర్రాజు:** (మైకు లేదు) ప్రతి మాటకు అడ్డువస్తే ఎలా సార్? మేము మాట్లాడాలంటే ఎలా సార్. ఈ విధంగా సభా సమయాన్ని వృథా చేయవద్దు.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే ఉపన్యాసంలో సిటీల గురించి చెప్పేటప్పుడు ఒక్క నిముషం... సార్. ఆవేశపడకండి. ఎమోషనల్ అవ్వద్దు సార్.

(అంతరాయం)

**మిస్టర్ చైర్మన్:** వీర్రాజుగారూ కూర్చోండి.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, నేను గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే ప్రసంగంలో రాజధాని నిర్మాణంలో రకరకాల సిటీలు అంటే కోర్టులకు సంబంధించి కోర్టులన్నీ కోర్టు సిటీలో ఉంటాయి, మెడికల్‌కు సంబంధించి మెడికల్ సిటీలో ఉంటాయి, ఇంకొకటి స్పోర్ట్స్ సిటీ ఉంటుంది. అలా ఒక 8 రకాల సిటీలు నిర్మాణం చేసి ఒక రాజధానిగా ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. విజయవాడలో మనకు ఆటోనగర్ ఉంటే, అక్కడ ఎక్కువ ఆటోలు ఉంటాయని, అలా ఒక అద్భుతమైన క్రొత్త నగరాన్ని ప్రపంచంలో గొప్ప రాజధానిని ముఖ్యమంత్రిగారు నిర్మించబోతున్నారని చెప్పాను. అంతే గానీ, డీసెంట్రలైజేషన్‌కి మేము ఎప్పుడూ వ్యతిరేకం కాదు. ఇంకొకటి – ఈరోజు హిందూ పత్రికలో ఒక అంశం వచ్చింది. గోవింద రావు గారని ఆయన గతంలో ఫైనాన్స్ కమీషన్ మెంబరుగా ఉన్నారు. మంచి ఎకనామిస్ట్ ఆయన.

(పేపర్ కటింగ్ చూపించారు.)

కేంద్రం స్పెషల్ కేటగిరి స్టేటస్ ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. కేంద్రప్రభుత్వం ఇచ్చుకోవచ్చు. దానిని ఫైనాన్స్ కమీషన్ మీదకు నెట్టవద్దని చెప్పారు. ఆ విషయం గురించి మేము మాట్లాడుతూ ఉంటే, వారి స్పీచ్‌లో అవేమి చెప్పకుండా వేరే వేరే అంశాలు అంటే పొలిటికల్ అటాక్ కౌంటర్‌కి దిగారు. అది మంచిది కాదు. ముఖ్యమంత్రిగారు ఈనాడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన గంటలు గంటలు కష్టపడుతున్నారు. ముఖ్యమంత్రిగారి శ్రమను చూసి మీరు గౌరవించండి. ఈ రాష్ట్రానికి సహాయం చేయండి. మన రాష్ట్రానికి సంబంధించి బయట అంటే పార్లమెంటులో ప్రామిస్ చేసిన చట్టాలు ఉన్నాయి. ఆనాడు ఫిబ్రవరి 20వ తారీఖున మన రాష్ట్రానికి స్పెషల్ కేటగిరి స్టేటస్ ఇస్తామని శ్రీ మన్‌మోహన్ సింగ్ గారు చెప్పారు. దానిని ఫాలో అవమని చెపుతున్నాము.

మ.12.20

అధ్యక్షా, మరో అంశం. ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి, సభ్యులు సోము వీర్రాజు గారికి తమరి ద్వారా తెలియజేసేదేమిటంటే ఈరోజు గాంధీ గారు ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించిన రోజు. గాంధీ గారికి సంబంధించిన అంశాలను నేను నిత్యం చదువుతాను. దానిలో ఉన్న స్పిరిట్ ఏమిటంటే – ప్రజల హక్కులను, వారి మనోభావాలను గౌరవించమని బ్రిటీషు వారికి వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారు. ఈ రోజు మేము, మా ముఖ్యమంత్రిగారు చెప్పినది కూడా గాంధీ గారి స్పిరిట్ అధ్యక్షా, మన గౌరవ ముఖ్యమంత్రిగారు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను, రాజ్యాంగాన్ని గౌరవించమని చెబుతున్నాము. దానిని మీరు వేరే రకంగా తీసుకోవద్దని చెబుతున్నాము.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** మీకు one hour time ఇచ్చాము కదా? మీరు అలా కంటిన్యూ చేసి మాట్లాడితే ఎలా? ఇంకా మాట్లాడవలసిన వారు ఉన్నారు.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, సభ్యులు శ్రీ డొక్కా మాణిక్య వర ప్రసాద్ గారిని ఉద్దేశించి వారు మాట్లాడిన దానికి నేను కూడా వివరణ ఇస్తాను.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** వీర్రాజు గారూ, మీకు 25నిమిషాలు అంటే 27 నిమిషాలు మాట్లాడడానికి అవకాశం ఇచ్చాము.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, నేను వివరణ ఇవ్వాలి కదా?

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** ఇలా మీరు ఒకరికొకరు **explanation** చెప్పుకుంటే ఈ సభ మీ ఇద్దరి కోసమే నడుస్తుందా? మీరు ఒక నిమిషంలో డైరెక్టుగా పాయింట్ చెప్పాలి.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, ఇది దినకర్ గారు వ్రాసిన ఆర్టికల్. కేంద్ర ప్రభుత్వం 2017 నుండి ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికి ఉండదని చెప్పడానికి గల కారణం కేంద్రం పన్నులలో రాష్ట్ర వాటా 30 నుండి 42 శాతం పెంచిన తరువాత కూడా వచ్చే రెవెన్యూ లోటును అన్ని రాష్ట్రాలకు భర్తీ చేస్తున్నందున ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలకు, సాధారణ రాష్ట్రాలకు అదే బేధం లేదు. నీతి అయోగ్ సూచన మేరకు ప్రణాళిక ప్రణాళికేతర వ్యయం అనే విభజన రాబోయే బడ్జెట్ నుండి ఉండదు. అనేక సంస్కరణల వల్ల ప్రత్యేక కేటగిరీ హోదా వలన రాష్ట్రాలకు ప్రణాళిక వ్యయంలో 30శాతం కేటాయించే విధానం రద్దు అవుతుంది.

( ఆ సందర్భంలో శ్రీ బుద్ధా వెంకటేశ్వర రావు గారు, డా. ఎ.ఎస్.రామకృష్ణ మరియు కొందరు సభ్యులు మాట్లాడతామని లేచి నిలబడి అవకాశం ఇవ్వమని కోరసాగారు.)

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** ఈ విధంగా అయితే కష్టం. మీకు అవకాశం ఇస్తాము. సమయం వచ్చినప్పుడు అందరికీ అవకాశం ఇస్తాను. పితాని సత్యనారాయణ గారూ, మాట్లాడండి.

**శ్రీ పితాని సత్యనారాయణ:** అధ్యక్షా, మేము సభ్యులు వీర్రాజు గారిని భారతీయ జనతా పార్టీకి ఈ సభా సంప్రదాయాలకు లీడర్‌గా ఉండడం చూశాను. వారికి ఒకటే చెప్పదలచుకున్నాము. మీరు పేపర్ల ఫాలో అవ్వద్దు. ఆ రోజు మనమంతా మిత్రపక్షంగా ఉన్నాము కనుక మీ మీద గౌరవంతో, నమ్మకంతో మాట్లాడడం వాస్తవం. పత్రికల్లో వచ్చినవి కూడా మేము కాదనడం లేదు. నీతిఆయోగ్, ప్రణాళిక సంఘం రెండు సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వం మారిన తరువాత నీతిఆయోగ్ వచ్చింది. ఈ సిద్ధాంతాలకు కట్టుబడి మేము ఇవ్వలేమని చెప్పితే మేము మిత్రపక్షంగా ఉన్నాము కనుక ఆరోజు నమ్మాము. కాదనడంలేదు. దాని మీదే మేము మిత్రపక్షంగా స్టేట్‌మెంట్ ఇచ్చుకుంటూ వచ్చాము. మిత్రపక్షంగా సత్సంప్రదాయాలను గౌరవించుకుంటూ వచ్చాము. ఇప్పుడు కూడా మేము ఏమి చెబుతున్నామంటే మీరు ఇచ్చిన మాట సంవత్సరన్నర , రెండు సంవత్సరాలు దాటినా కూడా ప్యాకేజీ ఇస్తారని నమ్మి మేము ఒప్పుకున్నాము. కానీ ఏదైతే ప్యాకేజీ ఇస్తారన్నారో రాష్ట్ర వాటాకు ఇవ్వవలసినది, ఈ నూతన రాజధాని నిర్మాణానికి ఇవ్వవలసిన దానికి కట్టుబడి లేరని కొంత బాధకలిగింది. ప్రజా ఉద్యమం వచ్చే పరిస్థితి వచ్చింది. అయినప్పటికీ

కూడా పార్టీకి నూకలు చెల్లే రోజులు వచ్చేశాయని, ఇటువంటి పార్టీకి మిత్రపక్షంగా ఉండడం మంచిది కాదనే ఆలోచనతో మేము నిర్ణయించుకుంటే ఈరోజు మీకు బాధ కలగవచ్చు. వాస్తవానికి మేము మిత్రంగా ఉన్నాము. నమ్మి మాట్లాడాము. ఈ రోజు పత్రికలలో వచ్చాయి. కాదని చెప్పడం లేదు. పత్రికలలో వచ్చిన అంశాలను చదివి ఇక్కడ రాద్ధాంతం చేయడానికి ప్రయత్నించవద్దని వీర్రాజు గారిని కోరుతున్నాను.

**శ్రీ బుద్ధా వెంకటేశ్వర రావు :** అధ్యక్షా, ఇది ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయం. ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా విభజన చేసింది. తరువాత 2014వ సంవత్సరంలో బిజెపితో అలయిన్స్‌లో మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఎన్నికలలోకి వెళ్లారో ఆ రోజు బిజెపి ప్రధాన అభ్యర్థిగా ఉన్నటువంటి శ్రీ నరేంద్ర మోదీ సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి సాక్షిగా ఈ రాష్ట్రానికి దిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తామని, ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని అన్నారు. ఈరోజు ఈ రాష్ట్రంలో ఉన్న ముఖ్యమంత్రి దేశంలోనే అందరి కంటే ఒక సీనియర్ రాజకీయ నాయకుడు మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 1978వ సంవత్సరంలో శాసనసభ్యుడిగా చంద్రగిరి నియోజకవర్గం నుండి ఎన్నికైన తరవాత మాత్రమే ఈ రోజు దేశంలో ఉన్న ఏ ముఖ్యమంత్రులు కానివ్వండి, ప్రధానమంత్రి కానివ్వండి ఆ పదవులను అలంకరించినటువంటి వారు. మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఒక ఇమేజ్ ఉన్నటువంటి వ్యక్తి. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే ఇంతకు ముందు సభ్యులు సోము వీర్రాజు గారు అనేక విషయాలు చెప్పారు. వారు చెప్పిన దానిని బట్టి చంద్రబాబు నాయుడు గారి గురించి కూడా చెప్పవలసి వచ్చింది. ఈ రోజు ఏదైతే భారతీయ జనతా పార్టీ కేంద్రంలో ఉందో, ఆ పార్టీకి చెందిన సోము వీర్రాజు గారు బయట గానీ, సభలో గానీ వాస్తవాలు మాట్లాడడం లేదు. పత్రికలు తీసుకొచ్చి పత్రికల్లో వచ్చిన వాటి గురించి రకరకాలుగా మాట్లాడుతున్నారు. ఇంతకు ముందు మా సోదరులు సత్యనారాయణ గారు చెప్పింది నిజమే. ఆ రోజు మేము మిత్రపక్షంగా ఉన్నాము. మిత్రులు తప్పు చేసినా మేము వెనకేసుకుని రావాలి కాబట్టి అప్పుడు మేము ఆ విధంగా మాట్లాడిన మాటలు వారు పత్రికల్లోనివి చూపించారు. సోము వీర్రాజు గారు మాట్లాడిన మాటలు కూడా మా దొర బాబు గారు పేపరు కటింగ్‌లు తీసుకొచ్చారు, అవి కూడా చూపిస్తారు. సోము వీర్రాజు గారు కూడా ప్రత్యేక హోదా గురించి చెప్పారు.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** మినిష్టరు గారు దానికి క్లారిటీ ఇచ్చారు. గవర్నర్ ప్రసంగం మీద మాట్లాడమన్నాం.

**శ్రీ బుద్ధా వెంకటేశ్వర రావు:** అధ్యక్షా, రాష్ట్ర విభజన తరువాత ఆర్థిక లోటు రూ.16,000కోట్లు ఉంటే కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఉన్న నష్టాన్ని అంతా కూడా భరిస్తామన్నది. మరి ఈ రోజు రాజధాని నిర్మాణం కోసం కేవలం రూ.2,500కోట్లు మాత్రమే ఇచ్చారు. అందులో కూడా రూ.1500కోట్లు రాజధాని నిర్మాణం కోసం, రూ.500కోట్లు గుంటూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ కోసం రూ.500కోట్లు విజయవాడ సిటీలో డ్రైనేజీ కోసం ఇచ్చింది తప్ప రాజధానికి ఇంకా ఏమీ నిధులు ఇవ్వలేదు. ఇందుకు గాను 6లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తాత్కాలిక సచివాలయాన్ని నిర్మించాము. గవర్నర్ గారు కూడా మొన్న అసెంబ్లీలో ప్రసంగించడానికి వచ్చినప్పుడు ఇక్కడ అభివృద్ధిని చూసి అద్భుతమైనటువంటి అసెంబ్లీ, సచివాలయం నిర్మించామన్నారు. ఈ విధంగా హైదరాబాదు నగరంలో కూడా లేదన్నారు. ఇది కేవలం 6మాసాల లోపే చేసినటువంటి ఘనత మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిదే. 10 సంవత్సరాలు హైదరాబాదులోనే ఉండి పరిపాలించే అవకాశం ఉన్నందున

అధికారులంతా హైదరాబాదులో ఉంటే 10 సంవత్సరాల తరువాత అయినా సరే రాజధానికి రావాలని, వారందరినీ రిక్వెస్టు చేసి రప్పించారు. ముందుగానే రాజధానికి వచ్చి పరిపాలిస్తే ఆంధ్రులకు ఒక భరోసా ఉంటుందని వారు బస్సులోనే నిద్రించి, అధికారులకు కూడా ఆదర్శంగా నిలచి హైదరాబాదులో ఉండే అధికారులందరినీ కూడా ఇక్కడకు రప్పించినటువంటి ఘనత మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికే దక్కుతుంది. అప్పుడు వారికి ఇక్కడ ఆఫీసు పరిపాలన విభాగం ఏమీ లేదు. ఇవన్నీ ఆరు నెలల లోపే ఏర్పాటు చేశారు. శాసనసభ, శాసనమండలిని కూడా నిర్మించుకున్నాము. ఇదంతా మన గౌరవ ముఖ్యమంత్రి గారి ఘనత.

అధ్యక్షా, వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ అన్నారు. కోరాపుట్, బోలంఘీర్, కలహండి, (కెబికె) తరహా ప్యాకేజీను రాయలసీమలోని నాలుగు జిల్లాలలో మరియు ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు ప్యాకేజీ ఇస్తామని గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు పార్లమెంటులో స్వయంగా హామీ ఇచ్చారు. కోరాపూట్, బోలంఘీర్, కలహండి, (కెబికె) కి దాదాపు రూ.7,266కోట్లు ఇచ్చారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.2,450కోట్లు మాత్రమే ఇచ్చారు.

మ.12.30–12.40

అధ్యక్షా, ఈ రోజు రాయలసీమ గురించి యూనియన్ పెట్టి రాయలసీమకు అది కావాలి, ఇది కావాలని అంటున్నారు. సాక్షాత్తూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారు చెప్పినటువంటి ప్యాకేజీని కూడా ఇంతవరకు అమలుచేయలేదు. అలాగే, విభజన చట్టంలో ఉన్నటువంటి ప్రాజెక్టులు, నిధులు, అలాగే 2014–రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుండి రావలసినటువంటి ప్రాజెక్టులు, వాటికి ఇవ్వవలసినటువంటి నిధులు ప్రాజెక్టుల వారీగా చదువుతాను. పెట్రోలియం రంగానికి రూ.1,40,000 కోట్లు, జాతీయ రహదారులకు రూ.1,00,000 కోట్లు, రైల్వే ప్రాజెక్టులకు రూ.49,949 కోట్లు, మెడ్ టెక్ జోన్‌కు రూ.20,000 కోట్లు, పట్టణ పేదలకు ఇళ్లు రూ.10,200 కోట్లు, హడ్కో రుణం రూ.7500 కోట్లు, పిఎంఎస్‌పై ఇళ్లు రూ.7920 కోట్లు, జలరవాణాకు రూ.7015 కోట్లు, బిసిసిఐ రూ.4211 కోట్లు, కోస్టల్ ఎకనామిక్ జోన్‌కు రూ.3000 కోట్లు, 4 స్మార్ట్ సిటీలకు రూ.1500 కోట్లు, నెల్లూరుకు హడ్కో రుణం రూ.1000 కోట్లు, క్షిపణి పరీక్షా కేంద్రానికి రూ.1000 కోట్లు. ఇలా ఇవన్నీ కలిపితే రూ.3,55,464 కోట్లు. కానీ, ఈ రాష్ట్రానికి ఇచ్చిందేమిటి? మన గౌరవ సభ్యులు శ్రీ సోము వీర్రాజు గార్ని చెప్పమని అడుగుతున్నాం. వారు చెప్పినవన్నీ ఇన్ని కోట్ల రూపాయలుంటే, మరి ఈ రోజు వారు రాష్ట్రానికి ఇచ్చిందేమిటి? ఈ రోజు ఆంధ్రుల ఆత్మగౌరవం. మీరు ఏ పార్టీలోనైనా ఉండండి. ఈ రోజు ఈ రాష్ట్రం గురించి పోరాడవలసిన వ్యక్తులు మీరు. అలాంటిది ఇవాళ మీరు ముఖ్యమంత్రి గారిని టార్గెట్ చేసి మాట్లాడటమనేది మంచి పద్ధతి కాదు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి అంటే కేవలం 13 జిల్లాల ముఖ్యమంత్రి అనుకుంటున్నారేమో గాని, అట్లా కాదు. ఈ రాష్ట్రంలోనే కాదు, దేశంలో ఉన్నటువంటి తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి.

అధ్యక్షా, ఇందాక సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు చెప్పారు. మురళీమోహన్ గారు దక్షిణాది రాష్ట్రాలన్నీ విడిపోతాయని చెప్పారన్నారు. దక్షిణాది రాష్ట్రాలు మాత్రమే కాదు. ఈ రోజు ముఖ్యమంత్రి గారి నోటివెంట రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలి, ఈ రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందనంటే కేంద్ర ప్రభుత్వ పీఠమే కదిలే పరిస్థితి వచ్చింది. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఇమేజ్ ఈ రాష్ట్రంలోనే కాదు, దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ ఉంది. ప్రత్యేక హోదా సాధించేవరకు, కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఇస్తామన్న నిధుల్ని రాబట్టేవరకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం తప్పకుండా పోరాటం చేస్తుంది. మీరు కూడా ఆంధ్రులై ఉన్నారు కాబట్టి, శాసనమండలి సభ్యులుగానీ, శాసనసభ్యులు గానీ బిజెపి పార్టీ తరపున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి దగ్గరకు వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం, ఈ రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా కోసం పోరాడాలని ఈ శాసనమండలి ద్వారా వారికి విన్నవించుకుంటున్నాను.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్ః** రాజేంద్ర ప్రసాద్ గారూ..

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, ఈ చర్చ పూర్తిగా విభజన చట్టంపైన జరుగుతోంది. ఆ విధంగా విభజన చట్టంపైన చర్చ పెడితే పెట్టండి. (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మాధవ్ గారూ కూర్చోండి. తరువాత ముఖ్యమంత్రి గారి రిప్లై ఉంది. రాజేంద్ర ప్రసాద్ గారూ.. రాజేంద్ర ప్రసాద్ గారూ...

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, గవర్నర్ ప్రసంగంపైన చర్చ కాకుండా, ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం, విభజన చట్టంపైన చర్చ జరుగుతోంది. (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** దయచేసి కోపరేట్ చేయండి. మీకు టైమిచ్చాను. మీరు మాట్లాడారు. తరువాత సీఎం గారి రిప్లై కూడా ఉంది. రాజేంద్రప్రసాద్ గారూ, మాట్లాడండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, గౌరవనీయులైన గవర్నర్ గారి ప్రసంగానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆ సందర్భంగా మీరు చైర్మన్‌గా ఉండగా, నాకు మాట్లాడే అవకాశమిచ్చినందుకు ప్రథమంగా మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మేమంతా (గౌరవ డెప్యూటీ చైర్మన్ గారితో కలిసి) సర్పంచుల సంఘంతో బాగా తిరిగేవాళ్లము. అధ్యక్షా, మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ రోజున రాష్ట్రం చాలా ఇబ్బందుల్లో ఉంది. ఆ విషయాన్ని నాయకులకంటే ప్రజలు గుర్తించారు. ఆ రోజున రాష్ట్రాన్ని విడదీసేటప్పుడు, సమైక్య ఉద్యమానికి నాయకులు లేకపోయినా, పార్టీలు ముందు లేకపోయినా ప్రజలు రోడ్లమీదకు ఎందుకు వచ్చారు? రాష్ట్రం విడిపోతే అన్యాయమైపోతామనే ఉద్దేశంతోనే. సరే విడదీసేశారు. దాంట్లో కాంగ్రెస్ పార్టీకి ఎంత భాగస్వామ్యముందో, బిజెపికి కూడా అంతే భాగస్వామ్యముంది. అందరికీ తెలుసు.

**శ్రీ సోము వీర్రాజు:** తెలుగుదేశం పార్టీకి కూడా అంతే సంబంధముంది. (మైకు లేదు)

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అక్కడికే వస్తున్నాను వీర్రాజు గారూ. I am coming. ప్రజలు ఈ ఇష్యూని ఇంత సీరియస్‌గా తీసుకుని, ఇంత బాధపడుతుంటే కేంద్రం మాకు సహాయం చేయడం లేదని బాధపడుతుంటే, బీజేపీ నాయకులు మమ్మల్ని ఎగతాళి చేస్తూ, హాస్యాలాడుతూ, సూటిపోటి మాటలు మాట్లాడుతూ మా ఆంధ్రప్రజల ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మా ఆంధ్రా ప్రజల్ని బిజెపి నాయకులు రెచ్చగొడుతున్నారు. అది గుర్తుంచుకోమనండి.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, ఇది చాలా అభ్యంతరకరమైన మాట. (మైకు లేదు)

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** ఇంకా విశాలంగా మాట్లాడాలంటే .. తెలుగు ప్రజల్ని అవమానిస్తున్నారు.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** (మైకు లేదు) భారతీయ జనతా పార్టీ తెలుగు ప్రజల ఆకాంక్షల్ని ఎప్పుడూ గౌరవిస్తుంది.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మాధవ్ గారూ, కూర్చోండి.

**శ్రీ సోము వీర్రాజు:** వెంకయ్య నాయుడి గారు తెలుగు ప్రజల్ని అభిమానించారు. వెంకయ్య నాయుడు గారు తెలుగు ప్రజల్ని అవమానించారా? వెంకయ్యనాయుడు గారు రెవెన్యూ లోటు అడిగి తెలుగు ప్రజల్ని అవమానించారా? (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ, మాధవ్ గారూ.. మీరు మాట్లాడినప్పుడు మీకు టైమిచ్చాను. ఇప్పుడు ఆయన మాట్లాడాలి. ఆయన్ని మాట్లాడనివ్వండి. మీరు మధ్యలో అలా మాట్లాడటమేమిటి? What is this?

( ఈ సందర్భంలో సభ్యులు శ్రీ సోము వీర్రాజు, శ్రీ పి.వి.ఎన్.మాధవ్ గార్లచే సభకు అంతరాయం)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ, మాధవ్ గారూ.. మీకు టైమిచ్చాను. 20 నిమిషాలకుపైగా టైమిచ్చాను. ఆయనికి 27 నిమిషాలిచ్చాము. ఆయన్ని మాట్లాడనివ్వండి. ఏమిటిది? రాజేంద్ర ప్రసాద్ గారూ, మాట్లాడండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** మీరు ఆవేశపడకండి. ఆవేశపడవలసింది మా ఆంధ్రా ప్రాంత ప్రజలు. బాధపడుతున్నది మేం ఆంధ్రులం. మాకు బాధ కలిగించే మాటలు మాట్లాడి ..

**శ్రీ సోము వీర్రాజు:** వెంకయ్య నాయుడు గారు ఆంధ్రుల గురించే అడిగారు. (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:** మీరూ ఆంధ్రులే. దయచేసి కూర్చోండి.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** వెంకయ్యనాయుడు గారు ఆంధ్రుల హక్కుల కోసం పోరాటం చేశారు. (మైకు లేదు)

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** నేను ఒక్కటే అడుగుతున్నాను. వీర్రాజు గారు బిజెపి నాయకులు..

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** (సభ్యులు శ్రీ సోము వీర్రాజు, శ్రీ పి.వి.ఎన్.మాధవ్ గార్లను ఉద్దేశించి) మీరు మాట్లాడేటప్పుడు ఎవరైనా అడ్డు తగిలితే అది కరెక్టు కాదని మీరు చెప్పినప్పుడు, ఇప్పుడు కరెక్టు అవుతుందా

(అంతరాయం)

వీర్రాజు గారూ, మాధవ్ గారూ, మీరిద్దరికీ మాట్లాడేందుకు అవకాశమిచ్చాను. ఇప్పుడు రాజేంద్రప్రసాద్ గారిని మాట్లాడనివ్వండి. మాట్లాడనివ్వను అనంటే ఇది కరెక్టు కాదు. ఇది పెద్దల సభ. ఈ సభకు కొన్ని సంప్రదాయాలున్నాయి. సంప్రదాయాల్ని పక్కకుపెట్టి మీ ఇష్టం వచ్చినట్లు మీరు మాట్లాడటం కరెక్టు కాదు. దయచేసి కూర్చోండి. వారు మాట్లాడేది వినండి. నోట్ చేసుకోండి. అవసరమైతే మీకు టైమిస్తాను, అప్పుడు మాట్లాడండి. అంతేతప్ప, మధ్యలో మాట్లాడి డిస్టర్బ్ చేయడమేమిటి? రాజేంద్రప్రసాద్ గారూ, మాట్లాడండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, మా ప్రియమైన సహచర సభ్యులు శ్రీ సోము వీర్రాజు గార్ని గానీ, శ్రీ పి.వి.ఎన్.మాధవ్ గార్ని గాని ఒక్కటే సూటిగా ప్రశ్నిస్తున్నాను. మీరు ఆంధ్రులవైపు ఉంటారా, ఢిల్లీ పాలకుల వైపు ఉంటారా? ఎటువైపుంటారో చెప్పండి.

**శ్రీ సోము వీర్రాజు:** మా వెంకయ్యనాయుడు గారు ఆంధ్రులవైపు ఉంటారు. మీరు ఆ రోజున ఎవరివైపున ఉన్నారని అడుగుతున్నాను. ఆ రోజున గౌరవిస్తుంటే మీరు ఎవరి వైపు ఉన్నారు? (మైకు లేదు)

(సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారిచే అంతరాయం)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ, మీకు టైమిస్తాను అని చెప్పాను.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** మీరు ఆంధ్రులవైపుంటే ఇట్లా ఎందుకు మాట్లాడతారు?

**శ్రీ సోము వీర్రాజు:** ఆ రోజున మా పార్టీ గౌరవిస్తుంటే మీరు ఎవరివైపు ఉన్నారు? (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ మీరు ఎమోషనల్ కాకండి. మీకు 27 నిమిషాలు సమయమిచ్చాను. మరలా కావాలంటే అవకాశమిస్తాను. మధ్యలో మాట్లాడకండి. ప్లీజ్. మీకు కావాలంటే మళ్లా అవకాశమిస్తాను. దయచేసి, ఒక సభ్యుడు మాట్లాడేటప్పుడు మరలా మధ్యలో మాట్లాడకండి. మీకు కావాలంటే మళ్లీ టైమిస్తానని చెప్పానుకదా! అలా చెప్పిన తరువాత కూడా మరలా మీరు మాట్లాడుతుంటే, సభ్యుల ప్రసంగానికి అడ్డుతగులుతుంటే what is this?

(అప్పటికే తమ స్థానాల వద్ద నిలబడి ఉన్న సభ్యులు శ్రీ సోము వీర్రాజు మరియు శ్రీ పి.వి.ఎన్.మాధవ్ గార్లచే అంతరాయం కొనసాగింది.)

ఇలాగైతే సభ జరగదు. మాధవ్ గారికి టైమిచ్చాను. మీకు (సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారికి) 20 నిమిషాల టైమిచ్చాను. ఆయనకు 27 నిమిషాల టైమిచ్చాను. ఒకవేళ ఆయన మాట్లాడిన తరువాత మీకేమైనా సందేహాలుంటే, క్లారిటీ కావాలనుకుంటే నోట్ చేసుకోండి. నోట్ చేసుకున్న తరువాత టైమిస్తాను. సీఎం గారి రిప్లై ఉంది. అర్థం చేసుకోరేంటి? రాజేంద్రప్రసాద్ గారూ, కంప్లీట్ చేయండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, సంతోషం. ఇందాక సోదరులు వీర్రాజు గారు చెప్పారు. అన్నీ వాళ్లే చెప్పారు. ప్రత్యేక హోదా గురించి, ఇంకా ఏవేవో చెప్పామని అంటున్నారు. ఎస్.. కరెక్టు. నేను కూడా ఒప్పుకుంటున్నాను. ఎస్.. మీరు చెప్పారు కాబట్టే, ఇస్తామన్నారు కాబట్టే, మిమ్మల్ని అడుగుతున్నాము. మిమ్మల్ని అడక్కుండా ఎవర్ని అడగాలి? మీరు హామీలిచ్చారు. హామీలివ్వడమే కాదు. బిజెపి పార్టీ, రాష్ట్ర ఎన్నికల ప్రణాళికను 2014లో ప్రకటించింది. 3వ పేజీలో, 5వ పేరాలో చూస్తే, బిజెపి ఒత్తిడి ద్వారా సీమాంధ్ర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రధానమంత్రి ఇచ్చిన హామీలు. ఇది భారతీయ జనతా పార్టీ సీమాంధ్ర ప్రజల ఆకాంక్షల అక్షర రూపం అని చెప్పి 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో 3వ పేజీలో చెప్పారు. ఒకటేమంటే – కేంద్ర సహాయంలో భాగంగా ఐదేళ్ల పాటు విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తాము. బిజెపి ప్రభుత్వం ఈ హోదాను మరో 5 సంవత్సరాలకు పొడిగిస్తుంది. అంటే, అప్పుడు ప్రకటించింది కాక, ఇంకో 5 సంవత్సరాలు అదనంగా ఇస్తామంది. అంటే పది సంవత్సరాలని మీ ఎన్నికల ప్రణాళికలో మీరే ప్రకటించారు. మరి ఎందుకివ్వలేదు? ఎందుకివ్వరు? దానికేంటి మరి మీరు ఎటెటో తిప్పి, ఎటెటో వెళతారు. 2022 వరకు టైముంది అంటారు. 2019లో ఎన్నికలు జరిగితే అప్పటికి రాజెవరో, మంత్రెవరో, మీరంతా ఎక్కడికెళతారో ఎవరికి తెలుసు? 2022 వరకు మీకు ఎవరు టైమిచ్చారు?

**శ్రీ సోము వీర్రాజు:** (మైకు లేదు) అది బిల్లులో ఉంది.

మ.12.40

**SRI.YALAMANCHILI VENTAKA BABU RAJENDRA PRASAD:** Let me complete. మీరు ఎన్నికల ప్రణాళికలో 5 సంవత్సరాలు..

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** గౌరవ సభ్యులు ఒక విషయం గమనించాలి. ఇది గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లుగా లేదు. ప్రత్యేక హోదా గురించి చర్చ మాదిరిగా అవుతోంది. దాని మీద కావాలంటే మళ్లీ డిబేట్ పెడదాము. దయచేసి కూర్చోండి (సభ్యులు శ్రీ సోము వీర్రాజు గార్ని). మీరు చెప్పండి రాజేంద్రప్రసాద్ గారూ.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, ఈ ఎన్నికల ప్రణాళిక 5 సంవత్సరాల వరకు అనుకుంటే, 2014 నుండి 2019 వరకు మీరు ఆ ప్రణాళికని అమలుపరచలేదు. అమలుపరుస్తారా, లేదా? లేకపోతే, మీ ఎన్నికల ప్రణాళికను మీరు అమలుపరచనందుకు మీరు ఆంధ్రా ప్రజలకు క్షమాపణలైనా చెప్పండి. రాజీనామాలు చేసి వెళ్లండి. లేదా, ఆత్మాభిమానం ఉన్న తెలుగుబిడ్డలుగా, ఆంధ్రాబిడ్డలుగా మీరంతా కేంద్రంపైన, ప్రధానమంత్రి గారిపైన పోరాడి ఈ ఎన్నికల ప్రణాళికను అమలుచేసిన తరువాత మాట్లాడండి. ఇది అమలు చేయకుండా ఏవేవో చెబుతారు. అలాగే, సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు ఎన్ని ప్రకటనలంటే అధ్యక్షా! లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా ఉన్నటువంటి కావూరి సాంబశివరావు గార్ని, కన్నా లక్ష్మీ నారాయణ గార్ని, శ్రీమతి పురంధరేశ్వరి గార్ని పక్కనపెట్టుకుని మన సోము వీర్రాజు గారు ఏమని చెబుతారంటే – ప్రత్యేక హోదా....

**శ్రీ సోము వీర్రాజు:** సభలో లేని వాళ్ల గురించి ప్రస్తావించవద్దు. ఎవరు లేటెస్ట్‌గా వచ్చారో, ఎప్పుడు వచ్చారో మాకు తెలుసు. (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ.. వీర్రాజు గారూ... నేను చెప్పేది వినండి.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు:** సభలో లేనివాళ్ల గురించి మీరు మాట్లాడవచ్చా? (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మీరు కూర్చోండి నేను చెబుతున్నాను కదా. వీర్రాజు గారూ, మీరు కూడా ఒక పేపర్ పట్టుకుని సభలో లేనటువంటి వారి గురించి మాట్లాడారు. ఇదే నేను చెబుతున్నాను. ఇదెక్కడికి పోతుందో నాకర్థం కావడం లేదు. గవర్నర్ గారి ప్రసంగమంటే ప్రత్యేక హోదా మీద చర్చ జరుగుతోంది. సభలో మీరొక పేపరు చదువుతున్నారు, ఆయనొక పేపరు చదువుతున్నారు. దయచేసి, సభా సంప్రదాయాల ప్రకారం వెళదాం. రాజేంద్రప్రసాద్ గారూ, మాట్లాడండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, అలాగే వెళదాం. దయచేసి, నన్ను కంప్లీట్ చేయనివ్వండి. "ప్రత్యేక హోదా బిజెపితోనే సాధ్యం , రాష్ట్రంలో 2019 నాటికి పార్టీ పటిష్టతకు కృషి" ఎం.ఎల్.సి. సోము వీర్రాజు గారు వందిమాగధులందరితో కలిసి అన్న మాటలు. ఏం, ఈ మాటను ఎందుకు నిలబెట్టుకోరు?

**శ్రీ సోము వీర్రాజు:** ముందు మీరు వందిమాగధలు అనే మాటను విత్‌డ్రా చేసుకోండి. (మైకు లేదు)

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** కూర్చోండన్నా. ముద్ద ముద్దకి బిస్మిల్లా అంటావేంటి భాయ్! అరె భాయ్ ముద్ద ముద్దకి బిస్మిల్లా అంటే ఎట్లా?

**శ్రీ సోము వీర్రాజు:** మాటకి మాట సమాధానాలు మా దగ్గర కూడా ఉన్నాయి. (మైకు లేదు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** రాజేంద్రప్రసాద్ గారూ, మాట్లాడండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ రెండూ వస్తాయి – ఎమ్మెల్సీ సోము వీర్రాజు.

**శ్రీ సోము వీర్రాజు:** (మైకు లేదు) రెండూ ఇస్తాం.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** పోనీ ఇస్తారు. ఎప్పుడు? ఎప్పుడు? 2022 నాటికా లేక 2062 నాటికా?

**శ్రీ సోము వీర్రాజు:** (మైకు లేదు) తీసుకున్నాము, సాధించామని మీ ముఖ్యమంత్రి గారే అన్నారు. అదేవిధంగా మీక్కూడా మేం చూపిస్తాము.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు:** (మైకు లేదు) మీరు చూపించేలోపే మేం తెచ్చాము.

**శ్రీ సోము వీర్రాజు:** (మైకు లేదు) ఏం తెచ్చారు?

**శ్రీ బి.ఎన్.రాజసింహులుః** అవన్నీ చెబుతాము. (మైకు లేదు)

(ఈ సందర్భంలో సభ్యులు శ్రీ సోము వీర్రాజు మరియు శ్రీ బి.ఎన్.రాజసింహులు గార్లచే అంతరాయం)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మీరూ, మీరూ మాట్లాడుకుంటే ఇక్కడ ఛైర్ ఎందుకు?

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, నాకు అర్థం కావడం లేదు. నేను మీతోనే మాట్లాడుతున్నాను.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మీరు ఆయనతో మాట్లాడి, ఆయన మీతో మాట్లాడుతుంటే ఇక్కడ మేమెందుకు? ఆయనో పేపరు పట్టుకొచ్చి సభలో లేనటువంటి వారి గురించి చెప్పారు. మీరో పేపరు పట్టుకొచ్చి సభలో చదువుతున్నారు. లేదంటే, మీరిద్దరూ (సభ్యులు శ్రీ సోము వీర్రాజు మరియు శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ గార్లను ఉద్దేశించి) ఒకరికొకరు కౌంటర్స్ ఇచ్చుకుంటున్నారు. ఇక ఛైర్ ఎందుకండీ?

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, చివరిగా ఒకటి చెబుతాను. ముచ్చటగా మూడవది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాను – ఎమ్మెల్సీ సోము వీర్రాజు. ఏంది సార్? ఇదే అడుగుతున్నాను. మీరేం చెప్పారో అదే ఇమ్మని మన గవర్నర్ గారు కూడా సవినయంగా మనవి చేస్తే, ఏంటి రకరకాలుగా మాటలు మారుస్తారు? అదంటారు, ఇదంటారు, మేము అన్నీ చేశామంటారు. పాపం మన కంభంపాటి హరిబాబు గారు చాలా పెద్దమనిషి. జెంటిల్‌మెన్ అనుకోండి. చివరికి ఆయనతో కూడా ఎంత దారుణమైన అబద్ధాలు చెప్పిస్తారంటే – రాష్ట్రంలో నేషనల్ హైవేస్‌కు లక్ష కోట్లు ఇచ్చామంటారు. అంటే అధ్యక్షా, సభ్యులెవరికీ తెలియకుండా నేషనల్ హైవేస్ ఎక్కడిచ్చారు? చంద్రమండలంలో ఇచ్చారా? లేక భూగర్భంలో మనకు తెలియకుండా ఎక్కడన్నా వేశారా? కొంచెం చూపెట్టమనండి సార్. మేం సంతోషిస్తాము. చంద్రమండలానికి తీసుకువెళితే మేం హైవేల మీద తిరుగుతాము. అనడానికి కూడా

పద్ధతి ఉండాలి. అందుకనే ప్రజలకి తీవ్రమైన ఆగ్రహావేశాలు వస్తున్నాయి. అది మీరు గ్రహించాలి, గుర్తించాలి. గతంలో కూడా ఈ రాష్ట్రాన్ని విడదీసేటప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎవర్నైతే మీరు పక్కనపెట్టుకుని మాట్లాడించుకుంటున్నారో అంటే కన్నా లక్ష్మీ నారాయణ గారు, కావూరి సాంబశివరావు గారు, శ్రీమతి పురంధరేశ్వరి గారు వీళ్లంతా ఇలాగే కేంద్రమంత్రులుగా ఉండి అడ్డగోలుగా కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాసి, సోనియా గాంధీ భజనచేస్తే, దెబ్బకి నామరూపాల్లేకుండా ఆంధ్రా నుండి ఆ పార్టీని తుడిచిపెట్టేశారు.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** కంప్లీట్ చేయండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, చెట్టుకొకళ్లు, పుట్టకొకళ్లు అయిపోయారు. Same history repeats. History repeat అవుతుంది. మళ్లీ మీరు కూడా అదే మాదిరిగా మా ప్రియమైన ప్రధానమంత్రి మోడీ గార్ని మోసి, మోసి చివరకు ఆయన్ని నీచకులం అని మీ నోటితోనే నిందిస్తారు? ఇది ఎంత అన్యాయం?

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** ఆ మాట వారు విత్‌డ్రా చేసుకున్నారు.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, చరిత్ర పునరావృతమౌతుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఏ గతి పట్టిందో, మళ్లీ ఇప్పుడు మీక్కూడా (బి.జె..పి. సభ్యులను ఉద్దేశించి) అదే గతి పడుతుంది. అందులో అనుమానమేం లేదు.

**శ్రీ సోము వీర్రాజు:** మాకు ఏ గతి పట్టినా ఫర్వాలేదు. 60 సంవత్సరాల నుండి ఏ పదవులు లేకుండా ఉన్నాము. మాకు ఏ గతి పట్టినా ఫర్వాలేదు. (మైకు లేదు)

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, నన్ను మాట్లాడనివ్వడం లేదు. అదేమంటే నిన్నో, మొన్నో టీవీల్లో స్క్రోలింగ్‌లో చూశాను. వీర్రాజు గారు అంటున్నారు. కొందరు మా పార్టీవైపు వస్తున్నారు, మాతో టచ్‌లో ఉన్నారు, టచ్‌లో ఉన్నారని అంటున్నారు. మీ పార్టీలోకొచ్చేదెవరు? అసలింకా...

(నేను ఏ పార్టీ పేరు చెప్పలేదంటూ సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు తమ స్థానం వద్ద నిలబడి అభ్యంతరం వ్యక్తం చేశారు)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** వీర్రాజు గారూ, కూర్చోండి. రాజేంద్రప్రసాద్ గారూ, కంటిన్యూ చేయండి. తరువాత సీఎం గారి రిప్లై ఉంది.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** ఓకె సార్. తప్పనిసరిగా కంప్లీట్ చేస్తాను. అధ్యక్షా, నేను ఒక్కటే చెప్పేది. ఇందాకే మా ముఖ్యమంత్రి గారు చెప్పారని, అలాగే, మా నాయకులు చెప్పారని ప్రకటనలు చదివి

వినిపించారు వీర్రాజు గారు. ఎస్.. మేం నమ్మాము. మా ముఖ్యమంత్రి గారు ప్రధానమంత్రి గారి హోదాలో ఉన్నటువంటి నరేంద్రమోడీ గారు చెబితే, హామీలిస్తే వాటిని విశ్వసించాము. మమ్మల్ని నమ్మించారు. చివరికి నమ్మకద్రోహం చేశారు కాబట్టే ఆ రోజున మేం నమ్మి హోదా ఇవ్వలేము, ఇంకెవ్వరికీ ఇవ్వలేమని చెబితే ఆ రోజున ప్రత్యేకంగా స్పెషల్ అసిస్టెన్స్‌కు అంగీకరించడం జరిగింది. ఆ స్పెషల్ అసిస్టెన్స్ కూడా మీరు ఇవ్వలేదు కదా. ఆ విషయాన్ని రాష్ట్ర ప్రజలు కూడా గుర్తించారు కదా. నాడు రాష్ట్రాన్ని విభజించి కాంగ్రెస్ పార్టీ ఆంధ్రా ప్రజలకు ద్రోహం చేస్తే, బిజెపి పార్టీ మోసం చేసిందని ప్రజలందరికీ తెలిసింది. జగన్ పార్టీ కుట్రలు పన్నుతోంది. ఈ రోజున ఇలా మాట్లాడుతున్నారంటే, ఇలా చేస్తున్నారంటే జగన్ పార్టీతో అంతర్గతంగా కుమ్మక్కవ్వబట్టే ఇది జరుగుతోందనేది రాష్ట్రప్రజలందరూ అనుకుంటున్నారు. ఇది మేం అనడం లేదు. ఎస్.. మీరు చెప్పారు కాబట్టే, మీరు హామీలిచ్చారు కాబట్టే మిమ్మల్ని అడుగుతున్నాము. కెబికె–బుందేల్‌ఖండ్ ప్యాకేజీలన్నారు. మీకు ఇందాకే చెప్పాను. అదే బిజెపి ఎన్నికల ప్రణాళికలో అదే 3వ పేజీలో, ఇది 6వ పేరాలో ఉంది. రాయలసీమ–ఉత్తరాంధ్ర జిల్లాలకు వర్తించే విధంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ – ఒరిస్సాలోని కోరాపుట్–బోలంఘిర్–కలహండి (కెబికె), ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రత్యేక ప్యాకేజీ తరహాలో ఈ ప్యాకేజీ ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామని బిజెపి పార్టీ వాళ్ల ఎన్నికల ప్రణాళికలో 3వ పేజీలో 6వ పేరాలో చెప్పడం జరిగింది.

మ. 12.50

దీనిని అమలు చేయమనడం తప్పా అధ్యక్షా? మా నేరమా? మాకివ్వడానికి డబ్బులు లేవా, రావా? రక్షణ శాఖని అడుగుతున్నామంటారా? యుద్ధం లేదు కదా ఆ నిధులు ఇమ్మంటామని ఎగతాళి చేస్తారా అధ్యక్షా? రెండు సంవత్సరాల క్రితం బుందేల్‌ఖండ్‌కి రూ.6,000కోట్లు ఎలా ఇచ్చారు? ప్రస్తుతం రూ.20,000 కోట్లు ఎలా ప్రకటించారు? అదే బుందేల్‌ఖండ్ ప్యాకేజీలో అంత ఇచ్చి, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు మా ముఖ్యమంత్రిగారు రూ.13,000 కోట్లు ఇమ్మంటే రూ.1050 కోట్లు మాత్రమే ఇచ్చారు. అందులో రూ.350 కోట్లు వెనక్కు తీసేసుకున్నారు. ఇంతకుముందు చెప్పినదానిలోనే 7వ పేరాలో విభజనానంతరం ఈ సంవత్సరం కలిగే ఆర్థిక లోటును కేంద్రమే పూర్తిగా భరిస్తుంది అని చెప్పారు. రూ.16,000 కోట్లు లోటు అంటే రూ. 7,000 కోట్లు తీసుకువచ్చారు, అందులో రూ.3,000 కోట్లు ఇచ్చారు, మిగతావి ఇమ్మంటే ఒకరకంగా చూస్తే రూ.65 కోట్లు ఇస్తాము, ఇంకో రకంగా చూస్తే రూ.1500 కోట్లు ఇస్తామని అన్నారు. సరే, మిమ్మల్ని ఏ రకంగా చూడాలో ఆంధ్రా ప్రజలు నిర్ణయించుకుంటారు. ఈ రకంగా చేయడం వల్లనే రాష్ట్ర ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఉన్నది. దీనిని కేంద్రం గుర్తించవలసిందిగా కోరుతున్నాము. మమ్మల్ని విమర్శించడం కాదు, మీరు బుందేల్‌ఖండ్ మీద, ఉత్తర ప్రదేశ్ మీద, ఉత్తర భారత దేశ ప్రజలమీద ఏ రకమైన అభిమానం చూపెడుతున్నారో అటువంటి ప్యాకేజీలనే ఆంధ్రాప్రజలకు, దక్షిణాది రాష్ట్రాలకు కూడా ఇవ్వాలని అడుగుతున్నాము.

దిల్లీని తలదన్నే రాజధానిని కట్టిస్తామని ప్రధానమంత్రిగారు అన్నారు. మరి ఇచ్చినదెంత అధ్యక్షా? కేవలం రూ.1500 కోట్లు ఇచ్చారు. మరో వెయ్యి కోట్లు గుంటూరు, విజయవాడకు ఇవ్వడం జరిగింది. అదేమంటే డిపిఆర్ ఇవ్వలేదని అంటున్నారు. రూ.43,000 కోట్లకు డిపిఆర్ ఏనాడో ఇవ్వడమైనది. అదేమంటే ఇంకా నిధులు లేవంటున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఒక కన్వెన్షన్ సెంటర్ కట్టుకోవడానికి రూ.1600 కోట్లు ఇచ్చారు. ఒక కన్వెన్షన్ సెంటర్‌కి రూ.1600 కోట్లు ఇచ్చినవాళ్లు ఒక రాష్ట్ర రాజధానిని, అందునా దిల్లీని తలదన్నే రాజధానిని కట్టుకోవడానికి ఎంత ఇవ్వాలి? రూ.1500 కోట్లు ఇస్తారా? ఒక సినిమాలో అర్ధ రూపాయి ఇచ్చి పండగ చేసుకో అన్నట్లు కేంద్రం రూ.1500 కోట్లు ఇచ్చి, లెక్కలు ఏవి, డిపిఆర్ ఏది అంటూ అడుగుతున్నారు. విశాఖపట్టణం, విజయవాడ నగరాలకు మెట్రో రైలు కోసం క్రిందటి సంవత్సరం కొంతమొత్తం అనౌన్స్ చేశారు, ఇంతవరకూ ఇవ్వలేదు. అదేమంటే, అవీ, ఇవీ అంటూ కుంటిసాకులు చెబుతున్నారు. అదే బెంగుళూరు మెట్రోకి రూ.15,000 కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్‌కి లక్ష కోట్లు ఇచ్చారు. వాటికి ఎక్కడనుండి నిధులు వస్తున్నాయి? ఏ రక్షణ శాఖ నుండి తీసుకువచ్చి ఇచ్చారు? నిధులు ఇచ్చాము, ఇచ్చాము అంటున్నారు గానీ ఎక్కడ నుండి తీసుకువచ్చి ఇచ్చారని అడుగుతున్నాను. అమెరికా నుండి అప్పు తీసుకువచ్చారా? లేక మీ గుజరాత్ నిధులనుండి ఇచ్చారా? మా ఆంధ్రాప్రజలు కట్టిన పన్నుల నుండి ఇస్తున్నారు. ఆ ఇచ్చేది కూడా పూర్తిగా ఇవ్వడం లేదు. దానిని పూర్తిగా ఇమ్మని అడుగుతున్నాము. ఇంకా గట్టిగా మాట్లాడితే, కేంద్రం వద్దే మా డబ్బులు ఉన్నాయి. మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారు కష్టపడి స్మశానం లాగా ఉండే ఈ ఆంధ్రప్రదేశ్‌ను బాగు పరచి రెండంకెల అభివృద్ధి నూ। కి తీసుకువస్తే, మా ప్రజల అభివృద్ధి ద్వారా కట్టే పన్నులతో మీరు కులుకుతూ, మీ అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్‌కు లక్ష కోట్లు, ఎన్నికలు వస్తున్నాయని బెంగళూరు మెట్రోరైలుకు రూ.15,000 కోట్లు ఇస్తారా? మా మెట్రో ట్రైన్‌కు మాత్రం పైసా ఇవ్వరా? వాస్తవాలను మేము అడుగుతున్నాము.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** కంప్లీట్ చేయండి.

**శ్రీ సోము వీర్రాజు:** (మైక్ లేదు)కులుకుతున్నారంటున్నారు? ఏమిటండీ ఆ భాష? విత్‌డ్రా చేసుకోమని చెప్పండి సార్.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** వీర్రాజు గారూ, నేను వాస్తవాలు మాట్లాడుతున్నాను.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మీరిద్దరూ మాట్లాడుకుంటే ఎలా? చైర్‌తో మాట్లాడండి. రాజేంద్రప్రసాద్ గారూ, కంప్లీట్ చేయండి.

**శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్:** బిజెపి నాయకులకు ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని విభీషణుడిలాగా ఉంటారని కోరుకుంటున్నారు కానీ మీరు ఈ రాష్ట్ర ప్రగతికి సైంధవుల్లా అడ్డు పడుతున్నారు. దానికి ఈ రాష్ట్ర ప్రజలు హర్షించడం లేదు. ఇంతకుముందు మా ముఖ్యమంత్రిగారు సమన్యాయం

చేయమన్నారు. సమన్యాయం ద్వారానే ప్రత్యేక హోదా దగ్గర నుండి అన్ని హామీలు నెరవేర్చవలసిన బాధ్యత ఉన్నది. రెండు రాష్ట్రాలూ రెండు కళ్లు అని ఎందుకన్నారో ఈనాడు ఆంధ్రా, తెలంగాణా ప్రజలకు అర్థమవుతున్నది. ఆయన చెప్పింది వాస్తవం, ఆయన లైన్ కరక్ట్ అని ప్రజలు అంగీకరించడం జరుగుతున్నది. అయినా, బిజెపి నాయకులకు అర్థం కావడం లేదు. అదే రాజనీతి, అదే రాజధర్మం అమలు చేయమని మీ మహానాయకులు వాజ్‌పేయి గారు కూడా చెప్పారు. మహానాయకులు వాజ్‌పేయిగారు చెప్పినా ప్రియతమ ప్రధానమంత్రిగారికి చెవికి ఆనాడూ ఎక్కలేదు, ఈనాడూ ఎక్కడం లేదు.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** త్వరగా ముగించండి. ముఖ్యమంత్రిగారి రిప్లై ఉన్నది.

**శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ :** మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారు పడుతున్న కష్టానికి తోడుగా మేము కూడా కష్టపడతాము. మా నాయకుడు 18 గంటలు కాదు, ఇంకా కష్టపడతామని అంటున్నారు. ఇంకొక 5 సంవత్సరాలకో, 10 సంవత్సరాలకో మేము అభివృద్ధి చెందుతాము, కానీ ఎవరు తప్పు చేస్తున్నారనేది చరిత్ర చెబుతుంది.

అసలు హాస్యాస్పదమైన విషయమేమిటంటే, ఈ రాష్ట్రంలో దురదృష్టకరమైన ప్రతిపక్షమున్నది. ఆ పార్టీ మనకు ఇవ్వాల్సిన వాటి గురించి బిజెపిని ఏమీ అనదు కానీ, పుచ్చుకోవలసిన చంద్రబాబు నాయుడు గారిని, తెలుగుదేశం పార్టీని, రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శిస్తుంది. అంటే జగన్‌మోహన్ రెడ్డిగారు బిజెపి పార్టీని, మోదీగారిని పల్లెత్తు మాట అనరు. అదేమాదిరిగా బిజెపి కూడా ప్రతిపక్షపార్టీని జగన్‌మోహన్ రెడ్డి గారిని పల్లెత్తు మాట అనదు. వీలైతే సమావేశాల్లో ఆయనకు భజన చేస్తూ మాట్లాడుకోవడం జరుగుతోంది. ఇద్దరూ కలసి ఉమ్మడిగా మా ఆంధ్రప్రజలను, టిడిపిని, మా నాయకుడిని విమర్శిస్తున్నారు. దీనిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. మీరు విభీషణుల్లాగా ఉంటారా, సెంధవుల్లా ఉంటారా అని ప్రజలు గమనిస్తున్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేస్తే, నేడు మీరు మోసం చేస్తే, జగన్‌మోహన్ రెడ్డి కుట్రలు పన్నుతుంటే వీటన్నింటినీ కూడా అధిగమించి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే శక్తియుక్తులు మా నాయకుడు చంద్రబాబు నాయకుడికి ఉన్నాయని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ బి.ఎన్. రాజసింహులు :** అధ్యక్షా, గవర్నరు ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా అభివృద్ధి చెందుతోంది అనేది వివరిస్తూ అందుకు సభ్యులు కూడా సహకరించాలని చెప్పడం జరిగింది. రెండు విషయాలను సభ దృష్టికి తీసుకువస్తాను. 1978వ సంవత్సరంలో చంద్రబాబునాయుడు గారు శాసనసభ్యులైనారు. 1980వ సంవత్సరంలో మంత్రివర్యులైనారు. 1995 నుండి ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తరువాత 2004 నుండి 2014 వరకూ ప్రతిపక్ష నాయకుడిగా ఉండి, ఇప్పుడు మరలా ముఖ్యమంత్రి అయ్యారు. విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ వార్ రూం అని ఏర్పాటు చేసుకుని ప్రళయం వచ్చినట్లుగా అసంబద్ధంగా రాష్ట్రాన్ని విభజించిన సంగతి ప్రజలకు తెలుసు. వారు గమనించారు. అందుకని 2014వ సంవత్సరంలో ఒక్క సీటు కూడా గెలిపించకుండా ఇంటికి పంపిన ఘనత మన ప్రజలది.

1984వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారిని అక్రమ పద్ధతిలో పదవి నుండి తీసివేసినప్పుడు కూడా తెలుగుప్రజలు ఏ విధంగా స్పందించారో అందిరికీ తెలుసు. ఇప్పుడు కూడా విభజన సమయంలో ఏ విధంగా ఇబ్బంది పెట్టారో పెద్దలు అక్కడున్న నాయకులు వెంకయ్యనాయడుగారు వంటి వారు ప్రత్యేక హోదా 5 సంవత్సరాలు కాదు, పది సంవత్సరాలు కావాలని కోరారు. కనుక ఈనాడు బిజెపితోనే ప్రత్యేక హోదా సాధ్యమవుతుంది.

మ.01.00

అధ్యక్షా, బి.జె.పితోనే ప్రత్యేకహోదా సాధ్యమని ఒకసారి, ప్రత్యేకహోదా పరిశీలనలో ఉందని మరొకసారి, కేంద్రం అధ్యయనం చేస్తోందని ఇంకోసారి ఇలా ఒక ముగ్గురు నాయకులు రకరకాలుగా చెప్తున్నారు. ఆ క్లిప్పింగ్స్ కూడా మీకు పంపిస్తాను. అంటే ఆ ముగ్గురు నాయకులూ మూడుసార్లు వివిధరకాలుగా ప్రకటనలు చేయడం న్యాయమా? ఇది వస్తుందని నమ్మకముందా? వచ్చిందని వాళ్ళన్నారు. చివరికి అది రాదూ అనీ, ప్రత్యేక ప్యాకేజీ అనీ అన్నారు. ప్యాకేజీలో కూడా రూ.3,55,464 కోట్లు ఇస్తామని చెప్పి, చివరికి రూ.12,000 కోట్లే ఇచ్చారు.

అంతేగాకుండా, మా ముఖ్యమంత్రిగారి చొరవవల్ల విద్యుత్ వచ్చిందని గౌరవ సభ్యులు సభలో చెప్తే, కాదూ మావల్లే వచ్చిందని ఆ నాయకులు అంటున్నారు. విద్యుత్కొరకు ఉత్తరప్రదేశ్కు రూ.12,000కోట్లు, బిహార్కు రూ.8000కోట్లు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్కు రూ.1583కోట్లు ఇస్తామని చెప్పి రూ.465కోట్లే ఇచ్చారు. పదిహేను బి.జె.పి పాలిత రాష్ట్రాలు, అయిదు మిత్రపక్షంగా ఉన్నా ఎక్కడా కూడా 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయడంలేదు. కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దిల్లీ, గుజరాత్ నాలుగు రాష్ట్రాలలోనే 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయడం జరిగింది.

(గౌరవ చైర్మన్ అధ్యస్థానం వహించారు)

అయితే, 24 గంటలూ కరెంటు ఇచ్చిన ఘనత మా ముఖ్యమంత్రిగారు తీసుకున్న సంస్కరణల వల్లనే ఈరోజు అది సాధ్యమైందని చెప్పడానికి ఆంధ్రప్రదేశ్లో ఉండే ప్రజలంతా గర్వపడుతున్నారు.

అంతేకాదు, మంగళగిరి ఎయిమ్స్కు రూ.54కోట్లు ఇచ్చి ఇది మేము కట్టించామన్నారు. అయితే మా రాష్ట్ర ప్రభుత్వం రూ.1850కోట్లు విలువగల భూములిచ్చింది. అంతేగాకుండా వారు లక్షకోట్ల రూపాయలతో రహదార్ల కన్కెక్టివిటీ చేశామన్నారు. కానీ, రూ.6000కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఇక్కడ నిర్మిస్తున్న అంతర్వలయ రహదారికి మా రాష్ట్ర ప్రభుత్వం రూ.8000కోట్లు ఇచ్చింది. మిగిలింది వాళ్ళు పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్షిప్ కింద చేస్తున్నారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

చివరిగా, ఏ విధంగానైనాసరే ఆంధ్ర రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఉంది. ఈరోజు పవన్‌కళ్యాణ్‌గారు, జయప్రకాశ్ నారాయణగారు స్పెషల్ స్టేటస్‌కోసం పోరాడుతున్న చలసాని శ్రీనివాస్‌గారు, జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఆర్.టి.ఐ యాక్టు కింద కేంద్రప్రభుత్వం నుండి రాష్ట్రప్రభుత్వానికి ఎన్ని నిధులు వచ్చాయనే వివరాలు తీసుకుని, ఇంకా రూ.74,500కోట్లు ఇవ్వాలని నిర్ధారించారు.

**మిస్టర్ చైర్మన్:** త్వరగా పూర్తిచెయ్యండి.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు :** అధ్యక్షా, ఈ అంశాలనన్నింటినీ ఇక్కడున్న మా సోదరులు పరిశీలించి వాళ్ళ ప్రభుత్వం దృష్టికి, వాళ్ళ నాయకుల దృష్టికి తీసుకెళ్ళి, రాష్ట్రానికి చేయాల్సినవన్నీ అమలుచేయాలని మీద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది జరగడానికి ఇక్కడున్న అందరూ కూడా సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నాను. మొట్టమొదట మనం ఆంధ్రులం, తరువాతనే భారతీయులం అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరముందని మీద్వారా తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను

## <u>5.గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ముఖ్యమంత్రిగారి ప్రత్యుత్తరం</u>

**శ్రీ నారా చంద్రబాబునాయుడు :** అధ్యక్షా, గవర్నరుగారి ప్రసంగంపై శాసనపరిషత్తులో గౌరవ సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, మహ్మద్ అహ్మద్ షరీఫ్, విటపు బాలసుబ్రహ్మణ్యం, చిక్కాల రామచంద్రరావు, కత్తి నరసింహారెడ్డి, పివిఎన్ మాధవ్, కంతేటి సత్యనారాయణరాజు, సోము వీర్రాజు, బుద్ధా వెంకటేశ్వరరావు, యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్, బి.ఎన్.రాజసింహులుగార్లు మాట్లాడారు. వారందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. వారిచ్చిన సూచనల్ని ఎప్పటికప్పుడు ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఆ విధంగా ఉపయోగించుకుని ఇంకా పటిష్టంగా అమలుచేస్తామని తెలియజేస్తున్నాను.

అయితే, ఇక్కడ రెండు విషయాలు మనందరమూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరముంది. ఒకటి వేరే రాష్ట్రాలకంటే మన రాష్ట్రానికి ఒక ప్రత్యేకత ఉంది. రెండోసారి ఇక్కడ ఈ బడ్జెట్ సమావేశాలను నిర్వహించుకుంటున్నాము. అంతకు మునుపైతే రెండుసార్లు హైదరాబాద్‌లోనే బడ్జెట్ సమావేశాలను నిర్వహించుకున్నాము. అదేమాదిరిగా విభజన జరిగిన తీరు, విభజన సమయంలో ప్రజలు పడిన ఆందోళన, ఆవేదనను కూడా ఒకసారి మనం నెమరు వేసుకోవాల్సిన అవసరముంది. ఎందుకంటే ఆరోజు అన్యాయం, అవమానం జరిగింది. అది హేతుబద్ధతలేని విభజన. ఆ వివరాలు కూడా మీకు ఇస్తాను. అదే సమయంలో ఒక పద్ధతిలేని విమర్శలు చేస్తూ నియంత్రణ చేశారు. విభజన సమయంలో చట్టాన్ని తీసుకొచ్చి 20, 25 నిమిషాల్లో మమ అనిపించారు. ఆ సమయంలో పార్లమెంట్ తలుపులు మూసేసి, టీ.విలు ఆఫ్ చేశారు. అదేవిధంగా, రెండు ప్రధానమైన పార్టీలు కాంగ్రెస్, బి.జె.పి కూడా సభలోనే ఉన్నారు. తెలుగుదేశంపార్టీ సభ్యులు ఆందోళన చేస్తూ, సభలో కొట్లాడుతూనే ఉన్నారు. అదే సమయంలో 20 నిమిషాల్లో బిల్లు పాస్ చేశారు. పార్లమెంటులో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయం, అడ్వాణీగారి

రూము పక్కపక్కనే ఉంటాయి. ఈ బిల్లు టేకప్ చేసే సమయానికి నేను అడ్వాణీగారి రూములో ఉన్నాను. న్యాయం చెయ్యమని వారిని అడుగుతున్న సమయంలోనే 'పార్లమెంట్ తలుపులన్నీ మూసేసి, టీ.వి కనెక్షన్స్ కట్‌చేసి బిల్లు టేకప్ చేశారని' మా కార్యాలయం నుంచి నాకు ఒక చిన్న ౹ టీద్వారా తెలిపారు. ఆ సమయంలో అడ్వాణీగారితో మాట్లాడుతున్న నేను 'ఇంత అన్యాయమేంటండీ, ఇదెక్కడి దారుణం. ఇది ప్రజాస్వామ్యమా' అని అడిగాను. అప్పుడు అడ్వాణీగారు 'అదెలా జరుగుతుంది' అంటుండగానే, వారి కార్యదర్శి వచ్చి బిల్లు టేకప్ చేశారని ఒక ౹ టి ద్వారా తెలిపారు. అది చూసిన అడ్వాణీగారు వెంటనే ఆవేదనతో పార్లమెంట్‌కు వెళ్ళారు. ఆ తరువాత బిల్లు మాత్రం పాసైపోయింది.

అధ్యక్షా, ప్రజలు ఎక్కడా కూడా నిరుత్సాహపడకూడదని, నిరాశకు లోను కాకూడదని, అదేమాదిరి ఆవేశం, ఆందోళనతో, ఇంక మనకు పెన్షన్లు వస్తాయా, మన పిల్లలు ఏ విధంగా చదువుకుంటారు? వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి? మనం ఆసుపత్రులకు వెళ్ళాలంటే ఎక్కడకు వెళ్ళాలనే ఆలోచనలతో, ఏం చెయ్యాలో దిక్కుతోచని పరిస్థితిలో వారు మాంద్యానికి (డిప్రెషన్)కి వెళ్ళిపోయే పరిస్థితి వస్తుందేమోనని బాధపడ్డాను. చాలా చర్చలు జరిగాయి. ఇక్కడ ఈ సభలో కానీ, రాష్ట్ర ప్రజానీకంకానీ ఒకసారి గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఒకటి ఉంది. ఈ విభజన సమయంలో ఎనిమిది రోజులు ఎనిమిది శ్వేతపత్రాలను నేను విడుదల చేశాను. అదేవిధంగా, ఎనిమిది రోజులు దిల్లీలో నిరవధిక నిరాహారదీక్ష చేశాను.

అలాగే, తెలుగు ప్రజానీకం సమర్ధవంతంగా పనిచేసుకోగలుగుతారు. అయితే, మీరు విభజన చెయ్యాలనుకుంటే ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చెయ్యండి. లేదూ సమైక్యంగా ఉంచాలనుకుంటే తెలంగాణా ప్రజానీకానికి సర్ది చెప్పండి. అంతేకానీ ఇష్టానుసారంగా హేతుబద్ధత లేని విభజన, అవమానం చేసే పరిస్థితి తేవద్దని ఆరోజు కూడా చెప్పాను. ఆనాడు ఈ విషయాలన్నీ చెప్తూ, రాయలసీమ చాలావరకూ కరవు ప్రాంతమనీ, దేశంలోనే తక్కువ వర్షపాతం పడే రెండో జిల్లా అనంతపూర్ అనీ, అది ఎడారిగా మారిపోతుందనే అంచనాలున్నాయి, అలాగే కోస్తా జిల్లాలో కూడా తరచూ తుపాన్లు వస్తుంటాయి కాబట్టి ఆ ప్రాంతాలనుకూడా ఆదుకోవాల్సిన అవసరముందని చెప్పాను. నేను ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన నాలుగునెలలకు హుద్‌హుద్ తుపాను వచ్చి విశాఖపట్నాన్ని పూర్తిగా అతలాకుతలం చేయడంతో, నేను ఎనిమిది రోజులపాటు అక్కడే ఉండి నిబద్ధతతో పనిచేసి సాధారణ పరిస్థితి నెలకొన్న తరువాతనే తిరిగి హైదరాబాద్‌కు వచ్చాను. ప్రజల్లో శక్తి, సామర్థ్యం ఉంది కాబట్టి విశాఖపట్నంలో హుద్‌హుద్ తుపాను వచ్చిందనే విషయం మరిచిపోయి ఉక్కు సంకల్పంతో పనిచేశారు. విశాఖపట్నాన్ని నెంబర్ వన్ సిటీగా తయారుచేయడం కోసం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్ళారు.

(గౌరవ సభ్యుల హర్షధ్వానాలు)

నాకు బాగా జ్ఞాపకం. హుద్ హుద్ తుపాను వచ్చి విశాఖపట్నంలో ఎక్కడపడితే అక్కడ పెద్ద పెద్ద చెట్లు విరిగిపడిపోయాయి. ఆ సమయంలోనే దీపావళి పండుగ వచ్చింది. అయితే పండుగ సందర్భంగా ఎవరైనా

క్రాకర్లు కాలిస్తే, అవి విరిగిపడిన చెట్లమీద పడి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో క్రాకర్లు కాల్చకూడదని ఒక్కమాట చెప్తే, ఒక్కరు కూడా క్రాకర్లు కాల్చకుండా దీపావళి పండుగ జరుపుకున్నారంటే అదీ వారు నాకిచ్చిన గౌరవం.

మ.01.10

అధ్యక్షా, ఆ నమ్మకంతోనే విశాఖపట్టణం సిటీని మరలా రీఫిల్ చేశాము. అయితే ఇక్కడ ఆలోచించాల్సింది, ఆ విషయాలలో అందరికీ కూడా ఒక ఐడియా ఉండాల్సిన అవసరముంది. ఈరోజు మనం ఏం అడుగుతున్నామనే అంశం మీద ఇక్కడుండే గౌరవ సభ్యులకు, రాష్ట్ర ప్రజానీకానికి కూడా ఒక ఆలోచన రావాలి. విభజన చట్టాన్ని ఆరోజు పార్లమెంట్‌లో పాస్ చేశారు. విభజన చట్టం వలన లాభం లేదు, ఇంకా ఇబ్బందులున్నాయనే ఆలోచనతో ఆరోజు రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ, మిగతా పార్టీలు, ప్రతిపక్షంగా ఉన్న అరుణ్‌జైట్లీ గారు, వెంకయ్య నాయుడు గారు గట్టిగా చెప్పారు. హైదరాబాదు నగరం తెలంగాణాకు వెళ్లింది, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుంది, ఆదాయమే లేదు, ఎలా సర్వైవ్ అవుతుందో మీరే చెప్పండని గట్టిగా నిలదీస్తే ఆ సమయంలో ఆనాటి ప్రధానమంత్రి కొన్ని అనౌన్స్‌మెంట్స్ చేశారు. ఆరోజు చేసిన అనౌన్స్‌మెంట్స్‌ను, ఆ రోజు పాస్ చేసిన చట్టాలను చూసిన తరవాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం శాంతించలేదు. ఆందోళనలు చేశారు. ఎప్పుడైతే బిల్ పాస్ చేశారో తరవాత రోజే విత్‌డ్రా చేసుకున్నారు. కాని ఎలక్షన్స్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కాదు కదా, డిపాజిట్స్ కూడా రాకుండా ఓడించారంటే అది వారికున్న కోపం, కసి. ఆ కోపాన్ని తీర్చుకున్నారు. అయితే ఈరోజు ఈ సభలో ఉండే ప్రతిఒక్కరూ ఆలోచించాల్సింది ఏమిటంటే మనం కష్టపడతాము, దానిలో నాకు ఎటువంటి అనుమానం లేదు. ఈ నాలుగు సంవత్సరాలు నేను కష్టపడడం, ప్రజలు సహకరించడం, అధికార యంత్రాంగం కష్టపడడంతో, అందరం కలిసి కష్టపడి పనిచేశాము కాబట్టి చాలావరకు సమస్యల నుండి నిలదొక్కుకోగలిగాము. నేను పూర్తిగా సమస్యలను అధిగమించామని చెప్పలేదు.

నేను ఆరోజు నుండి ఈ రోజు వరకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒకటే కోరాను, విభజన హామీలు నెరవేర్చండి, ఆరోజు రాజ్యసభలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి, అదే సమయంలో దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాలతో సమానంగా మేము పైకి వచ్చేవరకు చేయూతనివ్వండని అడిగాను. నేనడిగింది గొంతెమ్మ కోరికలు కావు. ఆరోజు కేంద్రప్రభుత్వం విభజన చేసింది. ఆ రోజు పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్షంగా బిజెపి ఉన్నది, మిగిలిన పార్టీలు ఉన్నాయి. ఏ పార్లమెంట్ సాక్షిగా విభజన చేశారో హేతుబద్ధత లేకుండా చేశారో, ఆ చట్టాన్ని, ఆ హామీని నిలబెట్టుకుని మళ్లీ మనకు న్యాయం చేయమంటే అది తప్పా అని నేను అడుగుతున్నాను. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను, నేను ఒక్క అంశము కూడా ఎక్కువ అడగడం లేదు. అవసరమైతే రాత్రింబవళ్లు కష్టపడతాము, రాష్ట్రాన్ని రీబిల్డ్ చేస్తాము, ఆ నమ్మకం నాకుంది, చేసి చూపిస్తాము, అందులో అనుమానం లేదు. కాని హక్కులలో మాత్రం ఆరోజు అలా చేసి మరలా బిజెపి వారు కూడా అదేవిధంగా చేస్తే మంచిది కాదు. నష్టపోయిన రాష్ట్రానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే బిజెపితో తెలుగుదేశం పార్టీ పొత్తుపెట్టుకున్నది. రాష్ట్రం చాలా ఇబ్బందులలో ఉంది. ఇబ్బందులలో ఉన్న రాష్ట్రాన్ని

ఆదుకోవాలనే ఉద్దేశంతోనే పొత్తు పెట్టుకున్నాము. ఎన్నికలలో ఆనాటి ప్రధానమంత్రి రాష్ట్ర ప్రజలకు ఒక విశ్వాసం ఇచ్చారు. అల్టిమేట్‌గా 29సార్లు దిల్లీకి తిరిగాను. నేను ఆవేదన పడుతూ అడుగుతున్నది ఎందుకు ఇలా చేస్తున్నారు, ఏంటీ ఈ అన్యాయం, ఆరోజు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తే ఎదిరించాము, అడిగాము, కాని సమాధానం చెప్పకుండా పోయే పరిస్థితి వచ్చింది. ఈరోజు కూడా మరలా బిజెపి ప్రభుత్వం న్యాయం చేస్తుందనుకుంటే న్యాయం చేయకపోగా ఎదురుదాడి చేయడం ఎంతవరకు సబబు అని అడుగుతున్నాను. ఆరోజున ప్రధానమంత్రి విభజన బిల్లు సమయంలో పార్లమెంట్‌లో చెప్పిన విషయాలు మీ ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి వినిపిస్తున్నాను. – I would like to make a few further announcements in this regard. First Announcement Sir.

1. First for the purpose of Central Assistance, Special Category Status will be extended to successor State of Andhra Pradesh comprising 13 districts including the 4 districts of Rayalaseema and 3 districts of North Coastal Andhra for a period of 5 years. This will put the State finances for a firm footing. ఇవన్నీ చేస్తే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వారు స్టేట్‌మెంట్ ఇచ్చారు. అప్పుడు స్పెషల్ స్టేటస్ 5 సంవత్సరాలు కాదు, 10 సంవత్సరాలు కావాలని బిజెపి వారు అడిగారు, వారి ఎలక్షన్ మేనిఫెస్టోలో కూడా పెట్టుకున్నారు. స్టేట్ ఎలక్షన్ మేనిఫెస్టోలో 5 సంవత్సరాలు పెడుతూ, అవసరమైతే మరో 5 సంవత్సరాలు పొడిగిస్తామని బిజెపినే ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టి ఇప్పుడు కాదు అని మమ్మల్ని ఎదురుదాడి చేసే పరిస్థితి వస్తే మంచిది కాదని నేను మీ ద్వారా తెలియజేస్తున్నాను.

2. రెండవ అంశమేమంటే, The Bill already stipulates that the Central Government shall take appropriate fiscal measures including offer of tax incentives to the Successor States in order to promote industrialisation and economic growth in both the States. These incentives will be along the lines extended to some other States.

3. The Bill already provides for a Special Development Package for the backward regions of the Successor State of Andhra Pradesh, in particular for the districts of Rayalaseema and North Coastal Andhra Pradesh. This Development Package will be on the lines of KBK, Koraput, Bolanghir Kalahandi; Special plan in Odisha and Bundelkhand; Special Package in Madhya Pradesh and Uttar Pradesh. ఆరోజు చాలా స్పష్టంగా చెప్పారు. గైడ్‌లైన్స్ ఉన్నాయి. ఇతర రాష్ట్రాలకు ఇచ్చారు, అదే మనకూ ఇవ్వమంటున్నాము.

4. I would like to reassure Hon'ble Members that if any further amendments are needed to facilitate smooth and full rehabilitation resettlement for the Polavaram Project, they will be given effect to at the earliest. Our Government will execute the Polavaram Project. Let there be no doubt about it.

5. The appointed day for the formation of a new State will be so fixed in relation to the notified date so as to enable preparatory work relating to personnel, finance, distribution of assets and liabilities to be completed satisfactorily.

6. The resource gap that may arise in the Successor State of Andhra Pradesh in the first year, especially during the period between appointed day and the acceptance of the 14th Finance Commission recommendations by the Government of India will be compensated in the regular Union Budget for 2014-15. I hope these additional announcements will demonstrate our steadfast commitment to not just the creation of Telangana but also to the continued prosperity and welfare of Seemaandhra.

అదేవిధంగా ఇక్కడ చెప్పింది చూస్తే మొత్తం 18 అంశాలు బిల్లులో ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో 18 అంశాలు పెట్టారు. ప్రత్యేకహోదా గురించి చట్టంలో పెట్టకపోయినా అనౌన్స్‌మెంట్ చేశారు. ఆర్థిక లోటు, పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోను ఏర్పాటు, గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ పెట్రోకెమికల్ కాంప్లెక్స్, రాజధాని నిర్మాణానికి కేంద్ర సహాయం, జాతీయ విద్యాసంస్థలకు నిధులు, నెల్లూరు జిల్లాలో దుగరాజపట్నం పోర్టు నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ శాసనసభ సీట్ల పెంపుదల, పన్నుల విధానంతో తలెత్తిన సమస్యలు, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు, వైజాగ్ – చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖపట్టణం, విజయవాడ నగరాలలో మెట్రోరైల్ నిర్మాణం, నూతన రాజధానికి రాపిడ్ రైల్ రోడ్ కన్క్టివిటీ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఆర్థికసహాయమని, అదేవిధంగా షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో ఉన్న సమస్యల పరిష్కారం, గ్రే హౌండ్స్ సెంటర్ ఏర్పాటు, ఇటువంటివి మొత్తం 18 అంశాలు పెట్టారు.

మ.1.20

అధ్యక్షా, ఇక్కడ ఒకసారి చూస్తే, ఈ ప్రత్యేక హోదాకు సంబంధించి ఒక లెటర్ కూడా ప్రాసెస్ చేసి ఈ కాన్సెప్ట్‌ని కేబినెట్‌కి తీసుకువెళ్లారు. The cabinet further directed the Planning Commission to implement the decision to grant special category status for a period of 5years to the success or state of Andhra Pradesh comprising 13 districts. ఇది చేసి ప్లానింగ్ కమీషన్‌కు కూడా పంపించారు. ప్లానింగ్ కమీషన్ దానిని అమలు చేయకుండా కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టి, నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కి పంపించే పరిస్థితి వచ్చింది. వాళ్ల మేనిఫెస్టోలో గనుక చూస్తే, కేంద్ర సహాయంలో భాగంగా ఐదేళ్లపాటు విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, బిజెపి ప్రభుత్వం ఈ హోదాను మరో ఐదు సంవత్సరాలు పొడిగిస్తుందని క్లియర్ కట్‌గా పెట్టారు. నేను ఈ రోజు అడిగేది, మనందరికీ బాధ్యత ఉందా, లేదా? నేను కేంద్రం వద్దకు 29సార్లు వెళ్లిన తరువాత, మొన్న జరిగిన పరిణామాలు చూస్తే, అసెంబ్లీలో రీ–ఆర్గనైజేషన్ బిల్లు చదివి వినిపించాము. నేను ఎవరినీ విమర్శించలేదు. ఆ రోజు పార్లమెంటులో చెప్పిన విషయాలు, ఇచ్చిన హామీలు చదివి వినిపించాను. ఇవన్నీ అమలు చేయమని డిమాండ్ చేశాము. ఎగ్జాక్ట్‌గా ఐదున్నర గంటలకు అరుణ్‌జైట్లీ గారు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి మేము ప్రత్యేకహోదా ఇవ్వడం లేదు. మీకు ఒక SPV ఇస్తాము, మీరు ఏదో పెట్టుకోండి. అంతేకాకుండా స్పెషల్ ఇన్సెన్‌టివ్స్ ఇవ్వడానికి కుదరదని నిర్మొహమాటంగా వారు చెప్పారు. విధిలేని పరిస్థితిలో మేము మళ్లీ ఒకసారి ప్రధానమంత్రిగారికి చెప్పి మా పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు రాజీనామా చేద్దామని వారి కోసం ట్రై చేసి, వారు అందుబాటులో లేరని, ఇక లాభం

లేదు, మనం అన్ని ప్రయత్నాలు చేశాము, ఇంక మనం ఏ మాత్రం వెనక్కి పోవడం కరెక్టు కాదని, ఒక పర్పస్ కోసం సెంట్రల్ కేబినెట్‌లో ఉన్న మా ఇద్దరు మంత్రులు 11 గంటలకు రాజీనామా చేస్తున్నామని చెప్పి రాజీనామా చేశారు. అంటే పదవులకు ఆశ పడకుండా నీతి, నిజాయతీతో రాజీనామా చేసిన పార్టీ, మా తెలుగుదేశం పార్టీ.

(సభ్యుల హర్షధ్వానాలు)

కొంతమందికి కొన్ని ఆలోచనలు ఉన్నాయి. ఇప్పుడే కాదు, వాజ్‌పేయి గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మా ఎంపీలు 29 మంది ఉన్నారు, బిజెపి పార్టీ తరఫున 6 మంది సభ్యులు సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో గెలిచారు. మొత్తం 35 మంది ఉన్నాము. ఆరోజు కూడా ప్రధానమంత్రి గారు కేబినెట్‌లో చేరమని కోరితే కేబినెట్ మాకు అవసరం లేదు, మీరు దేశానికి బాగా మేలు చేయండి, మా రాష్ట్ర సమస్యలు పరిష్కారం చేయండని చెప్పాను. నేను అడిగి ఉంటే ఆనాడు కనీసం 6,7 మంత్రి పదవులు ఇచ్చేవారు. మంత్రి పదవులకు ఆశ పడకుండా కేంద్రానికి అన్ కండిషనల్‌గా ఆరున్నర సంవత్సరాలు ఒక్క సమస్యను కూడా సృష్టించకుండా సపోర్ట్ చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఇప్పుడు కూడా చూడండి, మేము డీమానటైజేషన్‌కు, జిఎస్‌టికి సపోర్ట్ చేశాము. మేము ఎక్కడా ఇబ్బందులు క్రియేట్ చేయలేదు. ఏ గౌరవ పదవినో, ఏ కార్పొరేషన్ ఛైర్మన్ పదవినో, ఏ డైరెక్టర్ పదవినో నేను ఎప్పుడూ అడుగలేదు. నేను అడిగింది ఈ రాష్ట్ర ప్రయోజనాలు. విభజనచట్టం ఉంది, మీరు ఇచ్చిన హామీలు ఉన్నాయి. ఇవి నెరవేర్చమని 29సార్లు కేంద్రానికి వెళ్లాను తప్ప, నేను ఒక్కసారి కూడా ఎక్కడా డీవియేట్ అవ్వలేదు. ఆరోజు మీరు (కేంద్రాన్ని ఉద్దేశించి) స్పెషల్ అసిస్టెన్స్ మెజర్ అన్నారు. ఎవ్వరికీ ఇవ్వలేదు అన్నారు. ఇవ్వలేదని చెప్పి నార్త్‌ఈస్టర్న్ స్టేట్స్‌కి ఇచ్చారు. అక్కడ 90:10 నిష్పత్తితో డైరెక్ట్‌గా ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఎందుకు మీరు ఈ రాష్ట్రానికి కూడా ఇవ్వకూడదు. మీరు ఈ నాలుగు సంవత్సరాలు 90:10 రేషియోలో ఇచ్చి ఉంటే, ఈరోజు రాష్ట్రానికి సెంట్రల్ స్పాన్సర్ స్కీములో సంవత్సరానికి 3,000 నుంచి 4,000కోట్ల రూపాయలు మిగిలేవి. అవి ఖర్చు పెట్టుకుంటే ఇంకా ఎక్కువ అభివృద్ధి సాధించడానికి వీలుండేది. అలా చేయనందువల్లే ఈ రోజు ఈ సమస్యలు తలెత్తాయి. ఈ రోజు ప్రజలందరూ కోరుకునే ప్రత్యేకహోదా, ఎక్కడ కూడా డీవియేషన్ కాలేదు. మన గవర్నర్ ప్రసంగంలో కూడా పెట్టాము. మేము కూడా తెప్పిస్తామని, మీరు చెబుతున్నారు. ఇండియా టుడే ఇంటర్వ్యూకి వెళ్లి చివరకు విజయసాయి రెడ్డి కూడా చెప్పారు, మాకు చాలా నమ్మకం ఉంది, ప్రధానమంత్రి గారే ఇస్తారు, ఆయనే ఇవ్వాలి, కాంగ్రెస్ పార్టీపైన నమ్మకం లేదని చెప్పారు. ఏవిధంగా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారంటే, ప్రధానమంత్రిపైన నమ్మకం ఉందని అంటూనే వాళ్లు అవిశ్వాస తీర్మానం పెడతారు, ఆ అవిశ్వాస తీర్మానానికి మేము సంతకం పెట్టాలి. ప్రధానమంత్రి పైన నమ్మకం ఉంది, కానీ వారి ఎంపీలు రాజీనామా చేస్తారు, మేము కూడా రాజీనామా చేయాలి అని వైయస్ఆర్‌సిపి అంటున్నది. మేము అలా కాదు అధ్యక్షా. 35 సంవత్సరాలుగా మా పార్టీ రాష్ట్ర ప్రయోజనాలను ఎంత మేర కాపాడాలో అంతమేర

కాపాడే పార్టీ. ఎప్పుడు రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకుంటామో వేరే వాళ్లు చెబితే చేసేది కాదు, మా స్వతహాగా ఈ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి ఎప్పటికప్పుడు తగిన నిర్ణయం తీసుకుంటాము.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఇక్కడ నాకేమీ వ్యక్తిగత ద్వేషం లేదు. ఎవరి మీద కోపం లేదు. నాకు ఇంకొక ఆలోచన కూడా లేదు. ఒకటే ఆలోచన రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవాలి. ఇప్పుడే కొంతమంది ఎమ్మెల్యేలు కూడా కష్టపడతామని చెప్పారు. ఆరోజు హైదరాబాదులో అన్నీ వచ్చాయంటే కష్టపడ్డాము. తొలి రోజులలో జీతాలు ఇవ్వలేకపోయాము. మీకు కూడా తెలసి ఉంటుది. అధ్యక్షా, ఆనాడు అంటే 1999వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వన్ని ఏర్పాటు చేసినప్పుడు మూడు నెలలకొకసారి జీతాలు కూడా ఇచ్చాము. మా దగ్గర డబ్బులు లేవని చెప్పాము. ఆర్థికవ్యవస్థ దివాళా తీసింది, మన దగ్గర డబ్బులు లేవని కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. అందులో భాగంగా రెండు రూపాయలకు కేజీ బియ్యాన్ని మూడున్నర రూపాయలు చేశాము. కరెంటు ఛార్జీలు రూ.50 నుంచి రూ.150 చేశాము. కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రొవిజన్ ఉంటే దానిని కూడా లిబరలైజ్ చేశాము. అయినా కూడా 1999లో కూడా బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచామంటే ప్రజలకు ఉండే విశ్వాసం అది. దానితో ముందుకు వెళ్లాం.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఇప్పుడు కూడా కష్టపడతాము. సంపద సృష్టిస్తాము. అందుకనే నేను మొన్నటి నుంచి చెబుతున్నాను, ఈ ప్రభుత్వానికి ఒక విశ్వసనీయత ఉంది. ఏవైతే ఫలితాలు వస్తాయని నేను చెప్పానో అవి కూడా మీకు చూపిస్తాను. ఏవిధంగా చేశాము, ఏవిధంగా ఫలితాలు వచ్చాయనేది. కానీ, ఈ సభద్వారా రాష్ట్ర ప్రజానీకం తరపున అడుగుతున్నాను. ఇది మన హక్కు అవునా, కాదా? మనకు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రానికి ఉందా, లేదా? 60 సంవత్సరాలు హైదరాబాదులో ఉన్నాము. హైదరాబాదును నేనే అభివృద్ధి చేశాను. ఈరోజు అక్కడ ఏ అభివృద్ధి తీసుకున్నా, ప్రతియొక్క అభివృద్ధి మీద నా ముద్ర శాశ్వతంగా ఉంటుంది. ఆ ముద్రని ఎవరూ తీసేయలేరు. ఔటర్ రింగు రోడ్డుకి వెళ్లినా, ఎయిర్‌పోర్టుకి వెళ్లినా, ఐఎస్‌బికి వచ్చినా, సైబరాబాదు చూసినా ఈరోజు ప్రపంచంలోనే హైదరాబాదు ఒక ఆర్థిక నగరంగా, నాలెడ్జ్ హబ్‌గా ఉందంటే ఆరోజు నేను చేసిన శ్రమ, ప్రతి ఒక్క అడుగులో నేను కష్టపడిన విధానము కనబడుతుంది.

అయితే, ఈ రోజు బాధంతా ఏమంటే, విభజన చేసినప్పుడు ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా, ఒంటెద్దు పోకడతో వెళ్లారు. అరవై ఏళ్లు కష్టపడినప్పుడు ఎవరికైనా బాధ ఉంటుంది. కష్టార్జితం అంతా పోయి, నెత్తిన అప్పు పెట్టుకుని ఇక్కడకు వచ్చామంటే ఎంత ఆవేదన ఉంటుంది, ఎంత బాధ ఉంటుంది, ఏవిధంగా ఆలోచిస్తారు? మీరు కూడా 50 ఏళ్లు ఓ కుటుంబంలో ఉండి, మీ తండ్రో, మీ అన్నో, మరొకరో కట్టుబట్టలతో మిమ్మల్ని బయటకు పంపించి మీ ఆస్తులు ఆయన తీసుకుంటే బాధ పడరా? ఒక కుటుంబం కావచ్చు, ఒక కంపెనీ కావచ్చు, ఒక రాష్ట్రం కావచ్చు నేను ఆ విషయమే అడుగుతున్నాను. ఎవరి తరపున అడుగుతున్నాను? రాష్ట్ర ప్రజానీకం తరపున

అడుగుతున్నాను. నా స్వార్థం కోసం అడిగానా? నాకేమైనా లైసెన్సు కావాలన్నానా? పదవులు కావాలన్నానా? అవేమీ నేను అడుగలేదే. నేను అడిగేదేమిటంటే, రాష్ట్రానికి న్యాయం చేయండి. రాష్ట్రంలో ఒక బాధాకర వాతావరణం ఉంది. కేంద్ర నాయకత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఆరోజు జరిగిన అన్యాయం, అవమానం అనునిత్యం వెంటాడుతూ ఉంది. అలాంటప్పుడు ఎవరు ఎలాంటి చిన్న చూపు చూసినా దానివల్ల బాధ ఎక్కువ ఉంటుంది, ఆవేశం ఎక్కువ ఉంటుంది, ఆవేదన ఉంటుంది, కోపం ఉంటుంది. ఆ విషయం మనం గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. మోసపోయినప్పుడు దగ్గరకు చేర్చి, వాళ్లను కన్విన్స్ చేయాలి. అవసరమైతే ఒక పని చేయడం కాదు. పనిచేయడం ఎంత ముఖ్యమో వాళ్లకు ఒక నమ్మకం కూడా కలిగించాలి. నేను ఇక్కడ ఉన్న రాజకీయపార్టీలను అడుగుతున్నాను, దేశంలో అనేక రాజకీయాలను నేను చూశాను.

మ.01.30

అధ్యక్షా, ఈ దేశంలో మొట్టమొదటిసారిగా ఎన్.టి.రామారావు గారు తెలుగుదేశం పార్టీని పెట్టి, జాతీయ స్థాయిలో అపోజిషన్ పార్టీలతో కాన్ఫరెన్స్‌లు పెట్టి, ఆరోజున ఇక్కడ ఉండే నేషనల్ ఫ్రంట్‌ను పెట్టడం జరిగింది. ఇక్కడ ఉండే లెఫ్ట్, రైట్ పార్టీలలో కూడా లెఫ్ట్ పార్టీ, బీజేపి, జనతా పార్టీ మిగిలిన అన్ని పార్టీలను కూడా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడే విధంగా అన్నింటిని ఒక త్రాటి పైకి తీసుకు వచ్చిన నాయకుడు ఎన్.టి.రామారావు గారు. ఆ ఘనత ఆయనకే దక్కుతుంది.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఆయన అక్కడి నుంచే బీజం వేశారు. అప్పటి వరకు ఒకటే పార్టీ. అక్కడ నుంచి మేము యుఎఫ్ (యునైటెడ్ ఫ్రంట్) పెట్టాము. ఇద్దరు ప్రధాన మంత్రులు వచ్చారు. తరువాత ఎన్‌డీఏకి సపోర్టు చేశాము. తెలుగుదేశం పార్టీ అపోజిషన్ పార్టీగా కూడా పనిచేశాము. ఢిల్లీలో ఆ విషయాన్ని కూడా మీరందరూ గుర్తుపెట్టుకోవాలి. అప్పుడు తెలుగుదేశం పార్టీలో దాదాపు 35 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఆరోజున మేజర్ అపోజిషన్ పార్టీగా తెలుగుదేశం పార్టీ ఉంది. ఆరోజున బీజేపీకి రెండు స్థానాలే ఉన్నాయి. అందులో ఒక స్థానం మనమే ఇచ్చాము. అందులో హన్మకొండ, జంగారెడ్డి, ఇంకొక ప్రాంతంలో శ్రీ వాజ్‌పేయ్‌గారు ఇద్దరు గెలిచారు. అన్నిచోట్లా రాజకీయాలు ఉంటాయి. అది కాదు ఇష్యూ. నేను దాని గురించి మాట్లాడడం లేదు. ఈరోజున ఉన్న సమస్య అంతా మనకు న్యాయం చేస్తున్నారా లేదా? కేంద్రప్రభుత్వం వారు మన రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని అంటున్నాము.

ఈరోజున ఇంకొక ప్రక్క అధ్యక్షా – ఆర్థిక లోటు. ఇందులో ఈ ఆర్థిక లోటు ఏమిటి? దీనికి ఇంత డిస్కషన్ చేస్తున్నారు. ఈరోజున ఆర్థిక లోటు దాదాపు రూ.16,072కోట్లు ఉందన్నారు. ఆ రోజున మన దగ్గర నుంచి ఒక గవర్నర్ పరిపాలన ఉంది కాబట్టి, గవర్నరుకు పంపించారు. అదేమాదిరిగా వీళ్ళు మనకు మొదటి సంవత్సరంలో 2014-15 సంవత్సరానికి సంబంధించి రూ.2,303కోట్లు ఇచ్చారు. కేంద్రం ఇవ్వవలసింది 2014-15

సంవత్సరానికి ఇచ్చారు. ఇప్పుడు 2018వ సంవత్సరానికి వచ్చాము. అయినప్పటికీ వీళ్ళు 2014-15 సంవత్సరానికి రూ.2,303కోట్లు, 2015-16వ సంవత్సరంలో - రూ.500కోట్లు, 2016-17వ సంవత్సరంలో రూ.1176కోట్లు, మొత్తం మీద రూ.3,979కోట్లు ఇచ్చారు. అంటే, ఇప్పటివరకు మనం కేంద్రాన్ని రూ.16,000కోట్లు అడిగాము. ఇందులో వీళ్ళు ఏం చేశారంటే, వ్యవసాయ రంగానికి సంబంధించి ఋణవిముక్తి కోసం రూ.3,068కోట్లు ఇచ్చాము. సాధికార సంస్థకు రూ.4,000కోట్లు, దాదాపుగా రూ.7,000కోట్లు కేటాయించాము. కానీ, మన దగ్గర ఉండే డబ్బులను మనం అడ్జస్ట్ చేసుకుని మిగిలిన వాటికి సర్దడం జరిగింది. ఈ డబ్బులు ఇక్కడ అడ్జస్ట్ చేసుకున్న తరువాత పిఆర్‌సి డబ్బులను, ఖర్చులను డెఫర్ చేశాము. ఆరోజున మనకున్న ఖర్చులన్నింటిని డెఫర్ చేసుకుని, ఒక ప్రక్కన వీళ్ళు చూపించిన లెక్కలను కేంద్రానికి చూపిస్తే - లోన్‌వైవర్ క్రింద రూ.7,069కోట్లుగా చేయడం జరిగింది. ఓఏపి - రూ.3,390 కోట్లు, **financial assistance to DISCOMS Rs.**500 కోట్లు ఇచ్చారు. ఇప్పటివరకూ దాదాపు రూ.11,960 కోట్లు పోయింది. ఇక మనకు వచ్చేది మొత్తం రూ.4,117కోట్లు. ఈ మూడు సంవత్సరాలలో మనకు ఇచ్చింది రూ.3,979 కోట్లు. ఇంకా మీకు ఇవ్వవలసింది రూ.138కోట్లు అని తేల్చేశారు. పిఆర్‌సి రూ.3,920 కోట్లు మనం వాళ్ళకు ఇవ్వాలి. ట్రెజరీలో బిల్లులు మనం ఆ సంవత్సరంలో పే చేయలేదు. వాటికి దాదాపు రూ.2,606 కోట్లు చెల్లించాలి. పిఏఓలో రూ.117 కోట్లు పే చేయాలి. డిడబ్ల్యుఏ లో రూ.480 కోట్లు పే చేయాలి. పెన్షన్లలో కూడా డబ్బులు తక్కువ వేసి ఒక్కొక్క నెలకు రూ.93కోట్లు, రూ.90 కోట్ల వరకు వేసి, మొత్తం రూ.200ల వరకు పింఛన్లు ఇస్తామంటే, మొన్న అవి కూడా లెక్క వేసుకోకుండా మొత్తం రెండు నెలలే పెట్టి 10 నెలలు లెక్క వేయకుండా మిగిలినవి వదిలిపెట్టారు. మనం ఆ లెక్కలు వేసుకున్న దాదాపు రూ.1,985 కోట్ల వరకు వస్తుంది. జెంటిల్‌మెన్‌లు లెక్కలు వేసి దాదాపుగా రూ.7,500 కోట్ల వరకు ఇస్తామన్నారు. ఇప్పుడేమో మీకు ఇచ్చేది కేవలం రూ.500 కోట్లే అని కేంద్ర మంత్రి చెప్పారు. ఇప్పుడు రూ.135 కోట్లు ఒక లెక్క , కాదంటే 1500 కోట్లు అని నిర్మొహమాటంగా చెప్పే పరిస్థితిలో ఉన్నారంటే, ఏ విధంగా అర్థం చేసుకోవాలో మనం ఆలోచించవలసిన అవసరం ఉంది. నేను అడిగేదే సిఏజి, గవర్నరు మళ్ళా రాష్ట్రప్రభుత్వం కూడా చెప్పింది. ప్రభుత్వానికి ఇన్ని లెక్కలు చెప్పినా అక్కడ కొంతమంది కావాలని లెక్కలు ఏదో ఒకటి ఇస్తే, కావాలని ఆ లెక్కలే పెట్టుకుని మనకు డబ్బులు ఇవ్వం అనడం ఏమాత్రం సబబో వారే ఆలోచించవలసి ఉంది.

ఇంకొక ప్రక్క అధ్యక్షా, ఇక్కడికే వచ్చినప్పుడు కొన్ని చూస్తే, కొంత బాధ కూడా వేస్తోంది. ఒక ప్రక్క పోలవరం ప్రాజెక్టు. దీనిని మీరు ఒకసారి చూసినప్పుడు **last cabinet of Manmohan Singh** ఈ పోలవరం ప్రాజెక్టు గురించి చర్చించారు. అందులో ఈ పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా తీసుకుంటున్నామని, దీనికి మొత్తం మేమే ఖర్చుపెడతామని 2013వ సంవత్సరంలో ఈ ప్రాజెక్టును మేము పాలసీగా ఆర్ అండ్ ఆర్, లాండ్ అక్విజేషన్ క్రింద ఈ రెండూ తీసుకువచ్చాము కాబట్టి, తప్పనిసరిగా ప్రాజెక్టు కాస్ట్ పెరుగుతుంది. అలాగే, భూసేకరణ ధరలు కూడా పెరుగుతాయి. తద్వారా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు కూడా పెరుగుతాయి. వాటెని పూర్తిగా మేమే భరిస్తాం అని

ఆరోజు చాలా స్పష్టంగా కేంద్రం నిర్ణయం తీసుకోవడం జరిగింది. తదుపరి ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన రాష్ట్రంలో చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే నేను ప్రధాన మంత్రిగారి దగ్గరకు వెళ్ళి రిప్రెజెంటేషన్లు ఇచ్చి, ఆయనతో మా రాష్ట్రానికి చాలా అన్యాయం జరుగుతోందని, ప్రజలలో ఆవేదన ఉంది కాబట్టి మీరు తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా వారిని కోరితే, వాళ్ళు దానిని నీతిఆయోగ్‌కి ఇచ్చారు.

అధ్యక్షా, నీతిఆయోగ్ దానిని గురించి ఆలోచించి ఈ ప్రాజెక్టుకు సత్వరమే పనులు కావాలంటే, రాష్ట్రప్రభుత్వం చేస్తేనే అవుతాయి. దిల్లీ నుంచి కాదు. ఇంతవరకు ఏ ప్రాజెక్టు పనులు కూడా పూర్తి కావడం లేదు. కాబట్టి, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టును రాష్ట్రాలకు ఇవ్వాలని వాళ్ళు రికమెండ్ చేయడం జరిగింది. వాటిని మళ్ళా సెంట్రల్ కేబినెట్‌లో పెట్టడం జరిగింది. దానిపైన వాళ్ళు విల్లింగ్‌నెస్ ఇస్తే వాటిని మనం పూర్తిచేస్తామని చెపితే, ఆ ప్రాజెక్టును కేంద్రం మనకు ఇచ్చారు. ఆరోజున ఏం పెట్టారు అధ్యక్షా – ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధులు మేమే ఇస్తామని అన్నారు. అదేమాదిరిగా ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా తీసుకోక మునుపు దాదాపుగా మీరు రూ.5,349కోట్లు ఖర్చు పెట్టారు కాబట్టి, దీనిని మీ వాటా క్రింద పెడతామని, మిగిలిన డబ్బులను మేము ఇస్తామని ఆ రోజున వీరు నిర్ణయం చేసే పరిస్థితికి వచ్చారు. మొత్తం రూ.5,135కోట్లు అన్నారు. సుమారుగా ఆ డబ్బులను కూడా ఇస్తామని ఒప్పుకున్నారు. అదే మాదిరిగా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్ళా ఇంకొక కండీషన్ కూడా పెట్టారు. అది కూడా 2014 ఎస్టిమేట్స్ ప్రకారమే ఇస్తామని కండీషన్ పెట్టారు. ఎస్టిమేట్స్ ఎంత పెరిగితే, అంటే 10 సంవత్సరాలు పెరిగితే 10 ఏళ్ళ ఎస్టిమేట్స్ వస్తాయి తప్ప మిగిలినవి కాదు. అవి కూడా పెట్టారు.

అధ్యక్షా, ఈనాడు వాళ్ళు రూ.5,349కోట్లు మనకు ఇచ్చారు. తేదీల వారీగా నా దగ్గర అన్ని వివరాలు ఉన్నాయి. 06-03-2018వ సంవత్సరంలో కూడా రూ.417కోట్లు ఇచ్చారు. అయితే, ఈరోజున మనం అదనంగా ఖర్చుపెట్టింది కాకుండా దాదాపు రూ.2,568కోట్లు ఈ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి, ఖర్చు పెట్టి ఆ డబ్బులు మనకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలి కాబట్టి, ఈ విషయాన్ని మీరందరూ గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. దీనికి యుటిలైజేషన్ సర్టిఫికేట్లుసల కూడా ఇచ్చాము. మొన్న మొన్న కొన్ని యూసీలు ఇవ్వలేదని కొంతమంది మాట్లాడారు. అన్నీ యూసీలు పంపించాము. ఎక్కడా యూసీలు పంపించకుండా ఉన్నది లేదు. అన్నింటిని సరైన ఫార్మాట్‌లోనే పంపించాము. అదేమాదిరిగా కేంద్రానికి ఎప్పటికప్పుడు ఇవన్నీ రిపీటెడ్‌గా వస్తున్నాయని అన్నారు. ఎందుకంటే పిపిఏ ఉంది, దానికి మనం అన్నీ ఇస్తాము. పిపిఏ వీటన్నింటిని దిల్లీకి తీసుకువెళతారు కాబట్టి వాళ్ళు రికమెండ్ చేసి మొత్తం డబ్బులు ఇచ్చే పరిస్థితి మనకు ఉంది. కాబట్టి ఈ ప్రాజెక్టులకు సంబంధించి మనం ఎంత అవస్థ పడుతున్నామో అందరికీ తెలుసు. ఆరోజుకు, ఈ రోజుకు ఈ పోలవరం ప్రాజెక్టు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి వంటిది. ఈ ప్రాజెక్టును మనం ఎట్టి పరిస్థితులలోనైనా పూర్తిచేసుకోవాలి. కేంద్రప్రభుత్వం కూడా ఈ విషయం చెప్పింది. అయితే, ఈ ప్రాజెక్టు 2018వ సంవత్సరానికే పూర్తి అవుతుందని అనుకున్నాము. కానీ, కొన్ని కారణాల వలన పోస్ట్‌పోన్ అయింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్-1లో రూ.16,000కోట్లు ఖర్చు అయింది.

డిపిఆర్-2లో దాదాపు రూ.58,000కోట్లు అయ్యింది. అందులో దాదాపు రూ.4,000కోట్లు పవర్ ప్రాజెక్టుకు వెళితే మిగిలిన రూ.54,000కోట్లు దీనికి ఖర్చు అవుతుంది. ఇందులో రూ.2,900కోట్లు ఆర్ అండ్ ఆర్ అలాగే, లాండ్ అక్విజేషన్‌కి ఉంటే అది ఇప్పుడు రూ.32,000కోట్లు అయింది. ఇది మన చట్టం కాదు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన చట్టమే ఇది. ఆ చట్ట ప్రకారం మీరు అక్కడ ఉండే గిరిజనులకు ఇస్తారు. అందుకని ఈరోజు ఈ ఖర్చులు కూడా బాగా పెరిగే పరిస్థితి వచ్చింది. ఇంకా ఆలస్యం చేసినట్లయితే, రోజురోజుకు రీహాబిలిటేషన్ కానీ, లేకపోతే భూసేకరణ ఖర్చులు పెరుగుతాయి కానీ, తగ్గే పరిస్థితులు ఉండవు.

అధ్యక్షా, మరొక ప్రక్క చూసినట్లయితే, మనం కేంద్రానికి డీపిఆర్ మరియు యుటిలైజేషన్ సర్టిఫికేట్లను అన్నింటిని పంపించాము. మీరు ఒకసారి కేంద్రప్రభుత్వ ధోరణిని గమనిస్తే, వాళ్ళు ఇంకా పంపించలేదని మాట్లాడుతున్నారు. 2014-15, 2015-16, 2016-17 సంవత్సరాలకు దాదాపుగా రూ.1582.64కోట్లకు గాను, రూ.1500కోట్లు ఫైనాన్షియల్ ఫిజికల్ ప్రోగ్రెస్‌ను, సంవత్సరాల వారీగా క్యాపిటల్ సిటీకి సంబంధించి నివేదికలను పంపించాము. దీనికి acknowledge నీతిఆయోగ్ వారే చేశారు.

మ.01.40

The Utilisation certificates forwarded by the State Government is in proper format as per General Financial Rule 2012(1) of GFR 2005 form 19(A) of GFR as prescribed by the Ministry of Finance. The Andhra Pradesh Capital Region Development Authority (CRDA) Government of Andhra Pradesh also submitted detailed project report on Amaravati Government Complex, Capital City of Amaravati. ఇవన్నీ పంపిస్తే వాళ్లు రిపోర్ట్సు పంపలేదంటారు. లేకపోతే అసలు ప్రాజెక్టు పంపలేదంటారు. Utilisation Certificates పంపలేదంటారు. ఇదెక్కడ న్యాయం? ఇవన్నీ ఒక్కసారి చూస్తే storm water drainage కోసం, comprehensive underground drainage కోసం ఇచ్చిన నిధులతో గుంటూరులో ఎప్పటికప్పుడు పనులు అవుతుంటే దీనికి కూడా ఎప్పటికప్పుడు ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కన్నబాబు Utilisation certificates పంపించారు.

అధ్యక్షా, ఇదొక ఉదాహరణ Utilisation certificates have been furnished by the Government of Andhra Pradesh for the total amount of Rs.893/-crores so far against total releases Rs.1,050crores under Special Development Package. This includes Utilisation Certificates submitted vide reference 1st cited, for an amount of Rs.123.08crores third spell. UCs for additional amount Rs.53.31crore are furnished herewith fourth spell. Thus, making the total amount for which UCs furnished is Rs.946.46crores.

అధ్యక్షా, జిల్లాల వారీగా అన్నీ పంపిస్తే వారు కూడా ఒప్పుకుని నిధులు కూడా విడుదల చేశారు. తేదీ.9.2.2015న నిధులు విడుదల చేసిన తరువాత రూ.350కోట్లు మన ఖాతాకు వచ్చింది. ఎంత బాధాకరం అంటే 15.2.2016న ఆ డబ్బులను మరలా వెనుకకు తీసుకున్నారు. మన ఖాతాకు వచ్చిన డబ్బులకు Utilisation

Certificates పంపించిన తరువాత అధనంగా సంవత్సరానికి 50కోట్లు చొప్పున జిల్లాకు ఇస్తారు. ఏడు జిల్లాలకు రూ.350కోట్లు విడుదల చేసిన తరువాత పిఎంవో పర్మిషన్ లేదని మరలా వారు adjust చేసుకునే పరిస్థితికి వచ్చారంటే ఏవిధంగా చెప్పాలని అడుగుతున్నాను. అప్పటికి ఈ గొడవలు కూడా లేవు. గొడవలు లేనప్పుడే వారు ఈ పనులు చేశారంటే ఏవిధంగా కష్టపెడుతున్నారో దీనిని బట్టి అర్థం అవుతుంది. ఈరోజు బిజెపి చెప్పిన దానిని బట్టి చూస్తే మొత్తం రెవెన్యూ డెఫిసిట్‌కు Utilisation Certificates అవసరం లేదు. రూ.3,979కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఇంకా ఇవ్వాల్సినవి రూ.16,000కోట్లు, పోలవరానికి రూ.5,363కోట్లు ఇచ్చారు. దీనికి Utilisation Certificates అవసరం లేదు. Polavaram Project Authority వారే చేస్తారు. వారికి పంపిస్తే వారు బిల్లులు ఇస్తారు. ఇంకా దాదాపుగా రూ.2,600కోట్లు ఇవ్వాలి. అమరావతి రాజధానికి రూ.1500కోట్లు, విజయవాడ, గుంటూరుకు రూ.1,000కోట్లు, వెనుకబడిన ప్రాంతాలకు గాను ఇచ్చిన రూ.1050కోట్లకు రూ.962కోట్లకు Utilisation certificates పంపించాము. ఇవన్నీ పంపిస్తే Utilisation Certificates పంపించలేదని అంటున్నారు. అకౌంట్స్ ఇవ్వలేదని నెపం పెట్టడం ఏమాత్రం సబబు అని అడుగుతున్నాను.

అధ్యక్షా, ఇవి కాకుండా మిగిలిన ముఖ్యమైన నాల్గవ విషయం, మనం ఆ రోజు విభజన చట్టంలో పెట్టినటువంటిది రైల్వే జోన్. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క రైల్వే జోన్ లేదు. రైల్వే జోన్ ఇమ్మని అడుగుతున్నాము. విశాఖపట్టణానికి ఎప్పుడో నిర్ణయించాము. కమిటీల మీద కమిటీలు వేశారు. ఎందుకు చేయలేకపోయారు ? ఎన్నో సార్లు అడిగాము. రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ 4 రైల్వే డివిజన్‌లు ఉన్నాయి. ఇవన్నీ ఉండి కమిటీలు వేసి కూడా ఇంత వరకూ రైల్వే జోన్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. Greenfield Crude Oil Refinery, Petro Chemical Complex, crockery complex ఇవన్నీ పెడతామన్నారు. ఇది HPCL, GAIL తో ఒప్పందం చేసుకుని రెండూ చేస్తామని చెప్పారు. వీటి కోసం నేను అయితే 10సార్లు తిరిగాను. IRR క్రింద వేరే స్టేట్స్‌కి చెందకుండా మన దానిలో పెట్టి 14శాతం ఇవ్వమంటారు, 12శాతం ఇవ్వమంటారు. ఇప్పుడే మన దగ్గర డబ్బులు లేవు. దీనికి కాకుండా ఈ ప్రాజెక్టు వస్తే ఇంకా ఎక్కువ ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఎంత ఆదాయం వస్తుందంటే 14శాతం IRR క్రింద ఇస్తే మనం రూ.5,615కోట్లు ఇవ్వవలసి ఉండేవి. అదే విధంగా దీని వల్ల గవర్నమెంటు ఆఫ్ ఇండియాకు రూ.1750కోట్లు ఆదాయం వస్తుంది. రూ.350కోట్లు CGST క్రింద, IGST క్రింద రూ.1400కోట్లు వస్తుంది. అంటే ఇంకొక ప్రక్క రూ.6,500కోట్లు Foreign exchange కూడా సేవ్ అవుతుంది. ప్రభుత్వానికి ఇంత లాభాలు ఉన్నప్పుడు కనీసం ఒక పద్ధతి ప్రకారం వారు చేయాలని ఆలోచించకుండా మనవారినే చేయమనడం ఎక్కడ సబబు అని అడుగుతున్నాను. ఇంకొక ప్రక్క ఇప్పటికీ కూడా దాని గురించి నిర్ణయం తీసుకునే పరిస్థితులలో వారు లేరు. అమరావతి గురించి ప్రధానమంత్రిగారు తిరుపతిలో నన్ను చూపించి చెప్పారు. బాబు గారికి బాగా అనుభవం ఉంది. హైదరాబాదులో బ్రహ్మాండంగా కట్టారు. ఆ రోజు Brownfield సిటీ కట్టాము. హైదరాబాదు, సికింద్రాబాదు రెండు సిటీలు ఉంటే సైబరాబాదును కలిపాము. ఈరోజు మనం గ్రీన్ ఫీల్డ్ సిటీ కడుతున్నాము. ఒక విధంగా చెప్పాలంటే

మనమంతా ఇక్కడ కూర్చుని అసెంబ్లీ, కౌన్సిల్ పెట్టుకున్నామంటే దానికి కారణం ఇక్కడ రైతాంగం చూపించిన చొరవ, వారు చూపించిన ఉదారత.

(సభ్యుల హర్షధ్వానాలు)

అధ్యక్షా, నేను పిలుపు ఇస్తే 33,000ఎకరాలు, రూ.40,000కోట్లు వాల్యు చేసే భూమిని ఒక్క మాట మాట్లాడకుండా మాకు లాభం వస్తుంది, మీ మాట మీద మాకు విశ్వాసం ఉంది. మేము ఒప్పుకుంటున్నామని రైతులు భూములు ఇచ్చారు. దీని వలన ఎక్కువ ఆదాయం గవర్నమెంటు ఆఫ్ ఇండియాకు వస్తుంది. పన్నులు కడతాము. ఒక బిల్డింగ్ కడితే సిమెంట్, స్టీల్ వాడతాము. కొన్ని వస్తువులను ఇంపోర్టు చేసుకుంటాము. ప్రతి ఒక్క దాని మీద కూడా గవర్నమెంటు ఆఫ్ ఇండియాకు పెద్ద ఎత్తున లాభం వచ్చే పరిస్థితి ఉంది. రాజధాని నిర్మాణానికి రూ.1500కోట్లు సరిపోతుందని, దానికి కూడా వారు మాట్లాడితే అది ఏ మూలకు సరిపోతుందని నేను అడుగుతున్నాను. అకౌంట్స్ ఇవ్వలేదని మాట్లాడుతున్నారు. ఇక్కడ Transit Secretariat కట్టుకున్నాము. ఇంకొక మాట, మీకు పెద్ద సిటీ కావాలా అని కొంత మంది ఎగతాళి చేసి మాట్లాడుతున్నారు. ఏమండీ మనకు సిటీ అవసరం లేదా ? రాజధాని కోసం మహారాష్ట్రకు ముంబై కావాలా ? కర్నాటకకు బెంగళూరు కావాలా ? ఢిల్లీ నగరాలు కావాలా ? చెన్నై లాంటి నగరం కావాలా ? హైదరాబాదును నేనే నిర్మాణం చేశాను. తెలుగుజాతికి ఒక నగరం ఉండాల్సిన అవసరం లేదా ? ఒక నగరం కట్టుకోవడానికి ఎందుకు ఆలోచిస్తున్నారు ? తప్పకుండా This is the best city One of the best city గా నిర్మాణం చేద్దాం.

అధ్యక్షా, అవసరమైతే ప్రతి ఒక్కరూ శ్రమదానం చేస్తారు. త్యాగాలు చేసి తెలుగువారి శక్తిని నిరూపించుకుందాము. దీనికి కూడా DPR పంపించలేదు, ఇంకా మీరు ఏమి చేస్తున్నారని అంటారు. అవి చేస్తున్నారు, ఇవి చేస్తున్నారని మాట్లాడడం ఎంత వరకూ సబబు. ఒక ప్రాజెక్టు కట్టాలంటే సమయం పడుతుంది. ప్లాన్స్ గీయాలి. ఇక్కడ ఉండే వాతావరణం ఎక్కడా లేదు. హైదరాబాదులో ఉన్నది artificial destination. నీళ్లు కూడా లేకపోతే ఒక సంవత్సరంలో హైదరాబాదుకు కృష్ణా వాటర్ తీసుకొచ్చాను. ఎవరైనా అందులో హాస్యం అనుకుంటే కాదు. ఎట్టి పరిస్థితులలో అయినా హైదరాబాదుకు నీళ్లు రావాలని సంవత్సరంలో కృష్ణా వాటర్ తీసుకువెళ్లి హైదరాబాదుకు నీళ్లు ఇచ్చిన ఘనత మాదే. అంతకు మునుపు అక్కడ కేవలం ఒకే ఒక మంజీర ప్రాజెక్టు తప్ప ఏదీ లేదు. అలాంటిది ఇక్కడ కృష్ణా నది ఉంది. పైన 5 నదులు ఉన్నాయి. వాటర్ ఫ్రంట్ ఉంది. మంచి గ్రీనరీ ఉంది. ఇక్కడ రైతాంగం కష్టపడతారు. ఇది సెంట్రల్ ప్లేస్. ఈ ప్లేస్‌ని మనం అభివృద్ధి చేసుకుని మంచి నగరంగా కడితే తెలుగుజాతికి ఒక గౌరవం ఉంటుందని నేను ఆలోచిస్తుంటే, సహాయం చేసేది పోయి ఏదో విధంగా వెక్కిరించడం, విమర్శించడం చేస్తున్నారు. ఇది ఎంత వరకు సబబని అడుగుతున్నాను. ఆ రోజు కూడా హైదరాబాదులో అసెంబ్లీలో ఇదే మాదిరిగా కూర్చుంటే ఏమి అభివృద్ధి చేశావని మాట్లాడారు. బేగంపేట విమానాశ్రయం నుండి నేరుగా హైటెక్ సిటీకి రోడ్డు వేస్తే

సరిపోతుందా అని మాట్లాడారు. కానీ ఆ రోజు చేసిన అభివృద్ధి ఈరోజు హైదరాబాదుకి ఒక వరంగా మారింది అంటే అదే నేను ఆరోజు చూపించిన చొరవ అని తెలియజేస్తున్నాను.

మ.01.50

అధ్యక్షా, ఈ రోజు జాతీయ విద్యాసంస్థల గురించి, నిన్నా, మొన్నా చాలా మంది మాట్లాడుతున్నారు. ఎన్ని ఇచ్చారు, ఎంత వరకు అయ్యాయని అడుగుతున్నా? హైదరాబాదు, బెంగళూరు, చెన్నైలలో ఒకసారి చూసినట్లయితే కొన్ని వందల కొద్దీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సెంటర్లు వచ్చాయి. అక్కడ ఎన్ని యూనివర్సిటీలు ఉన్నాయండీ? ఆ ఎకో సిస్టమ్ వచ్చే సరికి ఎంత డెవలెప్‌మెంట్ అయ్యిందండీ. కేంద్ర ప్రభుత్వం వారు వాటి కోసం ఎంత పెట్టుబడులు పెట్టారండీ, ఈ రోజు ఒక **NIRD** కావచ్చు, పోలీస్ అకాడమీ కావచ్చు, **IIT** కావచ్చు, **CCMB** కావచ్చు, డిఫెన్సు లాబొరేటరీస్ కావచ్చు, అక్కడ వచ్చాయి కానీ ఇక్కడ ఏమి ఉన్నాయండీ? ఎందుకు ఉదారంగా రారండీ? ఏమీ ఆంధ్రప్రదేశ్ అనేది భారతదేశంలో భాగం కాదా? నయారాయపూర్‌కి, జార్ఖండ్‌కి వాళ్లు కోరుకొని వెళ్లారు. మనం కోరుకొని ఇక్కడకు రాలేదు. మేము హైదరాబాదులో కంఫర్ట్‌బుల్‌గా ఉన్నాం, మాకు విభజన వద్దని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజానీకమంతా చెప్పారు. కానీ బలవంతంగా విభజన చేసి పంపించిన తరువాత వీళ్లను సంతృప్తి పరచవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని మరొక్కసారి తెలియచేస్తున్నాను.

మనకు పదకొండు ఇన్‌స్టిట్యూషన్స్ ఇవ్వాల్సి ఉంది అధ్యక్షా, మొత్తం ఆ సంస్థల ఏర్పాటుకయ్యే ఖర్చు చూస్తే దాదాపు రూ.11,673కోట్లు. అయితే ఈ నాలుగేళ్లలో ఇచ్చింది రూ.420కోట్లు మాత్రమే. ఇప్పటికి నాలుగు సంవత్సరాలు అవుతోంది. నాల్గవ బడ్జెట్ కూడా అయిపోయింది. ల్యాండ్‌కి రూ.2,911కోట్లు ఇచ్చాము. ఆ భూమి అసలు విలువ రూ.11,584కోట్లు. అది కాకుండా మనమే రూ.130కోట్లు ఇచ్చాం. ఒక్కొక్క ప్రాజెక్టు గురించి చూస్తే, మొన్న **IISER, Tirupati** కి సంబంధించి ఒక మాట అంటే నాకు చాలా బాధ కలిగింది. ఆ సంస్థ డైరెక్టర్ నా దగ్గరకు వచ్చి, సార్ **IISER** వచ్చి నాలుగైదు సంవత్సరాలు అవుతోంది, త్వరలో మొదటి బ్యాచ్ విద్యార్థులు డిగ్రీ పట్టా తీసుకుంటారు, రెంటెడ్ బిల్డింగ్‌లో కాకుండా సొంత బిల్డింగ్ కడితే బాగుంటుందనేది నా ఆశ, ఎలా అయినా చేయమని అంటే అందుకు నేను చాలా బాధపడ్డాను. అధ్యక్షా, ఐదు సంవత్సరాలకు కూడా నిర్మాణం మొదలు పెట్టకుండా ఎక్కడో ఒకచోట పెట్టి ముందుకు వెళ్లే పరిస్థితి వస్తే ఎప్పటికి పూర్తవుతాయని అడుగుతున్నాను. **IIT** తిరుపతికి ఇంత వరకు ఇచ్చింది రూ.100కోట్లు, ఎన్ఐటి, తాడేపల్లిగూడెంకు ఇప్పటి వరకు ఇచ్చింది రూ.60కోట్లు. దీనికి గాను ఇంకా రూ.420కోట్లు రావాలి. ఐఐఎం, విశాఖపట్నంకు రూ.692 కోట్లకుగాను ఇచ్చింది మాత్రం రూ.45కోట్లు. **IISER** కి రూ.1613 కోట్లకుగాను, ఇచ్చింది మాత్రం రూ.74కోట్లు మాత్రమే. అగ్రికల్చర్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ పెడతామన్నారు. అందుకు రూ.504 కోట్లు ఖర్చవుతుందంటే, కాదు, కాదు మేము సెంట్రల్ యూనివర్సిటీని పెట్టం స్టేట్‌కే ఇస్తున్నాం అనే పరిస్థితికి వచ్చారు. కానీ, డబ్బులు ఇచ్చిందంతా రూ.135కోట్లు మాత్రమే. **IIPE, Visakhapatnam** కి రూ.605కోట్లకు గాను ఇచ్చింది రూ.53కోట్లు. **IIITDM, Kurnool** కు రూ.400కోట్లు

ఇవ్వాల్సి ఉంటే, ఇచ్చింది రూ.23కోట్లు. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు రూ.1618కోట్లు, 180 ఎకరాల భూమి ఇచ్చాం. ఈ భూమి విలువే రూ.1800 కోట్లు ఉంటుంది. ఇంత వరకు ఆ డబ్బులు ఇవ్వలేదు. ట్రైబల్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల విషయంలో ఇంత వరకు బిల్లు పాస్ కాలేదు. మరొక పక్క విజయవాడలో **NIDM (National Institute of Disaster Management)** ఏర్పాటుకు రూ.70 కోట్లు ఖర్చు అవుతుంది. ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదు. దీనికి పది ఎకరాల భూమి ఇచ్చాము. ప్రైవేటుకు భూమి ఇస్తే ఆరు నెలల్లో పూర్తి చేసి వాళ్ళ క్లాసులు కూడా మొదలు పెట్టారు. వారికి చాలా తక్కువ భూమి ఇచ్చాం. కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన వాటికి మాత్రం ఇంత వరకు ప్రారంభం కాని పరిస్థితి ఉంది. వాటిని పూర్తి చేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉంది. దుగరాజపట్నం పోర్టు గురించి చట్టంలో స్పష్టంగా పెట్టారు. ఇప్పుడు ఇక్కడ కాదు ఇంకొకచోట ఇస్తామని అంటున్నారు. ఇన్ని రోజులూ ఏమిస్తారో, ఎక్కడిస్తారో, ఏమి చేస్తారో చెప్పకుండా ఇప్పుడు ఇక్కడ కాదు కాబట్టి మరొక చోట ఇస్తామనే పరిస్థితికి వచ్చారు.

అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సీట్ల సంఖ్యను 175 నుంచి 225కు పెంచుతామన్నారు. చట్టంలో ఉన్నా నేనైతే ఇప్పుడు అడగడమే మానేశాను. ఇప్పుడు నేను అడిగితే దీని కోసమే నేను ప్రయత్నం చేస్తున్నానని బురద జల్లే కార్యక్రమం కూడా చేస్తారు. సీట్లు రాకపోయినా ప్రజలు నాతో ఉన్నారు కాబట్టి, గెలవడానికి ఏమాత్రం డోకా లేదు. ప్రజలు మనతో ఉండాలి తప్ప సీట్లు పెంచితేనో లేకపోతే తగ్గిస్తేనో వచ్చేది ఏమీ ఉండదు.

అధ్యక్షా, ఇంకొక ప్రక్కన పన్నుల విధానంలో తలెత్తిన సమస్యలు. ఆ రోజు వీళ్ళు చేసినటువంటి **deferred payment taxes** చూస్తే, **Units** ఇక్కడ ఉన్నాయి, ఆఫీస్ హెడ్ క్వార్టర్స్ హైదరాబాదులో ఉన్నాయి. అవి కూడా వాళ్ళకే చెందుతాయని పెట్టారు. ఉదాహరణకు కృష్ణపట్నం పోర్టు విషయానికి వస్తే, రూ.65కోట్లు వీళ్ళు వాళ్ళకు కట్టే పరిస్థితి వస్తుంది. ఆ విధంగా మనకు రావలసిన డబ్బులు రూ.3820 కోట్లు తెలంగాణా ప్రభుత్వానికి వెళుతున్నాయి. అవన్నీ ఇక్కడ ఉండే యూనిట్స్. ఇవన్నీ వాళ్ళు అక్కడ కట్టే పరిస్థితి వస్తోంది. కడప ఉక్కు కర్మాగారం గురించి ఎప్పటి నుండో చెబుతున్నాం. దీనికి వయబిలిటీ కూడా ఉందని చెప్పారు. ఇంకా ఇది ఇవ్వలేదు. దీనిని ఇవ్వాల్సిన అవసరం ఉంది. వైజాగ్–చెన్నై పారిశ్రామిక కారిడార్ విషయానికి వస్తే, ముంబై–ఢిల్లీ పారిశ్రామిక కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇచ్చింది. మనల్ని మాత్రం **ADB** నుండి లోన్ తీసుకోమన్నారు. ఇక్కడ మాత్రం **ADB** లోన్, అక్కడ మాత్రం కేంద్ర ప్రభుత్వం గ్రాంట్. దీన్ని ఏ విధంగా జస్టిఫై చేస్తారు? మనం కష్టాల్లో ఉన్నప్పుడు ఒక యాక్టు ద్వారా మనకు ఒక గ్యారెంటీ ఇచ్చినప్పుడు, కనీసం అక్కడ ఉండే ఫెసిలిటీస్ కూడా ఇవ్వకపోతే వాళ్ళని ఏమనాలని అడుగుతున్నాను. అక్కడ నోడ్స్ కూడా ఎక్కువ ఇచ్చారు. ఇక్కడ నోడ్స్ కూడా ఇచ్చే పరిస్థితిలో లేరు. ఇలాంటి వన్నీ జరిగే పరిస్థితి వస్తోంది. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు వీలు కాదన్నారు. దీనికి బదులు లైట్ మెట్రో పెట్టమన్నారు. అటూ, ఇటూ తిరిగి ఏదీ వచ్చే పరిస్థితి లేకపోతే, విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు తీసుకువెళుతున్నాము. ప్రైవేట్‌లో వచ్చినప్పుడు **viability gap fund** ఇవ్వాల్సిన అవసరం

ఉంది. రాజధాని అమరావతికి అనంతపురం నుండి ర్యాపిడ్ రైలు వ్యవస్థ, రోడ్డు కనెక్టివిటీ అడుగుతున్నాం. అదే విధంగా అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ వే అడిగాం దానికి ల్యాండ్ అక్విజిషన్ చేసివ్వలేము అనంటే, డబ్బులు పోయినా ఫర్వాలేదు ముందు మనకు కనెక్టివిటీ కావాలని దానికి కూడా నెగోషియేట్ చేస్తున్నాం. ఇంకొక ప్రక్క నేను ముందే చెప్పాను. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం సాయం క్రింద ఇచ్చిన రూ.350కోట్లను మరలా వెనక్కి తీసేసుకున్నారు. ఈ మొత్తం గురించి కూడా రాజ్యసభలో గతంలో ఏదైతే చెప్పారో, ఆ స్ఫూర్తితోనే ఇవ్వాల్సిన అవసరముందని మీకు తెలియజేస్తున్నాను. అధ్యక్షా, మీరు ఒకసారి యాక్ట్‌లో చూస్తే, ఎంత హేతుబద్ధత లేనటువంటి విభజన చేశారంటే, అంత దారుణంగా చేశారు. చట్టంలో మీరు చూసినప్పుడు 52 శాతం జనాభాకి 46 శాతం ఆదాయం, భౌగోళిక ప్రాతిపదికపైన ఆస్తుల విభజన, జనాభా రేషియోలో అప్పుల విభజన, వినియోగం రేషియోలో విద్యుత్ కేటాయింపు, చెల్లించవలసిన పన్నులన్నీ ట్యాక్స్ రిఫండ్ క్రింద ఆస్తులన్నీ ఇక్కడ ఉన్నా ఆదాయం మాత్రం అక్కడకు ఇవ్వడం చేశారు.

అదే మాదిరిగా మరోప్రక్కన చూస్తే, షెడ్యూల్–9 క్రింద సింగరేణి క్వారీలో 51 శాతం ఇవ్వడం. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఇక్కడ విజయవాడలో ఉంటే దీనిని తెలంగాణా రాష్ట్రానికి వచ్చే విధంగా ఆ చట్టంలో ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇంకొక ప్రక్క రూ.30 వేల కోట్ల అప్పు కూడా **demarcation** చేయకుండా వదిలి పెట్టడం జరిగింది. ఇవన్నీ కూడా ఒకటి, రెండు కాదు అన్నీ ఇష్టానుసారంగా చేయడంతో మనం బాగా దెబ్బతినే పరిస్థితికి వచ్చాం. మనం కరెంట్ ఇచ్చిన దానికి తెలంగాణా ప్రభుత్వం నుండి మనకు రూ.5,732కోట్లు రావలసిన అవసరం ఉంది. షెడ్యూల్–9, షెడ్యూల్–10 సంస్థల విభజన ప్రక్రియ ఇంతవరకు సెటిల్ కాలేదు. ఈ రోజు ఢిల్లీలో మీటింగ్ పెట్టారు. ఇది కేంద్ర ప్రభుత్వ బాధ్యత, న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. రెండు రాష్ట్రప్రభుత్వాలను కూర్చో పెట్టి ఇప్పటికే దీనిని పరిష్కారం చేయాల్సి ఉంది, కాని చేయలేదు. గ్రేహౌండ్స్ సెంటర్ ఏర్పాటుకు మొన్ననే రూ.219కోట్లు ఇస్తామని చెప్పారు. అయితే, దానిని కూడా ఇంకా క్లియర్ చేసిన దాఖలాలు లేవు.

మ.02.00

కియా మోటార్స్ కంపెనీ విషయంలో కూడా కొంతమంది తాము చెబితే కంపెనీ వచ్చిందని అనుకుంటున్నారు. వారు క్లెయిమ్ చేసుకుంటున్నారు. నేను దానిగురించి మాట్లాడదల్చుకోలేదు. ఏదైనా చెప్పినప్పుడు ఆ విషయంపట్ల విశ్వసనీయత ఉండాలి. దాని కోసం మేము ఎక్కడా లేని ఇన్సెంటివ్స్ ఇచ్చాము. చాలా శ్రమించాము.

అధ్యక్షా, ఇక్కడ బాధలూ ఉన్నాయి, కానీ అదే సమయంలో మనం పడిన కష్టాలవల్ల ఈ రోజు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల మనం ఏర్పరచుకున్న ఆర్థిక విధానాల వల్ల మొదటి సంవత్సరం పది నెలల కాలంలో 9.20 శాతం గ్రోత్ రేటు ఉన్నది. ఆల్ ఇండియాలో 7.4 శాతం ఉన్నది. దేశంలో రెండవ స్థానంలో ఉన్నాము. రెండవ

సంవత్సరం 2015-16లో 10.60 గ్రోత్ రేటు ఉన్నది. దేశంలో 8.2 శాతంలో మొదటిస్థానంలో ఉన్నాము. ఆ తరువాత మూడవ సంవత్సరం రాష్ట్రంలో 11.07 శాతం ఉండగా, దేశంలో 7.33 శాతంతో రెండవస్థానంలో ఉన్నాము. ఈ సంవత్సరం రాష్ట్రంలో 11.22 శాతం దేశ వ్యాప్తంగా 6.63 శాతం ఉన్నది. ఈ మూడు సంవత్సరాలు చూస్తే, 2014-15లో రెండవ స్థానం, 2015-16లో మొదటి స్థానం, 2016-17లో రెండవ స్థానంలో ఉన్నాము. 2017-18లో కూడా మనం మొదటి స్థానంలో ఉంటాము. అందులో నాకు ఏ మాత్రం సందేహం లేదు.

(సభ్యుల హర్షధ్వానాలు)

నేను చెప్పేదేమంటే, ఇది వేరే రాష్ట్రాలకూ రావచ్చు గానీ ఇక్కడ మనం కష్టపడ్డాము. అందువల్ల ముందుకు వెళుతున్నాము. దానివల్ల మెరుగైన ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో ఈనాడు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాము. ఆనాడు నేను కేంద్రాన్ని అడిగాను. దేశంలో రైతాంగం చాలా కష్టాల్లో ఉన్నారు. రైతులను ఆదుకోవాలి. మీరు కూడా ఉదారంగా ముందుకు రండి, రైతు రుణవిముక్తి చేద్దామని అడిగాను. అందుకు వారు లేదు మేము చేయలేము, అది మీ ఇష్టం, మా వల్ల కాదు అన్నారు. ఆనాడు ఆర్‌బిఐ వద్దన్నా, బ్యాంకులు సహకరించకపోయినా నేను ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రూ.24,500 కోట్లు రుణమాఫీ చేశాము. పది శాతం వడ్డీకి కూడా తీసుకువచ్చి పెట్టాము. ప్రజలకు మంచి చేయాలనుకున్నప్పుడు మీనమేషాలు లెక్కవేయడం సరికాదు. దేశంలో ఎవ్వరూ ఇవ్వని విధంగా డ్వాక్రా సంఘాలకు ఒక్కొక్క మెంబరుకి డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికిరూ.10,000లు చొప్పన రూ.10,000 కోట్లు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం. రూ.8,000 ఇచ్చాము, మరో రూ.2,000 ఇవ్వాలి. రూ.2,516 కోట్లు మాఫీ చేశాము. దేశంలో తీసుకునే డబ్బుల్లో 1/3 మనవాళ్లే తీసుకునే పరిస్థితికి తీసుకురావడం జరిగింది. కేంద్రప్రభుత్వం ఇచ్చే రేషన్‌లో చివరికి చక్కెర కూడా తీసేశారు. అరకిలో చక్కెర మనమే ఇస్తున్నాము. పప్పు మనమే ఇస్తున్నాము. కేంద్రం ఇచ్చేది చాలా తక్కువైనప్పటికీ కూడా రూపాయికి కేజీ బియ్యంతో 1,42,27,455 కుటుంబాలకు రేషన్ ఇస్తున్నాము. 4,05,93,916 మందికి రేషన్ కార్డు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిది. చంద్రన్న కానుక, సంక్రాంతి కానుక ఇచ్చాము. దీపం పథకం కింద నూరు శాతం ప్రతి ఒక్క ఇంటికి గ్యాస్ కనెక్షన్లను ఇచ్చామంటే ఈ ప్రభుత్వం చూపిన చొరవ అని మనవిచేస్తున్నాను.

ఎన్.టి.ఆర్. భరోసా క్రింద పెన్షన్లు ఇస్తున్నాము. కేంద్రప్రభుత్వం ఇచ్చేది రూ.200 అయితే, అదికూడా కొంతమందికి ఇస్తే, ఎన్.టి.ఆర్. భరోసా క్రింద వితంతువులకు, వృద్ధులకు, టాడీటాపర్స్‌కు రూ.1000 చొప్పన, వికలాంగులకు రూ.1500 చొప్పన 50 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాము. అందుకు సుమారు నెలకు రూ.493 కోట్లు అవుతున్నది. రూ.5,906 కోట్లు ఖర్చుచేస్తున్నాము. బీమా పథకం కింద రూ.5 లక్షలు ఇస్తున్నాము. సహజ మరణానికి రూ.2లక్షలు ఇస్తున్నాము. ఈమధ్యనే రూ.720 కోట్లు ఖర్చు చేశాము. సహజమరణాలకు గాను 97,470 మందికి, యాక్సిడెంట్స్ కింద 11,317 మందికి బీమా సౌకర్యం కల్పించాము. ఆ విధంగా 1,08,794 మందికి లబ్ధి చేకూర్చాము.

స్కాలర్‌షిప్పుల కొరకు జ్ఞానభూమి పోర్టల్ కింద ఎక్కడా ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా సరైన సమయంలో ప్రతి నెల నేరుగా వారికి ఇస్తున్నాము. మరోపక్క విదేశీ విద్యాదరణ కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఇస్తున్నాము. పేదవారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు వర్గాల వారికి ఒక్కొక్కరికీ రూ.10 లక్షలు ఇచ్చి విదేశాలలో చదివించే ప్రభుత్వం మన ప్రభుత్వం అని తెలియచేస్తున్నాను. ఎన్‌టిఆర్ విద్యోన్నతి కింద పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాము. రాబోయే ఉగాది నుండి పెళ్లికానుక పేరుతో మరో కార్యక్రమాన్ని తీసుకురాబోతున్నాము. ఎస్టీ, మైనారిటీలకు రూ.50,000 ఇస్తున్నాము. ఎస్సీలకు రూ.40,000 ఇస్తున్నాము. బిసిలకు రూ.30,000లు ఇస్తున్నాము. పెళ్లి రోజున వాళ్ల అకౌంట్‌లో ఈ సొమ్మును వేసి నిజమైన పెళ్లి కానుకగా ఈ డబ్బును అందచేస్తున్నామని మనవిచేస్తున్నాను. జగ్జీవన్ జ్యోతి కింద 75 యూనిట్లు కరెంటును వాడే ఎస్సీ, ఎస్టీలకు మొత్తం ప్రభుత్వమే రీయింబర్సు చేస్తున్నాము. దీనికి రూ.381 కోట్లు అవుతుంది. అయినా ఫరవాలేదు. పేదవారిపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నది.

స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో కూడా ప్రభుత్వం చొరవతీసుకుంటున్నది. ఈనాడు 7,25,000 మందికి స్కిల్ డెవలప్‌మెంట్‌ను అందించాము. Siemens, Dassault Systems, British Council for English Communication skills ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోర్సులను అందిస్తున్నాము. అదేమాదిరిగా నిరుద్యోగ భృతికింద వెయ్యికోట్లు ఈ బడ్జెట్‌లో పెట్టాము. త్వరలోనే దీనిని కూడా ప్రారంభిస్తాము. రూ.200 కోట్లతో ల్యాండ్ పర్చేజ్ స్కీముతో యూనిట్ కాస్ట్ నిర్ణయించి ఆ మేరకు ఎస్సీలకు ఇవ్వాలని ఒక ఆలోచనతో ఉన్నాము. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, డిజేబుల్డ్ అందరికీ కూడా బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యతనిచ్చాము. బడ్జెట్‌లో వెనుకబడిన వర్గాలకు అందునా అన్ని కులాలవారికీ, ఎం.బి.సి. వర్గాలకు ప్రాధాన్యతనిచ్చాము. అత్యంత వెనుకబడిన తరగతులకు, కాపులకు బడ్జెట్ కేటాయింపులు చేశాము. ఆ విధంగా వారిని ఏ విధంగా ఆదుకోవాలనే విధంగా మేము తగు చర్యలు తీసుకుంటున్నాము.

మహిళా సంఘాలలో 92 లక్షలమంది పనిచేస్తున్నారు. రూ.2,514 కోట్లు వాళ్లకు ఇస్తున్నాము. సాధికార మిత్ర కింద కూడా వారిని అపాయింట్ చేశాము. గ్రామాలలో 35 ఇళ్లకు ఒకరు చొప్పున ఇంటింటికీ తిరిగి అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తూ, ప్రభుత్వం చేసే పనులను ప్రజలకు చేరువ చేస్తూ ఏ విధంగా వారు చేసుకోవాలో నేర్పిస్తున్నారు. అన్న అమృతహస్తం తీసుకువచ్చాము. బాలామృతం, గిరిగోరుముద్దలు పథకాలను తీసుకువచ్చాము. ఈ సంవత్సరం కొత్త కార్యక్రమాన్ని తీసుకువచ్చాము. అదేమిటంటే ముఖ్యంగా అనీమియా, మాల్ న్యూట్రిషన్ స్టంటింగ్ చేయాలని అనుకున్నాము. పంచాయతీలు, మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ప్రభుత్వం కలిసి ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని నిర్మూలించాలని అనుకున్నాము. నూరు శాతం దానిని అఛీవ్ చేస్తామని నేను మనవిచేస్తున్నాను.

అంబేడ్కర్ స్మృతి వనంను ఏర్పాటు చేస్తున్నాము. నూరు శాతం ఓడిఎఫ్ మొన్నటికే అవాల్సింది కాదీ, నరేగాకు ఇబ్బంది వస్తునందని కొంచెం పొడిగించాము. ఈ సంవత్సరం ఏప్రియల్, 15 లోపల రాష్ట్రం మొత్తం ఓడిఎఫ్‌గా డిక్లేర్ చేయబోతున్నాము. ఆ విధంగా అతి పెద్ద రాష్ట్రాల సరసన మన రాష్ట్రం కూడా చేరుతుందని నేను తెలియచేస్తున్నాను.

ఇళ్లనిర్మాణం కార్యక్రమంలో మనం చురుగ్గా ముందుకు వెడుతున్నాము. గత ప్రభుత్వం సరిగా లెక్కలు కూడా పంపినందువల్ల కేంద్రం నుండి మనకు రెండు విషయాలలో ఎలిజిబిలిటీ కూడా తగ్గిపోయే పరిస్థితి వచ్చింది. లేని రోడ్లు ఉన్నాయని చూపించడం, అర్హులైన పేదవారికి ఇళ్ల విషయంలో కూడా సరైన లెక్కలు చూపించకపోవడం వల్ల మనకు చాలా ఇబ్బంది వచ్చింది. అందువల్ల ఈ ప్రభుత్వం అందరికీ ఇళ్లు కట్టించాలని భావించింది. ఫేజ్-1లో అర్బన్, రూరల్ హౌసింగ్ విషయంలో కేంద్రం ఇచ్చినదే కాకుండా మనం కూడా కొంత మొత్తం ఇవ్వడం జరుగుతోంది. కొంతమంది కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది కదా అని అనవచ్చు. కానీ, కేంద్రం అర్బన్ హౌసింగ్‌కు రూ.1,50,000లు ఇస్తే మనం కూడా రూ.1,50,000 ఇస్తున్నాము. రెండవ విషయం మొత్తం భూమిని మనమే కొని ఇస్తున్నాము. ఈ రెండూ కాకుండా **trunk infrastructure, inside infrastructure** మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే చేస్తున్నది. మరే రాష్ట్రం చేయడం లేదు. ఇళ్లు కట్టించి ఇవ్వడమే కాదు, నివాస యోగ్యంగా ఉండాలి, ఇళ్లు అనేవి పేదవారికి ఆస్తి కింద ఉండాలని మేము ముందుకు వెడుతున్నాము. ప్రతి ఒక్కరు దానిని అప్రీషియేట్ చేస్తున్నారు. ఈ విధంగా మన రాష్ట్రం దేశానికే ఒక మోడల్‌గా తయారు అయిందంటే కేంద్రం ఇచ్చిన రూ.1,50,000లకు పూర్తవదు. మనం కూడా దానికంటే రెండింతలు ఖర్చుచేయడం వల్ల అది సాధ్యమయిందని నేను మనవిచేస్తున్నాను. మొత్తం 19 లక్షల ఇళ్లు ఎన్నికల కంటే ముందు పూర్తిచేసే బాధ్యత మాది. రూ.50,000కోట్లు ఖర్చు చేసి అన్ని ఇండ్లు పూర్తి చేసి ఎలక్షన్‌కు వెళతాము. ఇది పేదవారిపట్ల మా ప్రభుత్వానికి ఉండే కమిట్‌మెంట్ అని సభ ద్వారా తెలియచేస్తున్నాను.

మ.02.10

అదే సమయంలో సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా పట్టణాల్లో గానీ, గ్రామాల్లో గానీ ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకుని ఉంటే అవన్నీ కూడా పట్టాలు క్రమబద్ధీకరిస్తాము. అదే సమయంలో రూ.500 కోట్లు ఖర్చుపెట్టి ల్యాండ్ అక్విజిషన్ పూర్తి చేసి ఎవరికీ కూడా ఇంటి జాగా లేదనకుండా, ప్రతి ఒక్కరికీ ఇంటి జాగా ఇప్పించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. ఇవన్నీ కూడా చేస్తున్నామంటే ఒక పద్ధతి ప్రకారం పెట్టుకుని ముందుకు పోతున్నాము. ఈ రోజు రాష్ట్రంలో బీసీల్లో ఎవరైతే చేతివృత్తులు, కులవృత్తులు చేసుకుంటారో వారికి కూడా బడ్జెట్ కేటాయింపులు పెట్టాము. చివరకు ఎస్సీల్లో లిడ్‌క్యాప్, చర్మకారులకు, డప్పు కళాకారులకు కూడా బడ్జెట్ పెట్టాము. ఇలా ఒకరని మాత్రమే కాకుండా, అందరినీ సమానంగా చూస్తూ, ఈ సంవత్సరం ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూస్తూ గౌరవించే విధంగా తీసుకువెళ్లాము. అదేవిధంగా పోయిన సంవత్సరం 29 శాతం రెయిన్‌ఫాల్ తక్కువగా ఉంది. ఈ సంవత్సరం 14.3 శాతం రెయిన్‌ఫాల్ తక్కువ. పోయిన సంవత్సరం ఆలిండియా లెవల్లో చూస్తే అగ్రికల్చర్ గ్రోత్‌రేట్ చాలా తక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో పోయిన సంవత్సరం ఆలిండియా లెవల్లో అగ్రికల్చర్ గ్రోత్ రేట్ చూస్తే 3.6 శాతం

ఉంటే, మనది 14.91 శాతమంటే, 5 రెట్లు ఎక్కువుంది. ఈ సంవత్సరం మనది 17.71 శాతముంటే, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా 3 శాతం, 6 రెట్లు పెరిగింది. ఈ సంవత్సరం 14.3 శాతం రెయిన్‌ఫాల్ తక్కువగా ఉన్నా ఈ సంవత్సరం మన అగ్రికల్చర్ గ్రోత్ రేటు 17.71 శాతం వచ్చింది. అంటే ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిందేమంటే చాలా శ్రద్ధ పెట్టాము. నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టాము. ఇంకోపక్క చాలా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాము. ఈ రోజున ప్రతి సోమవారం టెలికాన్ఫరెన్సులు నిర్వహించి, నీరు-ప్రగతి మీద ముందుకు పోవడం, అదే సందర్భంలో పోలవరం ప్రాజెక్టుపైన శ్రద్ధ పెట్టడం జరుగుతోంది. ఇవన్నీ చేసిన తరువాత ఒక స్థాయికి తీసుకువచ్చాము. 50 ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో పెట్టాము. అందులో పురుషోత్తమపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేశాము. శారదా నదిపైన ఆనకట్టను పూర్తి చేశాము. పోగొండ రిజర్వాయర్ వెస్ట్ గోదావరిలో పూర్తి చేశాము. ఆ జిల్లాలోనే ఎర్రకాలువ పూర్తి చేశాము. కండలేరు లెఫ్ట్ కెనాల్ లిఫ్టు ఇరిగేషన్ స్కీము నెల్లూరు జిల్లాలో పూర్తి చేశాం. గండికోట సి.బి.ఆర్. లిఫ్టులన్నీ కడప జిల్లాలో పూర్తి చేశాం. ముచ్చుమర్రి లిఫ్టు ఇరిగేషన్ కర్నూలు జిల్లాలో పూర్తి చేశాం. రాబోయే రోజుల్లో ముచ్చుమర్రి స్కీము వల్ల రాయలసీమలో త్రాగునీటి సమస్య తీర్చడానికి చాలా వరకు కీలకమవుతుంది. అటు తెలుగుగంగకు గానీ కె.సి. కెనాల్‌కు గానీ, హంద్రీ నీవాకు గానీ, లేకపోతే గాలేరు-నగరికి గానీ నీటిని తీసుకుపోయే పరిస్థితి వస్తుంది. సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను కర్నూలులో పూర్తి చేశాం. ఇవన్నీ కూడా ప్రారంభించాము. ఇదే కాకుండా గోరకల్లు బాలెన్సింగ్ రిజర్వాయర్ కర్నూలులో సిద్దంగా ఉంది. అవుకు టన్నల్ సిద్దంగా ఉంది. పులికనుమ లిఫ్టు ఇరిగేషన్ సిద్దంగా ఉంది. పెదపాలెం లిఫ్టు ఇరిగేషన్ కృష్ణా నదిలో సిద్దంగా ఉంది. చినసాన లిఫ్టు ఇరిగేషన్ కూడా సిద్దంగా ఉంది. ఇవి 13 కాగా, మిగిలిన ప్రాజెక్టులన్నీ రాబోయే రోజుల్లో జూన్ లోపల పూర్తి చేస్తాం. బి.ఆర్.ఆర్. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2 శ్రీకాకుళంలో, Inter-linking of rivers క్రింద శ్రీకాకుళం మరియు విజయనగరం జిల్లాల్లో వంశధార-నాగావళి నదులను అనుసంధానించబోతున్నాం. గుంటూరు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టు, కొండవీటి వాగు ఉంది. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ జలాశయం, కొరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము ఉంది. అడవిపల్లి రిజర్వాయరు చిత్తూరు జిల్లాలో వస్తోంది. సంగం బ్యారేజ్ నెల్లూరు జిల్లా, కుప్పం బ్రాంచ్ కెనాల్ ఫేజ్-2 హంద్రీ నీవా చిత్తూరు జిల్లాలో, అలాగే SH-32–31 road work కడప జిల్లాలో, గండికోట రిజర్వాయర్ కడప జిల్లాలో, మారాల, చర్లోపల్లి, మడకశిర బ్రాంచ్ కెనాల్ అనంతపూర్ జిల్లాలో ఉన్నాయి. ఇవన్నీ కూడా ఏప్రిల్ లేదా మే నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలియజేస్తున్నాను. కర్నూలు జిల్లాలో పులకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మహేంద్రతనయ ప్రాజెక్టు శ్రీకాకుళంలో రానుంది. ఇంతవరకు 29 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు జూన్ నెల నాటికి పూర్తి అవుతాయి. కాబట్టి, ఎట్టి పరిస్థితిలోనూ వాటిని జాతికి అంకితం చేస్తాం. ఇది కాకుండా మహేంద్రతనయ శ్రీకాకుళం జిల్లాలో, తారకరామతీర్థసాగర్ విజయనగరం జిల్లాలో, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫేజ్-1 విశాఖపట్నం వరకు వెళుతుంది. హీరమండలం రిజర్వాయర్ నుండి ఇచ్ఛాపురం హై లెవెల్ కెనాల్ వరకు ఇది శ్రీకాకుళం జిల్లాలో ఉంది. గోదావరి-పెన్నా లింక్ ఫేజ్-1. ఇప్పుడు పవిత్ర సంగమానికి వచ్చాం. తరువాత దీన్ని రైట్ మెయిన్ కెనాల్‌కి తీసుకెళ్తాం. అక్కడి నుండి శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులకు తీసుకెళ్తాం. దీంతో ఫేజ్-1 పూర్తి అవుతుంది. చింతలపూడి లిఫ్టు ఇరిగేషన్ స్కీము పశ్చిమ

గోదావరి జిల్లాలో ఉంది. దీని వల్ల ఒక్క పశ్చిమగోదావరి జిల్లా మాత్రమే కాకుండా కృష్ణా జిల్లాలో నాగార్జునసాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్‌కి కూడా నీళ్లిచ్చే అవకాశం వస్తుంది. ఇంకొక పక్కన వైకుంఠపురం వద్ద కృష్ణా నదిపై ఒక బ్యారేజ్ కట్టడం జరుగుతుంది. వెలుగొండ టన్నెల్-1, టన్నెల్-2 హెడ్ రెగ్యులేటర్ ఎట్టి పరిస్థితిలో పూర్తి చేయాలనుకుంటున్నాం. టన్నెల్-1 ఈ సంవత్సరం పూర్తవుతుంది, నీళ్లిస్తాం. చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించి సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ పూర్తి చేస్తాము. సోమశిల, స్వర్ణముఖిలింక్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి ఆల్తూరుపాడు దగ్గర రిజర్వాయర్ కట్టి, అక్కడినుంచి నీటిని తీసుకెళ్తాం. అక్కడినుంచి సోమశిల-స్వర్ణముఖిలింక్ కెనాల్ ద్వారా నీటిని మల్లెమడుగు వరకు తీసుకెళ్తాం.

అలాగే, బాలాజీ రిజర్వాయర్ చిత్తూరు జిల్లాలో వస్తుంది. ఇంకొక పక్కన వేణుగోపాలసాగర్ రిజర్వాయర్ కూడా చిత్తూరు జిల్లాలో వస్తుంది. గాలేరు-నగరి సుజల స్రవంతి ఫేజ్-2 కడప జిల్లా కోడూరు వరకు, హంద్రీ నీవా సుజల స్రవంతి-1 కెనాల్ విస్తరణ అనంతపూర్ జిల్లాలో జరుగుతుంది. అదేవిధంగా కర్నూలు జిల్లాలో జీడివారిపల్లె రిజర్వాయర్ నుంచి బైరవానితిప్ప ప్రాజెక్ట్ (బి.టి.పి.) దీనికి కూడా ఈ సంవత్సరం టెండర్లు పిలుస్తున్నాం, త్వరలో పూర్తిచేస్తాం. మరొక పక్కన ఎగువ పెన్నా ప్రాజెక్టు అంటే లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పేరూరుకు సంబంధించింది. ఇంకొక పక్క, water supply to all western taluks in Kurnool District. ఆ ప్రాంతంలో ఉండే ట్యాంకులన్నింటికీ నీళ్లివ్వడానికి ఇది కూడా పూర్తి చేస్తాం. ఎస్టిమేట్స్ సిద్ధమయ్యాయి, తొందర్లోనే టెండర్లు పిలుస్తాం. ఇది ప్రత్యేకంగా డోన్, పత్తికొండ, ఆలూరు ప్రాంతాలకు నీరివ్వడానికి బాగా ఉపయోగపడుతుంది. మూలపల్లి 4 ట్యాంకులకు నీరు వస్తుంది. అలాగే, కర్నూలు జిల్లాలో వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము. ఇలా మొత్తం 50 ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి మొత్తం రూ.38,391 కోట్లు ఖర్చవుతుంది. ఇప్పటికి రూ.13,032 కోట్లు మాత్రమే ఈ ప్రాజెక్టుల మీద ఖర్చు చేయడం జరిగింది. ఇంకా రూ.25,384 కోట్లు ఖర్చు పెట్టాలి. ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని తెలియజేస్తున్నాను.

ఇంకొక పక్క పోలవరంలో చెప్పాను. ఇది ఎప్పటిదంటే దగ్గర, దగ్గర 1942, 1944 సంవత్సరాల్లో ఆరోజు ఆలోచించిన విధానం. 1946-47లో దీని పైన ఎస్టిమేట్స్ తయారు చేయడం జరిగింది. అక్కడి నుండి గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఇవ్వడం, ఇది ఎన్నో సంవత్సరాలైంది కానీ దీనిని అలాగే ఆలస్యం చేశారు. కానీ, మొట్టమొదటగా ఎట్టి పరిస్థితులలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే సంకల్పంతో ఈ ప్రభుత్వం ముందుకు పోతుందని కూడా తెలియజేస్తున్నాను. మరో పక్కన అగ్రికల్చర్ విషయానికి వస్తే, వ్యవసాయంలో కూడా స్ట్రాటజీ మార్చాము. ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లు మారుతున్నాయి కాబట్టి, మనం కూడా వ్యవసాయ ఉత్పత్తులు మార్చుకుంటే రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది. అందుకే అగ్రికల్చర్ నుంచి హార్టికల్చర్‌కు వెళ్లాం.

మ.02.20

అధ్యక్షా, ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం, ఉద్యానపంటలు, లైవ్‌స్టాక్, ఆక్వాకల్చర్ విషయానికి వస్తే, అధిక ఆదాయం, జివిఎస్‌డిపి ఉద్యానపంటలలో వస్తుంది. ఇప్పటికి 40లక్షల ఎకరాలలో ఉద్యానపంటలను పండిస్తున్నాం. అయితే ఒకకోటి ఎకరాలలో పండించాలనీ, భారతదేశంలోనే నెంబర్ వన్‌గా ఉండాలని, రాయలసీమను Horticulture Hubగా తయారుచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాము. దీనివల్ల చాలావరకూ ఉపయోగాలుంటాయి కనుక ఆ దిశగా పనిచేస్తున్నాం.

అంతేగాకుండా, వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చి వినూత్నమైన కార్యక్రమాలను తీసుకువచ్చాం. సూక్ష్మపోషకాలను, విత్తనాలను ఇస్తూ, ఎరువుల వాడకాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నాము. ఊబరైజేషన్ అగ్రికల్చరల్ మెషినరీకి వెళ్ళాం. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడంకోసం, వ్యవసాయంలో ।డపీడల్ని కూడా ముందుగానే గుర్తించే విధంగా హిస్టారికల్ డేటా పెట్టుకుని ప్రిడిక్టివ్ మోడల్‌తో వెళ్తూ చాలావరకూ నియంత్రించాలనే ఆలోచనలు చేస్తున్నాము.

అదేవిధంగా, ఇటీవల జీబా అని కొత్త ప్రోడక్టును ఒకదానిని తీసుకువచ్చారు. బాగా కరవు ఉండే ప్రాంతంలో ఒక అయిదు కేజీల జీబా ప్రాడక్టును బాగా కలిపి ఒక ఎకరాలో వేస్తే, వర్షం పడినప్పుడు ఆ వర్షపునీరు ఇంకిపోకుండా, భూమిలోకి వెళ్ళిపోకుండా అక్కడే నిలిపి ఉంచుతుంది. దానివల్ల ఆరు నెలలపాటు అక్కడి పంటకు క్రమబద్ధంగా నీళ్ళు ఇవ్వడానికి అవకాశముంటుంది. కాబట్టి ఈ సంవత్సరం నాలుగు జిల్లాల్లోని రెండు లక్షల ఎకరాల్లో దీనిని ప్రయోగాత్మకంగా చేయబోతున్నాము. ఈ ప్రయోగంకానీ విజయవంతమైతే, భవిష్యత్తులో ఏ ప్రాంతంలోనైనా కరవు వచ్చినప్పుడు ఈ ప్రాడక్టును వాడడంవల్ల కరవును పూర్తిగా ఎదుర్కొనే సత్తా ఉంటుందని అంటున్నారు.

అలాగే, ఇటీవల బిల్‌గేట్స్ మిలిందా ఫౌండేషన్‌ద్వారా ఒక అగ్రిటెక్-2017 పెట్టాము. వినూత్నమైన కార్యక్రమాలు ప్రపంచంలో ఏమేమి ఉన్నాయో అవన్నీ తీసుకువస్తున్నాం. డ్రోన్ ద్వారా సాయిల్ టెస్టింగ్ చేయడం, సాయిల్ మ్యాపింగ్ చేయడం, పెస్టిసైడ్స్‌ను స్ప్రే చేయడం వంటి వినూత్నమైన కార్యక్రమాలను చేస్తున్నాము. అదేవిధంగా, ఈరోజు రాష్ట్రంలో లైవ్‌స్టాక్‌కు, పాడి పరిశ్రమకు, గొర్రెల పెంపకానికి, కోళ్ళ పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాం. మనకు ఇంక్లూసివ్ గ్రోత్ రేటు రావాలంటే, ఇలాంటి కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తే తప్ప మనకు సరైన ఫలితాలు రావు. అందుకనే ఈ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేస్తున్నాం. ప్రతి ఒక్క కుటుంబానికి కనీసం పదివేల రూపాయల ఆదాయం రావాలని, దీనికేం చేయాలో వాటన్నింటినీ చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నాం.

అధ్యక్షా, ఆరోగ్య విషయంలో చాలా మార్పులు తీసుకువచ్చాం. దగ్గరదగ్గర 13, 14 ఏజెన్సీలను పెట్టాం. దానికి నాలెడ్జ్ పార్టనర్స్‌ను తీసుకువచ్చాం. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ తీసుకొచ్చి ప్రపంచంలోనే నాణ్యత కలిగిన ఎక్విప్‌మెంట్‌ను, బెస్ట్ మెథడాలజీని, బెస్ట్ ప్రాక్టీసును మనం ఉపయోగించే పరిస్థితికి వస్తున్నాం. వీటన్నింటినీ అమలుచేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

అలాగే, అమరావతి రీజియన్‌లో 14 మెడికల్ కళాశాలలు వస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేనన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రులు ఇక్కడకు వస్తాయి. ఇది ఒక Health Hubగా తయారవుతుంది. అందులో ఎటువంటి సందేహంలేదు. ఆరోగ్య ఖర్చును గణనీయంగా తగ్గించాము. ఒకప్పుడు డయాలసిస్ అంటే పట్టించుకునే వాళ్ళు కాదు. డయాలసిస్‌ను ఉచితంగా చేస్తున్నాం. అంతేగాకుండా, డయాలసిస్ రోగులకు ఉచితంగా పరీక్షలు చేస్తూ, రూ.2500 పెన్షన్ ఇవ్వడంతోపాటు, వారికి అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నాం. అనేక విధాలుగా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఆరోగ్యం విషయంలో ముందుకెళ్తున్నాం. ఏ విధంగా చేయాలనే అంశంలో ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం వారు మన రాష్ట్ర ప్రభుత్వంతో ఒక ఎం.ఓ.యు చేసుకున్నారు.

అదేవిధంగా, మెడ్‌టెక్ పార్కు కూడా తీసుకువచ్చాం. ప్రపంచంలో తయారుచేసే మాన్యుఫ్యాక్చరింగ్ అంతా విశాఖపట్నం కేంద్రంగా మన దగ్గర తయారుచెయ్యడానికి ముందుకు వెళ్తున్నాం. ఇంకొక పక్క ఎడ్యుకేషన్ హబ్‌గా ముందుకు పోతున్నాం. ఈరోజు మనదగ్గర సంస్థలు లేవు. అయినా నేను వదిలిపెట్టలేదు. అమరావతిలో ఎస్.ఆర్.ఎం, విట్, అమృత, దుబాయి బేస్డ్ వైద్యకళాశాలలు వచ్చాయి. మరొకపక్క లండన్‌బేస్డ్ సంస్థలు వచ్చే అవకాశముంది. వీటన్నింటినీ ఇంకా పెద్ద ఎత్తున చేయాలనే ఆశయంతో పనిచేస్తున్నాం. విశాఖపట్నం, తిరుపతి, శ్రీ సిటీ, అమరావతి కేంద్రంగా అనేక పెద్ద పెద్ద విద్యాసంస్థలు ఇక్కడకు వస్తున్నాయి. అందుకే ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లును కూడా తీసుకువచ్చాం. వర్చువల్ క్లాసురూమ్‌లు పెట్టాము. హైస్కూలు, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ సుమారు 6000 క్లాసురూమ్‌లకు వర్చువల్ క్లాసురూమ్‌లు పెట్టాలని ఆలోచిస్తున్నాం. టెక్నాలజీని ఉపయోగించుకుంటూ, బయోమెట్రిక్ పద్ధతిని పెట్టాము. నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాము. మరొకప్రక్క గ్రామీణ అభివృద్ధి కింద ఈరోజు చాలా కార్యక్రమాలు చేస్తున్నాం.

అధ్యక్షా, మౌలిక సదుపాయాల విషయానికి వస్తే, ఒకప్పుడు ఒక పాఠశాల భవనం కావాలంటే చాలా అవస్థలు పడేవాళ్ళం. ఇంక భవిష్యత్తులో ఎవ్వరికీ ఏ ఇబ్బందీ లేకుండా ప్రతి ఒక్క ఊరిలో పాఠశాల భవనం, పంచాయతీ భవనం, సిమెంట్ రహదార్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. అదేవిధంగా శ్మశానం, ఆటస్థలం వంటి వాటితోపాటు మౌలిక సౌకర్యాలన్నీ ఉండేవిధంగాను, వీధిదీపాలు ఉండేవిధంగా చూస్తున్నాం. మరొకపక్క వచ్చే నెల 15వ తేదీ కల్లా 100 శాతం ODF కు చేరుకుంటాం. ఆ తరువాత ODF plus కి వెళ్తాం. దక్షిణ భారతదేశంలోనే కాదు, చాలా రాష్ట్రాలకంటే మనం ముందుంటాం. నిధుల కొరత అనేది సమస్యకాదు. మనసుంది, దృఢ సంకల్పముంది. ఎట్టి పరిస్థితిలోనూ ప్రజలతో కలిసి వీటిని సాధిస్తున్నామని తెలియచేస్తున్నాను.

అదేవిధంగా, పదిహేడు, పద్దెనిమిదివేల కిలోమీటర్ల సిమెంటు రహదార్లు వేశాము. ఆ సిమెంట్ రహదార్లు మా డబ్బులతో వేశామని మళ్ళీ బీజేపీ నాయకులు మాట్లాడతారు. మీ డబ్బులు, మా డబ్బులు కాదు. ఆ డబ్బులన్నీ ప్రజలు కట్టే పన్నులే. ఇక్కడ డబ్బులు కడితే ఢిల్లీకి వెళ్తాయి. ఢిల్లీ నుంచి మళ్ళీ 42 శాతం మనకు ఇచ్చి

58 శాతం వాళ్ళు ఖర్చుపెట్టుకుంటున్నారు. దక్షిణ భారతదేశంలో ఎక్కువ పన్నులు వస్తున్నాయి. కానీ ఉత్తర భారతదేశంలో డబ్బులు ఎక్కువ ఖర్చుపెడ్తున్నారు. ఆ విషయం కూడా మనం గుర్తుపెట్టుకోవాలి.

అధ్యక్షా, ఈరోజు పెద్ద ఎత్తున టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. ఎంత పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నామంటే రియల్ టైం గవర్నెన్స్‌ను తీసుకొచ్చాం. 1100 కాల్‌సెంటర్‌ను తీసుకొచ్చాం. సమస్యలన్నీ పరిష్కారం చేయడానికి సమర్థవంతంగా ముందుకు పోతున్నాం.

అదేవిధంగా, అందరికీ విద్యుచ్ఛక్తిని కూడా మా మిత్రులు తామే చేశామని క్లెయిం చేసుకుంటారు. మీ అన్ని రాష్ట్రాల్లో మీరు చేసిన తరువాత వచ్చి నాకు చెప్తే నేను వింటాను కానీ, ముందుగా అసెస్ చేసి ఏ విధంగా చేయాలో చేసి భారతదేశానికే ఒక ఆదర్శంగా ఉండడానికి మొదటిగా సోలార్ విండ్ పాలసీ నేను తీసుకొచ్చిన తరువాత కేంద్రం ఫాలో అయ్యిందని గుర్తుపెట్టుకోవాలి. 1998, 1999 సంవత్సరాలలోనే నేను పవర్‌సెక్టార్‌లో రిఫార్మ్స్ తీసుకొచ్చాను. ఎవరికీ ఆలోచన రాలేదు. అలాంటప్పుడే తీసుకొచ్చాను. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తాం తప్ప పెంచే సమస్య లేదని మొట్టమొదటిసారిగా భారతదేశంలో నేనే అనౌన్స్ చేశాను. విద్యుత్ ఆదా విషయంలో చూస్తే, హుద్‌హుద్ తుపాను తరువాత విశాఖపట్నాన్ని ఒక ఆదర్శంగా తీసుకుని బ్రహ్మాండంగా మనం ముందుగా విద్యుత్‌ను ఆదాచేస్తే, ఆ తరవాత దేశమంతా కూడా విద్యుత్‌ను ఆదాచేసే పరిస్థితికి వచ్చారు.

ఒక్క అమరావతే కాదు భవిష్యత్తులో 110 పురపాలక సంఘాలలో నీటి సరఫరా, మురుగునీరు, వరదనీరు, రహదార్లు, ఘన/వ్యర్థ పదార్థాల నిర్వహణ, పార్కులు, హరితప్రదేశాలు ఇలా అన్నింటికోసం రూ.10,782 కోట్లు ఖర్చుపెట్టి ఆధునికీకరణ కోసం ముందుకుపోతున్నాం.

అదేవిధంగా, స్మార్ట్ సిటీస్‌లో మనమే ముందున్నాం. భవిష్యత్తులో కూడా ఆంధ్రప్రదేశ్ ఒక ఆదర్శమవుతుంది. మీరు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడకు వచ్చినా ఈ అభివృద్ధి మీకు కనబడుతుందని కూడా తెలియజేస్తున్నాను. విమానాశ్రయాలు, ఓడరేవులు, లాజిస్టిక్ పార్కులు, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్, రహదార్లు, భవనాలు వీటన్నింటిలో కూడా పిపిపి మోడల్‌లో ముందుకెళ్తున్నాం.

అలాగే, రహదార్లన్నీ పెద్ద ఎత్తున వేయించామని మా మిత్రులు చెప్తున్నారు. సంతోషం. రహదార్లు ట్రాఫిక్‌ను బట్టి వస్తాయి. అవికూడా పిపిపి మోడల్‌లో వేసిన రహదార్లు. లక్ష కోట్ల రూపాయలు పెట్టినా, రెండు లక్షల కోట్ల రూపాయలు పెట్టినా మళ్ళీ ఎవరైతే ఆ రహదార్లను వాడుకుంటారో వాళ్ళే కడతారు తప్ప ఇది కేంద్ర ప్రభుత్వం డబ్బులు కట్టేది కాదు. ఆ విషయం ఆరోజే గడ్కరీగారితో చెప్పాను. నేను అడుగుతున్నాను, మీరు కూడా ఇస్తున్నారు గడ్కరీగారూ, మీరు ఇవ్వకపోతే నేనే చేసుకుంటానని కూడా వారితో చెప్పాను. జాతీయ రహదార్లలో పిపిపి మోడల్, హైబ్రీడ్ మోడల్స్ వంటివి ఉంటాయి. దానివలన మనకు డబ్బులు వస్తుంది తప్ప మనం చేసే పరిస్థితి ఉండదు. ఆ విషయం మీరు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరముంది.

ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటివరకూ 2680 ఎం.ఓ.యులు చేశాము. దగ్గర దగ్గర పద్దెనిమిది లక్షల కోట్ల రూపాయల విలువచేసే పెట్టుబడులు వచ్చాయి. 42లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి.

మ.02.30

అధ్యక్షా, కొంతమంది ఇవన్నీ రాలేదని మాట్లాడుతున్నారు. కొంత మంది మీకు పరిశ్రమలు వస్తున్నాయి కదా ఎందుకు ప్రత్యేకహోదా అని మాట్లాడుతున్నారు. ప్రత్యేక హోదా ఇస్తే ఈరోజు ఇంకా బ్రహ్మాండంగా పరిశ్రమలు వచ్చేవి. ఏ రంగంలో అయితే వెనుకబడి ఉన్నామో వెంటనే ఆ రంగాలలో కూడా ముందుకు వెళ్లేవాళ్లము. ఆ విషయం గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక హోదా మనం అడిగింది కాదు. ఇది మన హక్కు. ఆ రోజు కావాలని రాష్ట్రాన్ని విభజించారు కాబట్టి ఇది తప్పకుండా ఇచ్చి తీరాలని మనం డిమాండ్ చేస్తున్నాము. తప్పకుండా ప్రత్యేక హోదా ఇవ్వాలి. అందులో Industrial incentives కూడా ఇవ్వాల్సిన అవసరం ఉంది.

(సభ్యుల హర్షధ్వానాలు)

అధ్యక్షా, అందులో ఇప్పటివరకు ప్రొడక్షన్ వెళ్లేవి 530 పరిశ్రమలు అయితే అందులో రూ.1,30,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దాదాపు 2,64,000 మందికి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. ఇంకొక ప్రక్క అడ్వాన్స్ స్టేజ్‌లో 1,043 ఉన్నాయి. రూ.5,05,70,000 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. వాటి ద్వారా 11,00,000 ఉద్యోగాలు వస్తాయి. ఈ రెండూ కలుపుకుంటే దగ్గరదగ్గరగా 14,00,000 మందికి ఉద్యోగాలు వస్తాయి. 3,00,000 ఉద్యోగాలు ఎమ్.ఎస్.ఎమ్.ఇలో కూడా వచ్చాయి. ఈ ప్రభుత్వ ఉద్దేశం కనీసం రూ.10,00,000 కోట్ల పెట్టుబడులతో 2019వ సంవత్సరానికల్లా పూర్తి చేయాలని కనీసం 20,00,000 మందికి ఉద్యోగాలు రావాలని ఒక లక్ష్యంగా పెట్టుకుని ముందుకు పోతున్నాము.

అధ్యక్షా, ఇది కాకుండా టూరిజం పైన ఎక్కువ శ్రద్ధ పెట్టాము. స్కిల్ డెవలప్‌మెంట్ పైన ఎక్కువ శ్రద్ధ పెట్టాము. టూరిజం వలన మనకు ఎక్కువ ఉపాధి వచ్చే అవకాశం ఉంటుంది. హ్యాపీనెస్ కూడా వచ్చే పరిస్థితి వస్తుంది. ఇంకొక ప్రక్కన మనమంతా ఈ వ్యవస్థలో ఎక్కడికక్కడ పెద్దయెత్తున ఇంటర్నేషనల్ బెంచ్ మార్కింగ్ పెట్టుకుంటున్నాము. ఇదే సమయంలో సభ్యులందరికీ ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నాను. జూన్ నెలలో 200 అన్న క్యాంటీన్లు రోజుకు 1,00,000 మందికి భోజనం పెట్టే ఏర్పాటు రూ.5కే బ్రేక్‌ఫాస్ట్, రూ.5కే లంచ్, రూ.5కు డిన్నర్ నాణ్యమైన ఐటమ్స్‌తో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాము. దేశంలో ఉన్న వాటిని పరిగణలోనికి తీసుకుని వాటిని ఇంకా మెరుగుపరచి చేస్తున్నామని మీకు తెలియజేస్తున్నాను.

ఇంకొక ప్రక్క శాంతి భద్రతలు. ఇది చాలా ముఖ్యం దీనికి కూడా ఎప్పటికప్పుడు ఒక పద్ధతి ప్రకారం చేస్తూ ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. అనేక అవార్డులు Ease of Doing Business లో మొదటి సంవత్సరంలో

రెండోస్థానం రెండో సంవత్సరంలో ప్రథమ స్థానానికి వచ్చాము. రాబోయే రోజుల్లో ఎప్పటికీ ఫస్ట్ రావాలని అనుకుంటున్నాము. Happiness Commission కూడా ఏర్పాటు చేస్తున్నాము. ఇంకొక ప్రక్కన ఇవన్నీ కూడా చూస్తే ఏవైతే ఈరోజు రియల్ టైమ్ పరిపాలన ద్వారా జిబిఏ గాని కెఐపి గాని సమాజ వికాసం, కుటుంబ వికాసం ఇంకొక ప్రక్క sustainable development goals ఉన్నాయో అవన్నీ కూడా real time monitor చేస్తున్నాము. రాష్ట్రానికి అవార్డులు 38 వరకూ వచ్చాయి. ఈరోజు ప్రభుత్వ ఉద్దేశం ఒక్కటే, మనం కష్టపడదాం. నేను ఈరోజు చెప్పడం కాదు. ఎప్పటి నుండో చెబుతున్నాను. అదే సమయంలో విభజన చట్టంలో పెట్టిన ప్రొవిజన్స్ గానీ, ఇచ్చిన హామీలను గానీ వారు నెరవేర్చాలి. అది మన హక్కు. ఆ హక్కును వారు నెరవేర్చినప్పుడు మనం కూడా ఈ దేశాభివృద్ధికి దోహదం చేస్తాము. అట్లా కాకుండా ఎంత సమయం మాట్లాడినా అవి మాత్రం ఇవ్వము. ఏమైనా అంటే మీరు అభివృద్ధి అవుతున్నారు మేము ఎందుకు ఇవ్వాలని మాట్లాడడం కరెక్టు కాదు. అభివృద్ధి అవుతున్నాము. ఇది ప్రజల కష్టార్జితం. ప్రజల సహకారం, మన నిరంతర శ్రమ. దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాల కంటే మనం వెనుక ఉన్నాము. మనకు తెలివితేటలలో వారికంటే మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండవచ్చు. అలాగని మనకు న్యాయంగా రావాల్సిన హక్కులను, న్యాయమైన విషయాలలో మనకు అన్యాయం చేయడం కరెక్టు కాదు. నేను అందుకనే చాలా స్పష్టంగా ఈ సభ ద్వారా కోరేదేమిటంటే ఎట్టి పరిస్థితులలో ఆరోజు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిన విధంగా చేయవద్దని అంటున్నాను. ఆరోజు కాంగ్రెస్ ప్రభుత్వం హేతుబద్ధత లేని విభజన చేసింది. ఆ అన్యాయానికి, అవమానానికి ప్రజలు చాలా వరకూ భావోద్వేదాలకు గురైనారు. ఎందుకు మాకు ఈ అన్యాయం జరిగిందని అట్టుడుకిపోయే పరిస్థితికి వచ్చారు. ఈరోజు మళ్లీ ఎన్‌డిఏ ప్రభుత్వంతో భాగస్వాములు అయ్యాము. మేము భాగస్వాములు అయ్యామంటే ఈ సమస్య పరిష్కారం చేయాలి. మనకు అండగా ఉంటారు. కాంగ్రెస్ అన్యాయం చేసింది. బిజెపి పార్టీ జాతీయ స్థాయిలో ఉంది, కాబట్టి న్యాయం చేస్తారని ఆరోజు ఎన్.డి.ఏలో చేరాం. ఒక విషయం గుర్తు పెట్టుకోవలసిన అవసరం ఉంది, ఎప్పుడూ కూడా తెలుగుదేశం పార్టీ పనుల కోసమో, పైరవీల కోసమో ప్రయాస పడలేదు. పదవుల కోసం ఎప్పుడూ తాపత్రయపడలేదు. ఆరోజు ఈరోజు కూడా మేము రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆలోచించాము. హైదరాబాదులో సమైక్యాంధ్రప్రదేశ్‌లో undue గానే పనులు అడగలేదు. డబ్బులు అన్నీ మనకు ఇవ్వమని అడుగలేదు. ఆరోజు కష్టపడ్డాము. Open Sky Policy, First time India కి తీసుకొచ్చాము. Emirates Flights, Hyderabad కి వచ్చింది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు దోహదం చేశారు. One of the best Greenfield Airport హైదరాబాదులో నిర్మించిన తరువాత బెంగళూరు, ఢిల్లీ, ముంబై వచ్చాయి. మామూలుగా జాతీయ రహదారులన్నీ ప్రభుత్వం వేస్తుంటే మలేషియాలో క్వాడ్రిలేటర్ తరువాత టూ లేన్, ఫోర్‌లేన్ రోడ్లు బ్రహ్మాండంగా ఉంటే ఆ విషయం వారికి చెబితే గోల్డెన్ కోటిల్ రోడ్డు వచ్చింది.మొదటి బిట్‌లో నేషనల్ హైవేలో ప్రైవేటు సెక్టారులో నెల్లూరు బిట్‌ను డెవలప్ చేసింది మలేషియన్ కంపెనీలు చేశాయని నేను మీకు తెలియజేస్తున్నాను. తడ నుండి చెన్నై వరకు మొదట తయారు చేశారు. మొదటి పవర్ ప్రాజెక్టు జివికె వచ్చింది. ఇవన్నీ కూడా మీరు గుర్తుపెట్టుకోవాలి.

ఎప్పుడూ కూడా మనం వినూత్నంగా ముందుకు వెళుతున్నాము. ప్రోగ్రెసివ్‌గా ఆలోచించాము. కాని ఈరోజు ఆలోచించింది ప్రజల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి రాకూడదు, నిన్న కేంద్ర మంత్రిగారు సెంటిమెంట్‌కు డబ్బులు రావని అన్నారు. సెంటిమెంట్ కోసమే తెలంగాణా ఇచ్చిన విషయాన్ని వారు మరచిపోకూడదు. 60 సంవత్సరాలు కష్టపడి అభివృద్ధి చేసుకున్న మనల్ని కాదు మీరు వెళ్లాల్సిందే అన్నారు. నేను హైదరాబాదును డెవలప్ చేశాను. హైదరాబాద్‌ను ఇంతగా అభివృద్ధి చేశావు, కాని హైదరాబాదును వదిలి వెళ్లాలంటే నీకు బాధగా లేదా అని నన్ను కొంతమంది అడిగారు. నాకు ఎటువంటి బాధ లేదు, తెలుగువారి కోసమే నేను కష్టపడ్డాను, అది కూడా తెలుగుజాతికి ఉన్నది, దానికంటే మిన్నగా అభివృద్ధి చేసి ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటానని చాలా స్పష్టంగా చెప్పాను. ఆరోజున సెంటిమెంట్‌తో విభజన చేసినప్పుడు ఇప్పుడు సెంటిమెంట్స్‌ను గౌరవించాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం పైన లేదా అని నేను అడుగుతున్నాను. విభజన బిల్లును, ఇచ్చిన హామీలను ఒకసారి సమీక్షచేయండని అడుగుతున్నాను. మేము ఇది చేశాము, ఇంకా ఇది చేస్తాము, ఈ కాలపరిమితిలోపు చేస్తామని దేశానికి చెప్పండి. మీరు అవి చెప్పకుండా మీరేం చేస్తున్నారు, నేను ఒకటి అడిగితే మీరు రెండు మాట్లాడతారు.

నేను బిల్లులో ఉన్న 18 అంశాల గురించి మాట్లాడితే బిజెపి వారు కరెంట్ గురించి మాట్లాడతారు. ఇదెక్కడి న్యాయం? కరెంటు అందరికి వచ్చింది, మనకూ వచ్చింది. తెలంగాణాకు కూడా కరెంటు చాలా కొరత ఉంటే ఇప్పుడు అక్కడ మిగులు విద్యుత్ ఉన్నది. కాబట్టి అవి విషయాలు కాదు. ఉదాహరణకు చూస్తే బుందేల్‌ఖండ్ తరహా ఆర్థిక సహాయం చూస్తే ఒక్కొక్క ఇంటికి రూ.5,000/- ఇచ్చారు. మన దగ్గర మొత్తం చూసుకుంటే మన రాష్ట్రానికి రూ.10,000 కోట్లు ఇవ్వాలి. ఆ రేషియోలో చూసుకుంటే మొత్తం ఇప్పటివరకూ రూ.1050 కోట్లు ఇచ్చారు. నేను ఆ స్పిరిట్‌ను ఆలోచించమంటున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బీహార్‌తో ఎలా పోలుస్తారు? యు.పి.తో ఎలా పోలుస్తారు? వారికి రిసోర్సెస్ ఉన్నా డెవలప్ చేసుకోలేకపోవచ్చు. కాని విభజన జరిగింది ఆంధ్రప్రదేశ్‌లో, విభజన జరిగిన తరవాత ఆదాయం పోయింది ఆంధ్రప్రదేశ్‌లో. మనం కష్టపడి హైదరాబాదులో సంపద సృష్టిస్తే లేదు విభజన చేశాము, మీరు హైదరాబాదు నుండి వెళ్లిపోండి అంటే బలవంతంగా ఇక్కడకు వచ్చాము. చట్టంలో కొన్ని అంశాలు పెట్టి, బిల్లు పాస్ చేసేటప్పుడు కొన్ని హామీలు ఇచ్చి, ఆ హామీలను మీరు నెరవేర్చకుండా మరలా ఎదురుదాడి చేయడం ఏం న్యాయమని అడుగుతున్నాను.

మ.2.40

అధ్యక్షా, కొంతమంది దిల్లీ మీడియా వాళ్లు నేను ఎక్కువ అడుగుతున్నానని అంటున్నారు. నేను ఎక్కువ అడగడం లేదు. నేను అడిగేదంతా రీజనబుల్‌గా అడుగుతున్నాను. ఆ రోజు పార్లమెంటులో కేంద్రప్రభుత్వం హామీలు ఇచ్చింది. ఇవి విభజన చట్టంలో ఉన్నాయి. ఈ 18 ఐటమ్స్‌లో ఇవి ఇవి చేశామని డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ద్వారా కేంద్రప్రభుత్వం వారిని చెప్పమనండి. నేను కూడా చెబుతాను. కేంద్రప్రభుత్వం ఏవిధంగా చేయాలో ఆ విధంగా చేస్తే చాలు. ఆ తరువాత ఏవిధంగా కష్టపడాలో మేము కష్టపడతాము. నేను అందుకనే ఒక మాట చెప్పాను. తెలుగు

జాతికి ఎన్టీరామారావు గారు ఆత్మగౌరవాన్ని ఇస్తే, నేను ఆత్మవిశ్వాసం ఇచ్చాను. ఆ ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంతో ముందుకువెళితే మన కష్టాన్ని ఎవరూ తీసేయలేరు. ఆందోళన పేరుతో ఒక పక్కకు వెళ్ళిపోయి మళ్లీ డెవలప్‌మెంట్ ఆపేయ కూడదనే ఉద్దేశంతో, ఈరోజు అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలు ఉన్నా, నేను ఇక్కడ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నా, నీరు–ప్రగతి అంశంపై 8 గంటలకు టెలి కాన్ఫరెన్స్ తీసుకున్నాను. ఇలాంటి కష్టాల్లో రాష్ట్రం ఉన్నప్పుడు నేను ప్రజలను చైతన్యపరిచి, ఆఫీసుల్లో కూడా చెప్పి, మనం ఇంకా ముందుకు వెళ్లాలి, కష్టపడాలి, ముందుకు వెళితే తప్ప ఇది సాధ్యం కాదని స్పష్టంగా చెబుతున్నాను. 14వ ఆర్థికసంఘంలోని గోవిందరావు అనే మెంబర్ రాసిన ఆర్టికల్ ఈరోజు హిందూ దిన పత్రికలో వచ్చింది. 14వ ఆర్థికసంఘంలో స్పెషల్ కేటగిరి స్టేటస్ ఇవ్వవద్దని ఎక్కడా చెప్పలేదని క్లియర్‌గా ఆయనే ఆర్టికల్‌లో రాశారు. నేను అడిగేదేమంటే, కేంద్రం ఏదైతే ఇస్తామని చెప్పిందో అవి ఇస్తే, ఈరోజు కాంట్రవర్షియల్ సిచ్యుయేషన్ కూడా వచ్చేది కాదు. ఆంధ్రప్రదేశ్‌కి ఇవి ఇస్తామని చెప్పాము, మేము ఇచ్చాము అని ఒక్క మాట కేంద్రప్రభుత్వం చెప్పంటే, ఈ పరిస్థితి వచ్చేది కాదు. కావాలని పోస్ట్‌పోన్ చేయడం, సాకులు వెతుక్కోవడం, అక్కడి నుండి లేనిపోని విమర్శలు చేయడం, నేనేదో కావాలని అడుగుతున్నానని చెప్పడం, నేనేదో ఒప్పుకున్నానని చెప్పడం చేశారు. ఇవన్నీ కరెక్టు కాదు. ఈ దేశంలో ఇంతవరకు ఉన్న నాయకుల్లో నేను కూడా ఒక సీనియర్ నాయకుడిని, నాకు కూడా ఒక హుందాతనం ఉంది, ఒక మద్దతు ఉంది, ఒక గౌరవం ఉంది. ఈ దేశంలో ఎకనామిక్ రిఫార్మ్స్‌ను నేనే మొదటగా అమలు చేశాను. టెక్నాలజీని నేనే అడాప్ట్ చేసుకున్నాను. అందరికంటే ఎక్కువ సమయం ముఖ్యమంత్రిగా నేనే ఉన్నాను. నా తరువాతనే ఇప్పుడు ఉన్న వాళ్లంతా ముఖ్యమంత్రులుగా వచ్చారు. కానీ ఈరోజు నేను అడిగేదేమంటే, ఇది మన బాధ్యత అవునా, కాదా? ఒక రాష్ట్రంలో సెంటిమెంట్ ఉన్నప్పుడు, ఒక రాష్ట్రంలో ఒక సమస్య ఉన్నప్పుడు, ఆ రోజు జరిగిన విధానం తప్పని అందరం ఖండించినప్పుడు తిరిగి అదే విధానాన్ని కేంద్రం కొనసాగిస్తే ఏమనుకోవాలి. ఆ విషయమే నేను అడుగుతున్నాను. వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ వారు కౌన్సిల్‌కి రాలేదు, అసెంబ్లీకి రాలేదు. వాళ్లు హ్యాపీగా రోడ్లు మీద తిరుగుతున్నారు. ఇవాళ కాకపోతే రేపైనా పార్లమెంటులో రాజీనామా చేసి వచ్చేస్తామంటారు. అదెలా కుదురుతుంది? ప్రజలు మనల్ని సమస్యలపై పోరాడమని పంపించారు తప్ప, ఇక్కడి నుండి బయటకి వెళ్లమని ఎవరూ చెప్పలేదు. ఆ రోజు ఇదేవిధంగా చేశారు. ఆ రోజు బెయిల్ కోసం కక్కుర్తి పడి సమైక్య ఆంధ్రప్రదేశ్ ముసుగులో పోరాటాలు చేశారు. ప్రజలు అర్థం చేసుకున్నారు. ఇప్పటికి కూడా నిన్న, మొన్న మోదీ గారి పైన నమ్మకం ఉందని మాట్లాడుతున్నారు. మేము కూడా ఆ నమ్మకమే పెట్టుకున్నాం, ఆ నమ్మకాన్ని మోదీగారు నిజం చేసే పరిస్థితిలో లేరు కాబట్టి, గట్టిగా అడిగే పరిస్థితికి వచ్చాము. ఆయన తిరుపతిలో ఏమి చెప్పారంటే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజన చేసి తప్పు చేసింది. తల్లికి ఆపరేషన్ చేసి బిడ్డను బ్రతికించి, తల్లిని చంపేశారు. నేను తల్లిని కాపాడమని ఆయన్ని అడుగుతున్నాము. ఆరోజు కాంగ్రెస్ పార్టీవారు తల్లిని చంపేశారని కేంద్రప్రభుత్వమే చెప్పింది కాబట్టి, ఆ తల్లిని కాపాడే బాధ్యత వారు తీసుకుంటారని వారితో వచ్చాము. ఆ తల్లిని కాపాడమని ప్రధానమంత్రి గారికి మరొక్కసారి మీ ద్వారా, ఈ సభద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈరోజు మనందరం కూడా ఆలోచించాల్సిందేమంటే, ఈ రాష్ట్రం శాశ్వతం, రాజకీయ పార్టీలు కాదు. ప్రజల అభిమానం ఉంటే మనందరం ఉంటాము. నాకు హైకమాండ్ ఎవరూ లేరు. నా హై కమాండ్ ఐదు కోట్ల ప్రజానీకం. ఈ ప్రజలు ఏమి చెబితే, అది చేయడం తప్ప వేరేది చేయాలనే ఆలోచన, మార్గం నాకు లేదు. ఆల్ ఇండియా పార్టీలకు హై కమాండ్ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బి.జె.పి పార్టీ వాళ్ళు కేంద్రానికి వెళ్ళి, మీవాళ్ళని కన్విన్స్ చేయండని కోరుతున్నాను. మీరు నన్ను తిడితే వచ్చే లాభం ఏమీ లేదు. నేను చాలా స్పష్టంగా ఉన్నాను. మీరు తిట్టినా, తిట్టకపోయినా నేను చేస్తాను. ఎక్కడా వదిలిపెట్టను. మీరు ఎన్ని మాట్లాడినా కూడా నేను దేనికోసం ఎక్కడా రాజీ పడను. నేను ఇంకొకటి కూడా చెబుతున్నాను. కేంద్రప్రభుత్వం హక్కు కింద ఇవ్వాలి. మాట నిలబెట్టుకోవాలి. చట్టాన్ని గౌరవించాలి. ఆ రోజు రాజ్యసభలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వారికి ఉంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సహాయాన్ని తీసుకుంటూనే, దానికోసం పోరాడుతూనే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక విజన్ ఇచ్చాను. 2022వ సంవత్సరానికి భారత దేశంలోని మూడు అగ్రరాష్ట్రాల్లో ఒక రాష్ట్రంగా ఈ రాష్ట్రం ఉంటుంది. 2029వ సంవత్సరానికి భారతదేశంలో నెం.1 రాష్ట్రం ఏదంటే, హ్యాపినెస్ ఇండెక్స్‌గా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉంటుంది. 2050వ సంవత్సరంలో అత్యున్నత స్థానంలో ఈ రాష్ట్రం ఉంటుంది. దానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మీకు తెలియజేస్తున్నాను. కాబట్టి ఈ సభ ద్వారా మళ్లీ ఒక సారి రిక్వెస్ట్ చేస్తున్నాను. ఒక జాతీయ పార్టీ ప్రజల మనోభావాలతో ఆడుకోవడం ఏమాత్రం మంచిది కాదు. ప్రాంతీయ పార్టీలకు ఆ రాష్ట్రమో, ఆ ప్రాంతమో, ఆ జిల్లా అనో ఆలోచన ఉంటుంది. కానీ, జాతీయ పార్టీ జాతి ప్రయోజనాల గురించి ఆలోచించాలి. ఏ రాష్ట్రంలో కూడా ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలి. కాంగ్రెస్ పార్టీ తప్పు చేసింది కాబట్టి మేము కూడా తప్పు చేస్తాం అని బి.జె.పి. పార్టీ కూడా తప్పు చేస్తే భవిష్యత్తులో దేశానికే మంచిది కాదు. నేను గట్టిగా చెబితే కొంతమంది నాపై విరుచుకుపడతారు కాబట్టి నేను చెప్పడం లేదు కానీ, నేను కాంగ్రెసు పార్టీ రాష్ట్ర విభజన చేసిన రోజు కూడా చెప్పాను కాంగ్రెసు పార్టీ వల్ల ఈ దేశానికి చాలా నష్టం వచ్చింది. మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి పనులు చేస్తున్నారు, ఇది మంచిది కాదని ఆరోజు నేను చెప్పాను. ఈ రోజు కూడా నేను ఇక్కడున్న సభ్యులందరినీ కోరేది, ప్రజానీకాన్ని కోరేదేమిటంటే, మనకు రావలసినటువంటి హక్కుల కోసం పోరాడదాం, సాధించుకుందాం, అందులో రాజీ పడేది లేదు. ప్రత్యేక హోదాతో సహా, విభజన చట్టంలో మనకు ఇచ్చిన హామీలు గానీ, ప్రొవిజన్స్ గానీ, పార్లమెంటులో ఇచ్చిన హామీల కోసం పోరాడదాం. సాధించే వరకు ఎట్టి పరిస్థితులలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు. అదే సమయంలో ఇంకా కష్టపడి పని చేద్దాం. జపాన్ మాదిరిగా పని చేద్దాం. రెండవ ప్రపంచ యుద్ధంలో పూర్తిగా స్మశానంగా మారిపోయినటువంటి జపాన్ దేశం మళ్లీ పుంజుకుంది. ఎక్కడో ఆందోళన చేయాలని నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని ఇంకా 3,4 గంటలు ఎక్కువగా పనిచేస్తారు. మనం కూడా అదే పని చేద్దాం. ఆరోజు కూడా చెప్పాను, ఈరోజు మనకు చేసిన అన్యాయానికి ఎవరైతే అన్యాయం చేశారో వాళ్లు బాధ పడే విధంగా మనం కష్టపడి పనిచేసి అందరికంటే ముందుడాలని చెప్పాను. అందులో అనుమానం లేదు. నేను ఈరోజు ఎన్డీఏ ప్రభుత్వాన్ని కోరేదేమంటే, మేము ఇప్పుడు కూడా ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాము. తక్షణమే మా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి.

విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రజలను కన్విన్స్ చేయాలి కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించమని, గౌరవిస్తారని కోరుకుంటూ నాకు ఈ అవకాశమిచ్చిన మీకు, సభ్యులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జైహింద్.

**CHAIRMAN:** Now, I request Sri Payyavula Keshav to move the General Discussion on Annual Financial Statement (Budget).

**శ్రీ పయ్యావుల కేశవ్ :** అధ్యక్షా, 2018-19 బడ్జెట్ పై చర్చను ప్రారంభించేటువంటి అవకాశం నాకు ఇచ్చినందుకు నేను హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారి ఆలోచనలకు అక్షర రూపాల్ని ఇస్తూ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి గారు ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్‌ను మనస్ఫూర్తిగా సమర్పిస్తున్నాను.

**MR. CHAIRMAN:** The Motion proposed by Sri Manikya Vara Prasad garu, Government Whip, on Governor Address is before the House,

"That the Members of Andhra Pradesh Legislative Council assembled in the 13th session are deeply grateful to the Governor for the Address which he has been pleased to deliver in Legislative Council on 5.03.2018."

(Pause)

The Motion was adopted and the Resolution was carried.

**MR. CHAIRMAN:** The House stands adjourned to meet again at 10.00 a.m. tomorrow.

(The House then adjourned at 2.07 P.M. to meet again at 10.00 A.M. on Wednesday, the 14th March 2018)

----- x -----

“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.